

మార్కాపురం వైసీసీలో అంతర్గత రగడ ఆరంభమైంది. మున్సిపల్ చైర్మన్ పదవే అందుకు కారణమైంది. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం చైర్మన్ మార్పునకు సిద్ధమైతే సఫలీకృతమవుతామా? అధికార టీడీపీ పవర్ రాజకీయాలు చేస్తే మన పరిస్థితి ఏమిటి? అన్న ఆందోళన వైసీపీ నేతల్లో నెలకొంది. అసలు ఈ విషయంలో ఎవరు ప్రధాన భూమిక పోషించాలన్న అంశంపై మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, నాగార్జునరెడ్డి కొట్టుమిట్టాడుతున్నారు. అదేసమయంలో పలువురు వైసీపీ కౌన్సిలర్లు చాన్స్ దొరికితే సైకిలెక్కాలని ఉబలాటపడుతుండటంతో ఆపార్టీ నేతల్లో కలవరం మొదలైంది.

- మార్కాపురం మున్సిపల్ చైర్మన్ పదవి బదిలీపై తర్జనభర్జన
- ఇరకాటంలో వైసీపీకి చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు
- టీడీపీ వైపు ఆపార్టీ కౌన్సిలర్ల చూపు
- వేచిచూస్తున్న అధికార పార్టీ నాయకులు


మార్కాపురం మున్సిపాలిటీ కార్యాలయం

వైసీపీలో మున్సిపల్ రగడ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత మున్సిపల్ ఎన్నికల్లో మార్కాపురం మున్సిపాలిటీలో వైసీపీ ఘన విజయం సాధించింది. మొత్తం 35 డివిజన్లకు గాను 30 స్థానాలను ఆపార్టీ కైవసం చేసుకుంది. చైర్మన్ ఎంపిక విషయంలో అప్పటి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి నిర్ణయానికి వ్యతిరేకంగా జగన్ నిర్ణయం తీసుకోవడంతో సమస్య ఆరంభమైంది. పట్టణంలో వైద్యురాలైన కనకదుర్గను చైర్మన్‌ను చేయాలని ఎమ్మెల్యే భావించారు. ఆ మేరకు ఆమెకు హామీ ఇచ్చి ఎన్నికల వ్యయం కోసం ఆర్థిక సహకారం పొందారు. కౌన్సిలర్ల గెలుపు అనంతరం జగన్ జోక్యం చేసుకొని డాక్టర్ కనకదుర్గ.. రెడ్డి అయినందుకు వేరే సామాజికవర్గం వారికి చైర్మన్ పదవి ఇవ్వాలని ఆదేశించారు. తదనుగుణంగా నాగార్జునరెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన ఆర్యవైశ్య వర్గానికి చెందిన చిర్లంచెర్ల బాలమురళీకృష్ణను చైర్మన్ పదవికి ఎంపిక చేశారు. దీంతో నిరాశపడ్డ డాక్టర్ కనకదుర్గ తన వద్ద మున్సిపల్ ఎన్నికల వ్యయం కోసం తీసుకున్న డబ్బులు వెనక్కు ఇవ్వాలని నాగార్జునరెడ్డిపైనా, ఆయన సోదరుడిపైనా ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో చైర్మన్ అయిన మురళీకృష్ణ నుంచి వారిద్దరూ కొంత డబ్బు తీసుకొని ఆమెకు చెల్లించినట్లు తెలిసింది. తనకు ఇంకా రెండు కోట్లు రావాల్సి ఉందని ఆమె అడిగినట్లు సమాచారం. ఈ పరిణామాల నడుమ ఆమెను శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా నియమించారు. ఆమె 'ఇదేం పదవి.. నాకు మున్సిపల్ చైర్మన్ పదవి అయినా ఇవ్వండి.. లేదా నా డబ్బు వెనక్కు ఇప్పించండి' అని జగన్ నుంచి కిందిస్థాయి వరకూ ఒత్తిడి పెంచారు.

ఓటమితో సమస్య మొదటికి


తాజా ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం తాజాగా రగడకు కారణమైంది. మార్కాపురం మునిసిపాలిటీలో ఉన్న రెండు పోలింగ్ బూత్‌లలో మినహా మిగిలిన అన్నింటిలోనూ టీడీపీ కూటమి అభ్యర్థికి ఆధిక్యం వచ్చింది. వైసీపీకి రెండు బూత్‌లలో ఒక చోట 30, మరోచోట 50 ఓట్ల మెజారిటీ మాత్రమే లభించింది. ఇక ప్రభుత్వం మారగానే ఎమ్మెల్యే నారాయణరెడ్డి వద్దకు యంత్రాంగం మొత్తం చేరింది. దీంతో పలువురు వైసీపీ కౌన్సిలర్లు కూడా టీడీపీ వైపు దృష్టిసారించారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.

టీడీపీ వైపు వైసీపీ కౌన్సిలర్ల చూపు

తాజా పరిణామాలతో ఈ గోలంతా మనకెందుకు టీడీపీలో చేరితే బాగుంటుందన్న ఉద్దేశంతో వైసీపీ కౌన్సిలర్లు ఆవైపు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. 'ఎలాగూ అధికారులు మనమాటే వింటారు. మనం చెప్పిన పనులే జరుగుతాయి. ఇప్పుడు మన జోక్యం ఎందుకు. ఆ పార్టీలో ఏం జరుగుతుందో వేచి చూడండి' అని ఆయన టీడీపీ నాయకులకు చెప్పినట్లు తెలిసింది.

ఎమ్మెల్యే అభ్యర్థుల మార్పుతో సీన్ రివర్స్

అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న నాగార్జునరెడ్డి.. కనకదుర్గను బుజ్జగిస్తూ వస్తున్న నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. నాగార్జునరెడ్డిని గిద్దలూరు పంపి గిద్దలూరు నుంచి రాంబాబును మార్కాపురం అభ్యర్థిగా బదిలీ చేశారు. వెంటనే కనకదుర్గ అప్రమత్తమయ్యారు. 'నా సంగతి తేల్చాల'ని నాగార్జునరెడ్డి ఇంట్లో తిష్ట వేశారు. ఆయన మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణను పిలిపించి ఆమెకు డబ్బులు ఇవ్వండి లేదా పదవి నుంచి తప్పుకోండని పట్టుబట్టారు. మురళీకృష్ణ ప్రస్తుతం తన వద్ద అంత డబ్బులు లేవంటూ ఎర్రగొండపాలెంలో తాను కడుతున్న అపార్ట్‌మెంట్‌లో మూడు ఫ్లాట్‌లు ఆమెకు ఇస్తానని లిఖితపూర్వకంగా రాసిచ్చారు. అయితే హామీ పత్రంలో ఆయన తాను ఐదేళ్లపాటు చైర్మన్‌గా ఉంటేనే మూడు ఫ్లాట్లు ఇస్తానని మధ్యలో తనను పదవి నుంచి తొలగించినా? వేరే రూపంలో తాను పదవి వదులుకోవాల్సి వచ్చినా? వాటిని ఇవ్వనని స్పష్టంగా పేర్కొన్నారు. ఆ తర్వాత మార్కాపురం అభ్యర్థిగా వచ్చిన రాంబాబు వద్దకు కనకదుర్గ వెళ్లి తన విషయాన్ని తేల్చాలని పట్టుబట్టినట్లు తెలిసింది. మునిసిపల్ చైర్మన్ తన సామాజికవర్గమే అయినందున తాను ఎమ్మెల్యేగా గెలుపొందితే మురళీకృష్ణను మార్చి చైర్మన్‌గా కనకదుర్గకు అవకాశం కల్పించవచ్చన్న ఉద్దేశంతో ఎన్నికల అనంతరం సమస్యను సానుకూలంగా పరిష్కరించుకుందామని రాంబాబు హామీ ఇచ్చారు.



ఇరకాటంలో మాజీలు

ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని కలిసి తనను పదవిలో కొనసాగిస్తే ఎన్నికలకు ముందు రాసిచ్చిన ఒప్పంద పత్రానికి కట్టుబడి ఉంటానని, తనను మార్చి కనకదుర్గకు చైర్మన్ పదవి ఇచ్చినా అభ్యంతరం లేదని చెప్పారు. ఒకవేళ అలా జరిగితే.. అప్పటి ఒప్పందం మేరకు, ఏ రూపంలో తాను పదవి కోల్పోయినా.. చేసుకున్న ఒప్పందం అమలు కాదని తేల్చిచెప్పినట్లుగా తెలిసింది. మరోవైపు విదేశాల నుంచి వచ్చిన కనకదుర్గ నేడు మార్కాపురం రానున్నారు.

పట్టుబడుతున్న మద్దతుదారులు

ఇటు నాగార్జునరెడ్డి, అటు రాంబాబును కనకదుర్గ మద్దతుదారులు కలిసి.. ఎన్నికలకు ముందు చైర్మన్ మురళీకృష్ణ రాసిచ్చిన హామీపత్రం మేరకు ఆయన్ను పదవి నుంచి తప్పించి కనకదుర్గను చైర్మన్‌ను చేయాలని పట్టుబట్టినట్లు తెలిసింది. ఈ విషయంలో ఎవరు బాధ్యత తీసుకోవాలన్న విషయంలో మాజీ ఎమ్మెల్యేలు ఇద్దరూ ఇరకాటంలో పడ్డారు. ప్రస్తుతం మార్కాపురం ఇన్‌చార్జి రాంబాబు అయినందున హామీ పత్రాన్ని ఆయనకు పంపి విషయం చెబుతానని, అక్కడ తేల్చుకోవాలని నాగార్జునరెడ్డి చెప్పినట్లు సమాచారం. కౌన్సిలర్లు అందరూ నాగార్జునరెడ్డి పెట్టినవారేనని, ఆయన దగ్గరే తేల్చుకోవాలని రాంబాబు అన్నట్లు తెలిసింది. ఇద్దరు మాజీల మాటలతో కంగుతిన్న డాక్టర్ కనకదుర్గ మద్దతుదారులు మున్ముందు ఎలా వెళ్లాలన్న అంశంపై తర్జనభర్జన పడుతున్నారు. చైర్మన్ మురళీకృష్ణ మాత్రం 'నాయకులు చెబితే పదవి వదిలేస్తా, ఒప్పందం మేరకు అపార్టుమెంట్‌లలో ఫ్లాట్లు ఇవ్వను. ఒకవేళ నన్ను టీడీపీ వారు తొలగించినా ఇవ్వను' అని తేల్చిచెప్పారు. ఈ సమస్యపై రాంబాబు, నాగార్జునరెడ్డిలు తర్జనభర్జన పడుతున్నారు.

ఉపాధిలో గోల్‌మాల్..!

- పనులకు రానివారికి మస్టర్లు
- ఫీల్డ్ అసిస్టెంట్ల అడ్డగోలు దందా
- అక్రమాలు బయటపడతాయని ఉద్యోగాలకు రాజీనామాలు
- చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టు

దర్శి, జూలై 9 : ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలు భారీగా జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అనేక గ్రామాల్లో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలు పనులకు రాకుండానే మస్టర్లు వేసి చెరు సగం పంచుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ అధికారం కోల్పోవడంతో.. ఐదు సంవత్సరాలుగా అడ్డగోలుగా వ్యవహరించిన ఫీల్డ్ అసిస్టెంట్లు తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతో ముందుగానే రాజీనామాలు చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని శాఖల్లో ప్రక్షాళన ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా దర్శి నియోజకవర్గంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు, జరిగిన పనుల వివరాలను ఇప్పటికే సేకరించినట్లు తెలుస్తుంది. నియోజకవర్గంలో మొత్తం 95 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా ఇప్పటికే 50 మంది రాజీనామాలు చేశారు. దర్శి మండలంలో 25 మంది ఉండగా 17 మంది రాజీనామాలిచ్చారు. తాళ్లూరు మండలంలో 16 మంది ఉండగా 14 మంది రాజీనామాలు చేశారు. ముండ్లమూరు మండలంలో 21 మంది ఉండగా 10 మంది రాజీనామాలు సమర్పించారు. దొనకొండలో 18 మంది ఉండగా 8 మంది రాజీనామా చేశారు. కురిచేడు మండలంలో 15 మంది ఉండగా ఒక్కరు మాత్రమే రాజీనామా చేశారు. మరో రెండు రోజుల్లో మరి కొంతమంది రాజీనామాలు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామాలు ఎంపీడీవోకు సమర్పించడంతో కొత్తవారిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

...నట్లు వ్యవహరిస్తున్నారు. సామాజిక తనిఖీల సందర్భంగా ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ రూ.లక్ష చొప్పున ముడుపులు చెల్లించినట్లు విమర్శలున్నాయి. జిల్లా అధికారులు ముడుపులు తీసుకొని అక్రమాలకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అలాగే ఐదేళ్లు కొనసాగించారు. కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడడమే కాక వైసీపీ కార్యకర్తల్లా కూడా వ్యవహరించారు. కొంతమంది వైసీపీ కండువాలు వేసుకొని ప్రచారాలు చేశారు.

గత ఎన్నికల్లో వైసీపీతో అంటకాగిన ఫీల్డ్ అసిస్టెంట్ల వివరాలను సేకరిస్తున్నారు. ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి, అక్రమార్కులపై చర్యలు తీసుకునేలా దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకులు ఉన్నతాధికారులకు అన్ని వివరాలను ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేశారు.


ఉపాధిపనుల్లో అక్రమాలపై అధికారులను నిలదీస్తున్న ముండ్లమూరు గ్రామస్థులు(ఫైల్)

ఉన్నతాధికారుల అండతోనే అక్రమాలు

జిల్లా ఉన్నతాధికారుల అండదండలతోనే ఉపాధి పనుల్లో అవినీతి అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏడాది నిర్వహించే సామాజిక తనిఖీలను మొక్కుబడిగా చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆ తనిఖీల్లో గుర్తించిన కొద్దిపాటి అక్రమాలపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దర్శి మండలంలో మొక్కలు నాటి పెంచినట్లు లక్షలాది రూపాయలు డ్రా చేసుకున్నా అక్కడ మొక్కలు లేవు. సామాజిక తనిఖీలో ఆ విషయం బయటపడినా అధికారులు నిమ్మకునీరెత్తి... ...రన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దర్శి, జూలై 9 : చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు నీరు వెల్లబెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఈఈ టీ నాగమురళీమోహన్ స్పష్టం చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో చేపలకోసం నీళ్లు వదిలేశారు అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. చేపల కోసం ఏయే గ్రామాల్లోని చెరువుల్లో నీరు విడిచిపెట్టారో వివరాలు తీసుకొని అందుకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా మత్స్య శాఖ అధికారులకు కూడా సూచనలు చేస్తామని ఆయన తెలిపారు.

రైతుబజార్లలో రాయితీపై బియ్యం, కందిపప్పు
జేసీ గోపాలకృష్ణ
లోపలి పేజీల్లో...

'రియల్'గా రెచ్చిపోయారు!

- అక్రమ వెంచర్ల ఏర్పాటులో ఆరితేరిన నేతలు
- అసైన్డ్ భూములే ఆదాయ వనరుగా మార్చుకున్న వైసీపీ నాయకులు

కనిగిరి, జూలై 9: కనిగిరి నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో సాగిన అసైన్డ్ అక్రమాల పరంపర ఒక్కొక్కటిగా బయటపడుతోంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పేదలకు చెందిన అసైన్డ్ భూములను బెదిరించి కొనుగోలు చేసి వాటిల్లో వెంచర్లు వేసి వైసీపీ నేతలు కోట్లకు పడగలెత్తారు. ఏకంగా నియోజకవర్గ, మండల స్థాయి ప్రజాప్రతినిధి పదవులకే పోటీచేసేలా పేదల సొమ్ము బొక్కి రాజకీయ బాటలు వేసుకున్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే అండతో కొందరు నేతలు పేట్రేగిపోయారు. అమాయక ప్రజల్ని నమ్మించి వారికి అక్రమ భూముల్లో వేసిన వెంచర్లలోని ప్లాట్లను కట్టబెట్టారు. దళారీ గ్రూపును తయారుచేసి వెంచర్లపై పెద్దఎత్తున ప్రచారాలు చేశారు. వారు వేసే వెంచర్ల వద్ద పెద్దఎత్తున అభివృద్ధి జరుగబోతుంది అంటూ అరచేతిలో వైకుంఠం చూపించారు. కనిగిరి నియోజకవర్గంలో వెలసిన ఏ వెంచరుకు ప్రభుత్వ అనుమతి లేకపోయినా అన్నీ ఉన్నట్లు ప్రజల్ని తప్పుదోవ పట్టించారు. దీంతో అమాయకపు జనం నమ్మి మోసపోయారు. ప్రస్తుతం ఆయా అనధికార, అక్రమ భూములపై అధికారులు ఉదాసీనతగా ఎందుకు వ్యవహరిస్తున్నా...


అనధికార వెంచర్లో ప్లాటుకు వేసిన ఫెన్సింగ్

250 ఎకరాల్లో అక్రమ వెంచర్లు

కనిగిరి నియోజకవర్గంలో దాదాపు 250 ఎకరాల్లో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. వైసీపీ ప్రభుత్వంలో దాదాపు 50 నుంచి 70 ఎకరాల్లోని అసైన్డ్, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో వెంచర్లు వేసి కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును దిగమింగిన నేత చివరకు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీలోకి దిగారంటే అక్రమార్జన ఏస్థాయికి చేరిందో అని ప్రజలు విస్తుపోయారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీలో నిలబడి ఓటమి పాలైన దద్దాల నారాయణయాదవ్ కనిగిరి మండలంలో దాదాపు 20 ఎకరాల్లో అసైన్డ్ భూముల్లో అనధికార వెంచర్లు వేసి అమాయకుల్ని మోసం చేసి కోట్లు సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలం లేదు

అక్రమార్కుల ఆగడాలు, ఆక్రమణలతో ప్రభుత్వ భూములలో వెంచర్లు వెలిశాయి. ఆ కారణంగా కనిగిరి డివిజన్‌స్థాయి కార్యాలయాల ఏర్పాటుకు ఇప్పుడు సెంటు భూమి కూడా లేని పరిస్థితి ఏర్పడింది. అభివృద్ధిని ఆశిస్తున్న ప్రజలకు కార్యాలయాల ఏర్పాటు కాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీవో, డీఎస్పీ, ఎలక్ట్రికల్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్డీవో కార్యాలయాల ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది.

వెలిసిన వెంచర్లు

- కనిగిరి - కంభం రోడ్డులోని 203/సీలోని డాటెడ్ భూమిని రెవెన్యూ రికార్డులు మార్చి ప్రజల్ని ఏమార్చి 5 ఎకరాల్లో వెంచర్లు వేశారు.
- కనిగిరి - ఒంగోలు రోడ్డులోని వేశపోగు సుబ్బారాయుడుకు చెందిన 900/ఏలోని 2.5ఎకరాల అసైన్డ్‌భూమిని ఆయా భూమికి చెందిన దళితుడిని బెదిరించి తక్కువకు కొని ప్లాట్లు వేసి అమ్ముకున్నారు.
- కనిగిరి - కంభం రోడ్డులో తుమ్మకుంట గ్రామ పరిధిలోని చిట్టిబోయిన వీరమ్మకు చెందిన 300/5 సర్వే నెంబరులోని 5 ఎకరాల అసైన్డ్ భూమిలో వెంచరు వేసి అమ్ముకున్నారు.
- కనిగిరి - కంభం రోడ్డులో తుమ్మకుంట గ్రామపరిధిలోని ఊటుకూరి వెంకటసత్యనారాయణకు చెందిన సర్వే నెంబరు 302/2లోని 5.44 ఎకరాల అసైన్డ్ భూమిలో వెంచర్లు వేసి సొమ్ము చేసుకున్నారు.


కనిగిరి-ఒంగోలు రోడ్డులోని అసైన్డ్ భూమిలో దద్దాల వెంచరు

అధికారులు తేల్చినవి 20 ఎకరాల వరకు ఉంటే బినామీల ద్వారా ఇంకా 50 ఎకరాలకు పైగా సదరు నేత అక్రమంగా వెంచర్లు వేసినట్లు తెలుస్తోంది.

- పై భూముల్లో వెంచర్లు వేసే క్రమంలో పక్కనే వాగు, కొండ, పశువుల పోరంబోకు భూములను కూడా ఆక్రమించి కలిపేసుకున్నా అప్పట్లో ఏ అధికారీ పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా కొందరు రెవెన్యూ అధికారులు అక్రమార్కులు ఇచ్చే మామూళ్ల కోసం కక్కుర్తి పడి పేద, దళిత, బడుగు వర్గాలకు చెందిన భూములను వారికి తగ్గట్టుగా రికార్డులను తారుమారు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆయా భూములను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

కాస్తంత ఊరట

- నెల తర్వాత మోస్తరు వర్షం
- మొదలైన పొలం పనులు



ఒంగోలు, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దాదాపు నెలరోజుల తరువాత జల్లులు పడ్డాయి. కొన్ని మండలాల్లో ఒక మోస్తరు వర్షమే కురవడంతో జిల్లా ప్రజానీకం ప్రత్యేకించి రైతాంగానికి కాస్తంత ఊరట కలిగింది. దాదాపు నెలరోజులుగా జిల్లాలో జల్లులు లేకపోవడమే కాక ఎండ తీవ్రత కూడా పెరిగింది. గత నెలాఖరులో వేసవిని తలపిస్తూ పలు ప్రాంతాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖరీఫ్ సాగు జోరందుకోవాల్సిన సమయంలో వర్షం లేకపోవడమే కాకుండా ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో రైతులు ఆందోళన చెందారు. జిల్లాలో ఖరీఫ్‌లో సుమారు 2.02 లక్షల హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా ఈ సమయానికి 30వేల హెక్టార్లకుపైగా సాగు కావాలి. అలాగే ఖరీఫ్ పంటల సాగు జోరందుకోవాలి. అయితే కేవలం 11వేల హెక్టార్లలోపు సాగు కావడమే కాక వేసిన పైర్లు కూడా పలు చోట్ల వాడుముఖం పట్టాయి.

తొలకరి దాటుతున్న వేళ..

సజ్జ, నువ్వు, పెసర పంట తొలకరి పైర్ల సాగుకు సమయం దాటిపోగా కీలక ఖరీఫ్ పంటలైన కంది, పత్తి సాగుకు ప్రతికూల వాతావరణం నెలకొంది. ఇలాంటి పరిస్థితులలో రెండు రోజులుగా వాతావరణంలో మార్పు చోటుచేసుకొని ఉష్ణోగ్రతలు తగ్గాయి. అంతేకాక మంగళవారం తెల్లవారుజామున జల్లులు పడ్డాయి. పలుచోట్ల మోస్తరు వర్షమే కురిసింది. జిల్లాలో మంగళవారం ఉదయం 9 గంటలకు గడచిన 24 గంటల్లో సగటున 10.60 మి.మీ వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా పొన్నలూరులో 54.40 మి.మీ కురవగా మద్దిపాడులో 39.40, జరుగుమల్లిలో 37.2, ఒంగోలులో 34.20, రాచర్లలో 33.2 శింగరాయకొండలో 27.4, ఎన్‌జీపాడులో 26.2 మి.మీ కురిసింది. ఐదారు మండలాలు మినహా ఇతర ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈ వర్షం పడగా మరో రెండు, మూడు రోజులు జల్లులు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. తాజా వర్షంతో రైతులు ఊరట చెందగా మరింత వర్షం పడితే ఖరీఫ్ సాగు ముందుకు సాగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


ఒంగోలులో కురుస్తున్న వర్షం



మంత్రి లోకేష్‌తో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి

మంత్రి లోకేష్‌ను కలిసిన మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 9 : రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో లోకేష్‌ను కలిసి పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీ తనయుడు మాగుంట రాఘవరెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు కృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన పోతుల

టంగుటూరు, జూలై 9 : మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు మంగళవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రులు నారా లోకేష్‌బాబు, కొల్లు రవీంద్రలను మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఉన్నప్పటికీ చంద్రబాబు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో బిజీగా ఉండడంతో అవకాశం లభించలేదు. ఈ సందర్భంగా మంత్రులను కలిసి మాట్లాడారు. వీరి మధ్య నేటి రాజకీయాలు, కొండపి, కందుకూరు నియోజకవర్గాల రాజకీయ పరిస్థితులపై చర్చ నడిచింది. పోతుల వెంట రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, పోతుల సోదరుడు పోతుల రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకుడు చదలవాడ వేణు ఉన్నారు.

బాలికల వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

ఒంగోలు నగరం, జూలై 9: ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్ పక్కనే ఉన్న ఆనంద నిలయం బాలికల వసతిగృహాన్ని మంగళవారం రాత్రి కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో విద్యార్థినులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అంటూ ఆరా తీశారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చేపడుతున్న చర్యలను , వసతిగృహంలో ఉన్న సమస్యలను చెప్పాలని కలెక్టర్ విద్యార్థినులను అడిగారు. డ్రైనేజీ నీరు బయటకు పోకపోవటంతో ఇబ్బందిగా ఉందని విద్యార్థినులు తెలిపారు. దీంతో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని ఆమె కోరారు. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను ఉపయోగించుకుని ఉన్నత చదువులు చదవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.

రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీశైలం పాదయాత్ర



కాలినడకన శ్రీశైలం వెళ్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

పెద్దదోర్నాల, జూలై 9: దోర్నాలలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయం నుంచి రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ తన మొక్కులు తీర్చుకునేందుకు కాలినడకన మంగళవారం శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించాలని, అదేక్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని శ్రీశైలంలో కొలువైన శ్రీభ్రమరాంబికామల్లికార్జునస్వామి వార్లను మొక్కుకున్నారని, దానిని తీర్చుకునేందుకు దోర్నాల వచ్చినట్లు జనసేన నాయకులు తెలిపారు. ఈ క్రమంలో అయ్యప్పస్వామి దేవాలయంలో కొబ్బరికాయ కొట్టి కాలినడకను ప్రారంభించారు. ఎమ్మెల్యే రాకను తెలుసుకున్న జనసేన పార్టీ మండల అధ్యక్షులు కేతి మురళి, నాయకులు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే శ్రీధర్‌కు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఆయన వెంట కొంతదూరం ప్రయాణించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.సుబ్బారెడ్డి, చంటి, షేక్ మంజూర్‌బాష, బట్టు సుధాకర్‌రెడ్డి, రావిక్రింది సుబ్బరత్నం, చెన్నారెడ్డి, కె.శ్రీనివాసయాదవ్, తాతిరెడ్డి, జనసేన నాయకులు వేమా దాసయ్య, గుర్రం ప్రసాద్, పండు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ నిర్మాణాలకు నిధులివ్వండి

● మంత్రి స్వామిని కోరిన ఎరిక్షన్‌బాబు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూలై 9 : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో సాంఘిక సంక్షేమ వసతిగృహ భవనాలు, గిరిజన వసతి భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి బాలవీరాంజనేయస్వామికి ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ వినతిపత్రం అందజేశారు. మంగళవారం అమరావతిలో మంత్రి చాంబర్ కలఇసి నియోజకవర్గంలో ఉన్న సమస్యలు వివరించారు. నిధులు కోసం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో కొన్నిచోట్ల సొంత భవనాలు లేక విద్యార్థులు అద్దె భవనాల్లో ఆవాసం ఉంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎర్రగొండపాలెంలో బాలుర ఎస్సీ వసతిలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్సీ బాలికల వసతిగృహంలో గదులు సరిపోవడం లేదని, కొత్త భవనాల నిర్మించడానికి నిధులు మంజూరుచేయాలని మంత్రికి వివరించారు. వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో తెలిపారు. అమరావతి సచివాలయంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గం సమస్యలు వివరించారు.

శాంతినగర్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు

● గుడికి వెళ్లే భక్తుల నుంచి రుసుం వసూలు



రుసుము వసూలు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

ఎర్రగొండపాలెం, జూలై 9: మండలంలోని నల్లమల అడవిలోకి వెళ్లే శాంతినగర్ గిరిజనగూడెం వద్ద ఫారెస్టు చెక్ పోస్టును ఆ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. అడవిలోకి వెళ్లే వాహనదారుల నుంచి అనుమతి ఫీజు వసూళ్లు చేస్తున్నట్లు సెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. దద్దనాల ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు ప్రతి మంగళవారం, శనివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు అడవిలోకి వెళ్లడానికి అనుమతి ఇస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనానికి ఎంట్రీ ఫీజు రూ.50, ఆటో, జీబు, కారుకు రూ.100 చెల్లించాలని తెలిపారు. ఎంట్రీ ఫీజు చెల్లించని వాహనాలను అనుమతించబోమన్నారు. వారంలో మంగళ, శనివారంలు రెండు రోజులు మాత్రమే అనుమతిస్తామని ఆయన పేర్కొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

● కలెక్టర్ అన్సారియా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 9: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని, వారిపట్ల సత్ప్రవర్తన కలిగి ఉండటం కూడా కీలకమని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం వైద్య శాఖలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, ఇందుకోసం విభాగాల వారీగా ఉన్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులలో పారిశుధ్యం, సెక్యూరిటీ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. రికార్డుల నిర్వహణ పక్కా ఉండాలని, వైద్యులెవరైనా అనుమతి లేకుండా సెలవు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రోగల కోసం మరుగుదొడ్లు, తాగునీరు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన ఆదేశాలు కేవలం కాగితాలపైనే మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో అవి అమలు అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆయా విభాగాల ఉన్నతాధికారులదేనని స్పష్టం చేశారు. ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, డీసీహెచ్ఎస్ శేషుకుమార్, డీఐవో పద్మజ, రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, డిప్యూటీ సూపరింటెండెంట్లు ప్రభాకర్, బాలాజీనాయక్, మార్కాపురం మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ రాజమన్నార్, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

బతుకుదెరువు కోసం వెళ్లి బలయ్యాడు..!

అస్సోంలో ఒంగోలు అధ్యాపకుడు హత్య ● మందలించాడనే కోపంతో కత్తితో పొడిచిన ఇంటర్ విద్యార్థి



రాజేష్‌బాబు మృతదేహం, పక్కన ఫైల్ ఫొటో

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 9 : కుటుంబం బాగు కోసం ఉన్న ఊరు వదిలి, విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి మంచి చేద్దామనుకున్న ఒంగోలు వ్యక్తి పరాయి ఊరులో ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక అన్నవరప్పాడుకు చెందిన రాజేష్‌బాబు తాను పాఠాలు బోధించే విద్యార్థి చేతిలో బలి కావడం విషాదకరం. వివరాల్లోకెళితే.. ఒంగోలుకు చెందిన బెజవాడ రాజేష్‌బాబే అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఈక్రమంలో కుటుంబంతో సహా ఉన్న ఊరు విడిచి విశాఖ వెళ్లారు. అక్కడ పదేళ్లు ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేశారు. ఆ తర్వాత అస్సోం వెళ్లిన రాజేష్‌బాబు సొంతంగా కళాశాలను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రవర్తన సరిగా లేకపోవడంతో అక్కడి అధ్యాపకుడు మందలించారు. అంతేగాకుండా కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న రాజేష్‌బాబు విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేయ డంతోపాటు, ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించాడు. తల్లిదండ్రులను కళాశాలకు తీసుకురావాలని తెలపడమే ఆయన ప్రాణాలు పోవడానికి కారణమైంది. అయితే సహ విద్యార్థుల ముందు తనను మందలించాడన్న కక్షతో రాజేష్‌బాబు తరగతి గదిలో బోధన చేస్తున్న సమయంలో కత్తితో గుండెల్లో పొడవటంతో ప్రాణాలు విడిచారు. దీంతో భార్య, ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారు. ఇదిలా ఉండగా ఒంగోలులోని రాజేష్‌బాబు బంధువుల కుటుంబాల్లో విషాదం నెలకొంది.

నగర సుందరీకరణపై దృష్టి సారించాలి

● కమిషనరు జశ్వంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనరు జశ్వంతరావు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 9: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే నగర సుందరీకరణపై దృష్టి సారించాలని కమిషనరు ఎం.జశ్వంతరావు ఆదేశించారు. మంగళవారం శానిటరీ విభాగం అధికారులు, సెక్రటరీలతో స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలన్నారు. కాలుష్య కారణమైన ప్లాస్టిక్ కవర్లు, గాస్లులు, ఇతరత్రా వాటిని నియంత్రించాలని, ఇందుకోసం వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని చెపారు. అలాగే నగరంలో మురుగు సమస్య లేకుండా ఎప్పటికపుడు కాలువల్లో పూడిక తీత పనులు చేయాలని, అలాగే శానిటరీ సెక్రటరీలు ఉదయం 5గంటలకే మస్టర్ పాయింట్‌లకు వెళ్లడంతోపాటు పారిశుధ్య పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్యాంగ్ వర్క్‌లు చేపట్టి, కల్వర్టులు శుభ్రపరచాలన్నారు. సున్నము, బ్లీచింగ్, కలిపి చల్లి వ్యాధులు ప్రబలకుండా చూడాలని స్పష్టం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనరు రవీంద్ర, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్. పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జి, పలువురు ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

రేపటి నుంచి రైతుబజారుల్లో

రాయితీపై బియ్యం, కందిపప్పు

● జేసీ గోపాలకృష్ణ



రైతుబజారును పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 9: పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించాలన్న రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఈనెల 11వ తేదీ నుంచి అన్ని రైతుబజారుల్లో తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని రైతు బజారును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ వసతులు, ఇతరత్రా అంశాలను పరిశీలించారు. అంతకముందు సంబంధిత అధికారులు బియ్యం, కందిపప్పు మిల్లుల యజమానులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. నాణ్యమైన బీపీటీ బియ్యం స్టీమ్ చేసినవి కిలో రూ.49లకు, పచ్చి బియ్యం రూ.48లకు అందించాలన్నారు. అదేవిధంగా కందిపప్పు కూడా కిలో రూ.160లకు అందుబాటులో ఉంటుందని జేసీ తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ పర్యటించిన జేసీ పారిశుధ్యం అధ్వానంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు మెరుగుపడాలని, రైతు బజారుల్లో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనరు జశ్వంత్‌రావును ఆదేశించారు.

ఉచిత ఇసుక పాలసీ అభినందనీయం

● టీడీపీ రాష్ట్ర సెక్రటరీ స్వాములు



ప్రసంగిస్తున్న స్వాములు, నాయకులు

సంతనూతలపాడు, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందించే పాలసీని తీసుకురావడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు పేర్కొన్నారు. మంగళవారం సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను దృష్టిలో ఉంచుకుని జీవో నెం.43ను విడుదలచేస్తూ ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలసేవ కోసమే ఏర్పాటు అయ్యిందని చెప్పారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు ఇసుకదందాతో రూ.కోట్లు దండుకున్నారని, అదేవిధంగా గృహ నిర్మాణశాఖ పేరుతో ఇసుకను అనకొండలా తిన్నారని ఆరోపించారు. పేద, మధ్య తరగతి ప్రజలకోసం తెచ్చిన ఉచిత పాలసీపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వర్లు, బోసు, సుబ్బారావు, జనార్దన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మేలైన పశుగ్రాసంతో బహుళ ప్రయోజనాలు

● జేడీఏ బేబీరాణి



పశుగ్రాస క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జేడీఏ బేబీరాణి

నాగులుప్పలపాడు, జూలై 9: మేలైన పశుగ్రాసంతో పాడి రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని జేడీఏ బేబీరాణి పేర్కొన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం చదలవాడలో నిర్వహించిన పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పశుపోషకులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మేలు జాతికి చెందిన సూపర్ నాపియర్, స్మార్ట్ సూపర్ నాపియర్, రెడ్ సూపర్ నాపియర్, బాజ్రా నాపియర్ పశుగ్రాసాలను పెంపొందించుకొని పాడి రైతులు తమ పశువులకు మేపడం ద్వారా అధిక పాల దిగుబడితో పాటు పాల ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పాడికి మూలం పచ్చిమేతలేనని జేడీఏ చెప్పారు. కార్యక్రమంలో పశుక్షేత్ర డీడీ బి.రవి, ఏడీఏ బసవశంకరరావు, నాగభూషణరావు, పశువైద్యులు విజయ్‌కుమార్‌రెడ్డి, భార్గవ్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

గ్రామ సచివాలయాలపై జగన్ బొమ్మలను తొలగించాలి

● టీడీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు డిమాండ్

పొన్నలూరు(కొండపి), జూలై 9: మండలంలోని గ్రామ సచివాలయాలపై మాజీ సీఎం జగన్‌రెడ్డి ప్రస్తుతం శాసనసభ్యుడిగా మాత్రమే ఉన్నా, ఇంకా ఆయన బొమ్మలు ఎలా ఉంచుతారని టీడీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించారు. పొన్నలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాయంత్రం పొన్నలూరులోని మండల పరిషత్ సమావేశం హాలులో ఎంపీపీ కె. మాధవ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉప్పలదిన్నె గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ మన్నెం పద్మ తమ గ్రామంలోని సచివాలయంపై ఉన్న జగన్ బొమ్మను తొలగించడాన్ని ప్రశ్నించారు. దీనికి ప్రతిగా స్పందించిన టీడీపీ సభ్యులు జగన్ బొమ్మలు ఇంకా ఉండటాన్ని ఆక్షేపించారు. వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దీనికి ఎంపీడీవో కల్పన వివరణ ఇస్తూ గ్రామ సచివాలయాలపై ఉన్న బొమ్మలు కనపడకుండా ఎన్నికల కోడ్ సమయంలో కాగితాలు అంటించారని, వర్షం కారణంగా కాగితాలు చిరిగిపోయి జగన్ బొమ్మలు కనిపిస్తున్నాయని, అదేవిధంగా నిర్మాణంలో ఉన్న సచివాలయాలు ఇంకా అప్పగించలేదని సభ్యులకు వివరణ ఇచ్చారు. ఇంకా ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాల్లో మాజీ సీఎం ఫొటోలు, బొమ్మలు తొలగించాలని ఆయా గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఉప్పలదిన్నె గ్రామానికి, అగ్రహారం మీదుగా కోటపాడుకు బస్సులు నడపాలని ప్రజాప్రతినిధులు కోరారు.

వంటగ్యాస్ ఈ-కేవైసీపై కేంద్రం కీలక ప్రకటన

టంగుటూరు, జూలై 9 : వంటగ్యాస్ ఈకేవైసీపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసిందని వినియోగదారుల హక్కుల సంఘం నేత ఐనాల నాగేంద్రరావు మంగళవారం తెలిపారు. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసేందుకు కేంద్రప్రభుత్వం కానీ, చమురు సంస్థలు కానీ ఇప్పటి వరకూ ఎలాంటి తుదిగడువు ప్రకటించలేదని చెప్పారు. బోగస్ కస్టమర్లను ఏరివేసేందుకని గత 8నెలలుగా ఈ-కేవైసీ ప్రక్రియ జరుగుతుందని పేర్కొందని ఆయన తెలిపారు.

యువతికి గాయాలు

మద్దిపాడు, జూలై 9: గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద మంగళవారం మోటార్‌సైకిల్ అదుపుతప్పిన ఘటనలో యువతికి గాయాలయ్యాయి. అద్దంకి నుంచి కె.ప్రవల్లిక మోటార్‌సైకిల్‌పై ఒంగోలు వెళ్తుండగా మార్గమధ్యంలో ఒక్కసారిగా వాహనం రావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రురాలుని ఒంగోలులోని ఆస్పత్రికి తరలించారు.

బడి బయట పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి

మద్దిపాడు, జూలై 9: బడిబయట ఉన్న పిల్లలందరినీ గ్రామస్థులు, ఉపాధ్యాయులు సమన్వయంతో స్కూళ్లలో చేర్పించేలా చూడాలని ఎంఈవో ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మద్దిపాడు ఎంఆర్సీ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల కార్మికులను గుర్తించాలన్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారి భవిష్యత్ కోసం చదువుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధ్యాపకుడు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మద్దిపాడు,జూలై 9: నందిపాడులోని శ్రీగంగా పార్వతి కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కళ్యాణం అనంతరం 16 రోజుల పండుగ సందర్భంగా అర్చకులు రాజుపంతులు స్వామివారు, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. అన్నసంతర్పణ జరిగింది.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

ఒంగోలు(కల్చరల్), జూలై 9: ఒంగోలు నగరం పేర్నమిట్టకు చెందిన పేద విద్యార్థి అబ్దుల్‌గఫూర్ చదువుకు స్థానిక సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ రూ.15వేల ఆర్థికసహాయాన్ని అందజేసింది. మంగళవారం స్థానిక కర్నూల్‌రోడ్ ట్రస్ట్ కార్యాలయంలో చైర్మన్ షహనాజ్, సెక్రటరీ సర్దార్‌బాషా మాట్లాడుతూ అబ్దుల్ గఫూర్‌కు తల్లిదండ్రులు చనిపోయారని, నాయనమ్మ మహబూబి దగ్గర ఉంటూ స్థానిక ప్రయివేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడన్నారు. అయితే స్కూల్ ఫీజు, పుస్తకాలు కోసం ప్రవాస భారతీయుడు కుర్ర అనిల్‌కుమార్ సహకారంతో నగదును అందజేసినట్లు వారు చెప్పారు.

ప్రమాద బీమా పాలసీని రెన్యువల్ చేసుకోవాలి

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 9: ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత ఏడాది చేసిన రూ. 10 లక్షల ప్రమాద బీమా పాలసీ ఈనెల 7తో ముగిసిందని, పాలసీదారులు తమ బీమాను తిరిగి రెన్యువల్ చేసుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు అజయ్, వసంత్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవారికి, అలాగే రెన్యువల్ ప్రక్రియ పూర్తి ఉచితంగా చేసుకునే అవకాశం ఉన్నందున సభ్యులు, ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులు తమ పాలసీని పునరుద్ధరించుకోవాలని కోరారు. వివరాలకు సెల్ : 9440925092 ద్వారా సంప్రదించాలన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ మమత

టంగుటూరు, జూలై 9 : అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని టంగుటూరు సర్పంచ్ మద్దిరాల మమత చెప్పారు. స్థానిక పంచాయతీ ఆవరణలో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డయేరియా దరిచేరకుండా ఉండేందుకు వీలుగా చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించారు. పంచాయతీ కార్యదర్శి జగదీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామంలో దోమల నివారణకు సైడు కాలువల్లో అబేట్ మందు పిచికారీ చేయిస్తున్నట్లు వెల్లడించారు. పీహెచ్‌వో సీహెచ్‌వో మాతయ్య మాట్లాడుతూ ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత బెజవాడ వెంకటేశ్వర్లు, పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు, పంచాయతీ సభ్యుడు కామని వెంకట్రావు పాల్గొన్నారు.

18న ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 9 : ఒంగోలు నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం ఈనెల 18వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక కౌన్సిల్ హాలులో జరుగుతుందని కమిషనరు ఎం.జశ్వంత్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాగా తొలుత ఈనెల 16న నిర్వహించాలని నిర్ణయించగా, అదే రోజున ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కో ఆప్షన్ సభ్యులుగా హాజరు కావాల్సి ఉందన్నారు. అయితే ఆ రోజున పార్లమెంట్ సమావేశాలు ఉన్నందున కౌన్సిల్ సమావేశం తేదీని 18కి మార్చినట్లు కమిషనరు పేర్కొన్నారు.

పొగాకు చూర కేజీ రూ.152

కొండపి, జూలై 9 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు చూర, ముక్క కొనుగోళ్లు జరుగుతున్నాయి. మంగళవారం కేజీకి అత్యధిక ధర రూ. 152 లభించింది. వేలం కేంద్రానికి కామేపల్లి, పచ్చవ, అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు గ్రామాల నుంచి 747 బేళ్లు వేలానికి రైతులు తీసుకురాగా, 654 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు.

సింగరాయకొండ పంచాయతీలో విచారణ వాయిదా



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీపీవో ఉషారాణి

సింగరాయకొండ, జూలై 9 : సింగరాయకొండ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణను వాయిదా వేస్తున్నట్లు డీపీవో ఉషారాణి తెలిపారు. పంచాయతీలో సర్పంచ్ అధికారులతో కుమ్మక్కై నిధులు దుర్వినియోగం చేశారని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు రాజేష్ గతంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మంగళవారం డీపీవో పంచాయతీ కార్యాలయానికి విచారణకు వచ్చారు. సర్పంచ్ అందుబాటులోకి లేనందున విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు డీపీవో తెలిపారు. డీఎల్పీవో పద్మ, ఎంపీడీవో నాగేష్‌కుమారి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీహరి పాల్గొన్నారు.

ప్రారంభమైన ఖరీఫ్ సాగు



దర్శి ప్రాంతంలో సజ్జ సాగు చేసిన పొలాలు

దర్శి, జూలై 9 : దర్శి ప్రాంతంలో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. పలు గ్రామాల్లో కొద్దిరోజుల కిందట వర్షం పడడంతో విత్తనం వేశారు. మరికొన్ని గ్రామాల్లో విత్తనం వేసేందుకు భూములను చదును చేసి ఉంచారు. ప్రస్తుతం రాజంపల్లి, జముకులదిన్నె, సా మంతపూడి, కొత్తపల్లి, తూర్పుచౌటపాలెం తదితర గ్రామాల్లో కంది, సజ్జ తదితర పైర్లను వేశారు. పైర్లు ఇంకా పలుచోట్ల మొలక ఎత్తలేదు. కొద్ది రోజుల్లో వానలు కురిస్తే లేత పైరు పుంజుకునే అవకాశం ఉంటుంది. మరికొన్ని గ్రామాల్లో విత్తనాలు చల్లేందుకు వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. మెట్ట భూముల్లో చాలినంత వర్షం పడకపోవడంతో ఆ ప్రాంతం లో భూములు ఖాళీగా ఉన్నాయి. వర్షం పడితే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

నర్సరీలకు లైసెన్సులు తప్పనిసరి

త్రిపురాంతకం, జూలై 9: నర్సరీలు, షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేసే రైతులు రిజిష్ట్రేషన్లు, లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలని ఉద్యాన అధికారి పి.ఆదిరెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సోమేపల్లి, వెల్లంపల్లి, శ్రీనివాసనగర్ గ్రామాల్లో షేడ్‌నెట్ నర్సరీలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సు లేని వాటిపై నర్సరీ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా నర్సరీలు ఏర్పాటు చేసేవారు లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీడ్స్ రిజిష్టరు, సేల్స్ రిజిష్టరు, తనిఖీ రిజిష్టరు, ప్లాంట్ ప్రొటెక్షన్ రిజిష్టరు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. గ్రామాల పరిధిలో 20 నర్సరీలను తనిఖీ చేసి సీడ్ బిల్లులను పరిశీలించారు. లైసెన్సు ఉన్న నర్సరీలలో మాత్రమే రైతులు నారు కొనుగోలు చేసి బిల్లులు తీసుకోవాలని చెప్పారు.

నిత్యావసర ధరల నియంత్రణపై జేసీ సమీక్ష

ఒంగోలు కలెక్టరేట్, జూలై 9: పెరుగుతున్న నిత్యావసరధరల నియంత్రణపై జాయింట్‌కలెక్టర్ గోపాలక్రిష్ణ మంగళవారం కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసరధరల నియంత్రణలో భాగంగా బియ్యం, కందిపప్పు అమ్మడానికి నగరంలోని రైతుబజార్లలో కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా కౌంటర్లలో స్టీమ్ చేసిన బీపీటీ బియ్యం కిలో రూ.49, పచ్చి బియ్యం కిలో రూ.48, కందిపప్పు కిలో రూ.160లకే అందేటట్లు చూడాలని అధికారులకు తెలిపారు. అదేవిధంగా కందిపంట విషయంలో జిల్లా వ్యవసాయఅధికారులు మరింత కృషిచేసి సాగు విస్తీర్ణాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో ఉదయభాస్కర్, నగర కమిషనరు జశ్వంతరావు, సివిల్ సప్లయిస్ డీఎం సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాతృ మరణాలను అరికట్టాలి : డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్, జూలై 9: ఒంగోలులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం మాతృమరణాలపై డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాతృమరణాలు జరగకుండా ఉండేందుకు అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణుల వివరాలను నమోదు చేసుకుని సకాలంలో వారికి అవసరమైన సేవలను అందించి ఆర్‌సీహెచ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రమాదసంకేతాలు గల గర్భిణులను ప్రాథమిక దశలోనే గుర్తించి బర్త్‌ప్లాన్‌ను తయారు చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం వారికి అందించే సేవలు ఆయా వైద్యాధికారుల సమక్షంలో అందేలా చూడాలన్నారు. అత్యవసర సేవలు అవసరమైన గర్భిణులను సమీపంలోని ఏరియా ఆసుపత్రికి గాని, సర్వజనాసుపత్రికి గాని 108 వాహనంలో తరలించాలన్నారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద అవసరమైన స్కానింగ్, వైద్యపరీక్షలు చేయించాలని, పౌష్టికాహారం తీసుకునేవిధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ పద్మజ, డీపీహెచ్‌ఎన్‌వో సుగుణమ్మ, ప్రభుత్వ ప్రైవేట్ వైద్యశాలల ప్రతినిధులు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన వాహనం

బల్లికురవ, జూలై 9: మండలంలోని అంబడిపూడి బీసీ కాలనీ వద్ద సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో గృహాలకు వెళ్లే విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. విద్యుత్ సిబ్బంది మంగళవారం కరెంటు సరఫరాను తిరిగి పునరుద్ధరించారు. బల్లికురవ - అద్దంకి అర్‌అండ్‌బీ రోడ్డులో అంబడిపూడి గ్రామం వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఒక స్తంభం పడిపోయి పక్కనే ఉన్న మరో రెండు స్తంభాలపై పడిపోవటంతో ఈ ఘటన జరిగింది. రాత్రి సమయంలో ఈ ఘటన జరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

కేవీని పరామర్శించిన దగ్గుబాటి

పంగులూరు, జూలై 9: మాజీ జడ్పీటీసీ కేవీ సుబ్బారావును మంగళవారం డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొంది చందలూరులో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న కేవీని దగ్గుబాటి కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. కేవీ కుటుంబ సభ్యుందరినీ పలకరించారు. ఆరోగ్యం కుదుటపడే వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. స్థానిక నేతలతో ముచ్చటించారు. కార్యక్రమంలో కందిమళ్ళ రామాంజనేయులు, పెంట్యాల రామాంజనేయులు, అడ్డగడ సతీష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పంగులూరు, జూలై 9: ముప్పవరం గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాలు తనిఖీచేయగా రేషన్ బియ్యం పట్టుబడి నట్లు పర్చూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతారాణి తెలిపారు. మంగళవారం తన సిబ్బందితో ముప్పవరం వద్ద ఆమె వాహన తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ప ర్చూరు వైపు నుండి జాతీయ రహదారివైపు బియ్యం లోడుతో వస్తున్న వా హనంలో 55 బస్తాల రేషన్ బియ్యం గుర్తించినట్లు తెలిపారు. బియ్యం లోడుతో ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని మేదరమిట్లలోని రైస్ మిల్లుకు తరలించారు. అందులో ఉన్న 55 బస్తాల బియ్యాన్ని మేదరమిట్లలో డీలర్‌కు అప్పగించినట్టు చెప్పారు. లారీని రైస్ మిల్లులో ఉంచి డ్రైవర్ ను రేణంగివరం పోలీసులకు అప్పగించినట్లు డీటీ గీతారాణి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతిరావు తెలిపారు.. .

ప్రభుత్వ భూములను పరాధీనం కానివ్వం

● ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

వేటపాలెం(చీరాల), జూలై 9 : ప్రభుత్వానికి సబంధించి సెంటు భూమి కూడా పరాధీనం కానివ్వమని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేటపాలెం మండలం నాయినిపల్లి దత్తక్షేత్రంలో నిబంధనలకు విరుద్ధంగా నివేశన స్థలాలు కేటాయించాలని కలెక్టర్‌కు ప్రజా పరిష్కారాల వేదికలో సోమవారం కొందరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, తహ సీల్దార్ కృష్ణకాంత్, ల్యాండ్స్ అండ్ మైన్స్ సర్వే బాధ్యుడు ముసలయ్య తదితరులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తమ నివేదికను పారదర్శకంగా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొరిశపాడులో చోరీ

మేదరమెట్ల, జూలై 9: కొరిశపాడులో సోమవారం దొంగతనం జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన షేక్ నూర్జహాన్ పనికి వెళ్లి వచ్చేసరికి ఇంటిలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే లోపలికి వెళ్లిచూడగా బీరువా పగులగొట్టి ఉంది. అందులోని రూ.20వేలు నగదు, రూ.30వేలు విలువైన బంగారం కనిపించలేదు. మంగళవారం ఉదయం నూర్జహాన్ ఘటనపై కొరిశపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఎం.శివయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ముగిసిన గంగమ్మ కొలుపులు

చినగంజాం, జూలై 9: కడవకుదురులో గంగమ్మ అమ్మవారి కొలుపులు వైభవంగా ముగిశాయి. గ్రామంలో ఆదివారం నుంచి అమ్మవారికి పలు రకాల పూజలు నిర్వహిస్తూ మంగళవారం పొంగళ్ళ కార్యక్రమాన్ని నిర్వహించారు. పురవీధులలో గ్రామోత్సవం చేశారు. అమ్మవారి ప్రభ ముందు, అమ్మవారి ఉత్సవ విగ్రహంతో, మహిళలు పొంగళ్లతో ఊరేగింపుగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాయంత్రం అమ్మవారి ఆలయానికి వెళ్లారు. ఈసందర్భంగా పూజారి హైమారావు గంగమ్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు జరిపారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నా రు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కాగాల ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో అమ్మవార్ల కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నక్కల పెదముత్త య్య, యంపరాల రోశయ్య, యాదవ పెద్దలు, శ్రీకృష్ణా యాదవ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జామాయిల్ దొంగలు..!

అగ్రిగోల్డ్ భూముల్లో చెట్ల నరికివేత ● రాత్రికిరాత్రేకే తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు ● కొరవడిన పోలీస్ నిఘా



అగ్రిగోల్డ్ భూముల్లో ఏపుగా పెరిగిన జామాయిల్ చెట్లు

పామూరు, జూలై 9 : పామూరు మండలంలో పలు చోట్ల ఉన్న అగ్రిగోల్డ్ ప్రైవేటు భూముల్లో సాగు చేస్తున్న జామాయిల్ చెట్లపై అక్రమార్కుల కన్ను పడింది. గుట్టుచప్పుడు కాకుండా చెట్లను నరికి దుంగలను రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు గ్రామస్థులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పామూరు మండలం రేణిమడుగు, చిలంకూరు, దూబగుంట, పడమరకట్టకిందపల్లి, గుమ్మలంపాడు, కంభాలదిన్నె రాజుపాలెం, ప్రాంతాల్లో వందల ఎకరాల్లో జామాయిల్ తోటలను సాగు చేశారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారాలు కోర్టు కేసుల్లో ఉండడంతో వాటి గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని కొంతమంది చోటా నాయకుల కన్ను జామాయిల్ చెట్లపై పడింది. అడవి పం డింది.. కాకులు తిన్నాయి అనే సామెతగా రాత్రికి రాత్రే అడ్డంగా నరికి అక్రమంగా రవాణా చేస్తూ కొల్లగొడుతున్నారు. అర్ధరాత్రిపూట నరికి పట్టపగలే వాహనాల్లో చెక్ పోస్టులు దాటిస్తున్నా అధికారులు పట్టించుకోవడంపై ప్రజలు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. అగ్రిగోల్డ్‌లో నగదు డిపాజిట్‌లు చేసిన ప్రజల ఆస్తులను అక్రమార్కులు ఇలా దోచుకుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దూబగుంట ప్రాంతంలో అక్రమంగా లారీలో జామాయిల్ దుంగలను తరలిస్తుండగా పోలీసులు వలపన్ని పట్టుకొని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాంతో కొన్ని రోజులు నిలిచిన దందా ఎన్నికల అనంతరం మళ్లీ మొదలైంది. జీపీఆర్ఎస్ సిస్టమ్ ద్వారా అక్రమాలకు అడ్డుకట్టవేయాలని, వారెంతటివారైనా కేసులు నమోదు చేయాలని ఇటీవల జరిగిన పామూరు మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశంలో జామాయిల్ అక్రమ రవాణాపై ఎమ్మెల్యే ఉగ్ర పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికైనా పోలీసు, అటవీశాఖ అధికారులు జామాయిల్ అక్రమరవాణాపై దృష్టి సారించి అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముడి కర్ర టన్ను ధర రూ.4000 ఉండగా, తాట తీసినది రూ.5600 నుంచి రూ.5,800 పలుకుతోంది. అలాగే కర్రను నేరుగా కందుకూరులో ఉండే కంపెనీకి తరలిస్తే టన్ను ధర రూ.8,500 వరకూ వసూలు చేస్తున్నారు. రోజుకు మూడు, నాలుగు లారీల కర్ర తరలివెళ్తున్నట్లు తెలిసింది. ఒక లారీ కర్ర అమ్మితే రూ.లక్ష (25టన్నులు) వరకూ అక్రమార్కులు ఆర్జిస్తూ ప్రభుత్వ సొమ్మును కొల్లగొడుతున్నారు.



పట్టపగలే అక్రమంగా తరలివెళ్తున్న జామాయిల్ కర్ర

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్య

● ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

కనిగిరి, జూలై 9 : అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని గుంటూరు విద్యాశాఖ ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. కనిగిరి ప్రభుత్వ హైస్కూల్‌లో జరుగుతున్న టీచ్‌టూల్ పర్యవేక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ పది రోజులపాటు శిక్షణలో నేర్చుకున్న అంశాలు పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు ఆచరిస్తున్నరో లేదో పరిశీలించాని సూచించారు. బోధనలో ఉపాధ్యాయులు ఆచరిస్తున్న విధానాలు, విద్యార్థుల అవగాహనను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలందరినీ స్కూళ్లలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు మరింత చొరవ చూపాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠ్యాంశంపై జరిగిన బోధనాంతర పరీక్షలు నిర్వహించి విద్యలో వెనుకబడిన పిల్లలను విద్యలో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక సమయం కేటాయించాలన్నారు. స్టూడెంట్ కిట్‌లలో భాగంగా ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫారమ్స్, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్‌లతో పాటు బ్యాగులు, షూస్, బెల్టులు వంటి సామాగ్రిని వంద శాతం అందించాలని ఎంఈవో, హెచ్‌ఎంలను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో జాగ్రత్తలు పాటించాలని ఆర్‌జేడీ సూచించారు. అనంతరం పట్టణ సమీపంలోని గార్లపేట రోడ్డు లో ఉన్న మోడల్‌స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన తీరును, కంప్యూటర్ ల్యాబ్‌ను ఆర్‌జేడీ పరిశీలించారు. ఆయనవెంట ఏంఈవోలు యూవీ.నారాయణరెడ్డి, సంజీవి, రాజాల కొండారెడ్డి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమణయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా జలజీవన్ పైప్‌లైన్ పనులు

● నీరివ్వని కొళాయిలు

● నిరుపయోగంగా పైపులైన్

● ముందే బిల్లులు చేసుకున్న కాంట్రాక్టర్లు



దరిమడుగులో నీటి సరఫరా లేని పైపులు

మార్కాపురం రూరల్, జూలై 9 : కేంద్ర ప్రభుత్వం గ్రామాలలో నీటి ఎద్దడిని నివారించేందుకు ఇంటింటికి కుళాయిల ద్వారా నీటి సరఫరా ఇవ్వాలని సదుద్దేశంతో రూపొందించిన జలజీవన్ మిషన్ వైసీపీ నాయకులు జేబులు నింపింది. పనులు పూర్తి చేసినట్లు చూపినప్పటికీ, నీటి సరఫరా లేకుండా నిరుపయోగంగా తయారయ్యాయి. వైసీపీ నాయకులకు మాత్రం గ్రామాల్లో పైప్‌లైన్‌లకు నీటి సరఫరా చేయకుండానే అధికారుల అండతో బిల్లులు చేసుకోవడం గమనార్హం.

మండలంలోని దరిమడుగు, బోడపాడు గ్రామాలలో పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ, నిరుపయోగంగా మారింది. మండలంలోని దరిమడుగు గ్రామానికి రూ.19.38 లక్షల జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరయ్యాయి. నీటి కోసం ఆ ప్రాంత ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. మార్కాపురం మండలంలో జలజీవన్ మిషన్ పథకం కింద మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు రూ.415.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. వీటి బిల్లులు చేసినప్పటికీ, పనులు సక్రమంగా జరగలేదు. బోడపాడు గ్రామానికి రూ.27.43లక్షలు మంజూరయ్యాయి. గ్రామంలో కొన్ని ప్రాంతాలలో జలజీవన్ మిషన్ పైపులు నిరుపయోగంగా తయారయ్యాయి. ప్రతి రోజు జలజీవన్ మిషన్‌పైపుల ద్వారా కుళాయిలకు నీటి సరఫరా చేస్తారనుకుంటే చేయడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా లేని పైపులు, కుళాయిలు ఎందుకని తీసేస్తున్నారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఇంటింటికి నీటి సరఫరా చేయాలన్న ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన పైపులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా ఉన్నాయని పేర్కొంటున్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ కింద ఒక్క కొత్తబోర్లు కూడా వేయకుండా పాత బోర్ల ద్వారానే గతంలో ఉన్న పైపలైన్ కనెక్షన్లను తొలగించి జలజీవన్ మిషన్‌లో వేసిన పైపులైన్లకు కనెక్షన్‌లను ఇచ్చారు. దీంతో గ్రామంలో బోర్ల ద్వారా నీరు సరఫరా కావడం లేదు. అధికారులు తగిన చర్యలు చేపట్టి జలజీవన్ మిషన్ ద్వారా వేసిన కొత్త పైపులైన్లకు నీటి సరఫరా అందించాలని కోరుతున్నారు. జలజీవన్ మిషన్ పనుల్లో అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సబ్‌స్టేషనా..మద్యం దుకాణమా!

కొప్పెరపాడులో అర్ధరాత్రి మందు పార్టీలో సిబ్బంది ● కరెంటు సరఫరాపై ప్రశ్నించిన ప్రజలపై దౌర్జన్యం ● కొరవడిన పర్యవేక్షణ



సబ్‌స్టేషన్‌లో మందు పార్టీ చేసుకొంటున్న సిబ్బంది

బల్లికురవ, జూలై 9: విద్యుత్ సబ్‌స్టేషన్లు మద్యం దుకాణాలను తలపిస్తున్నాయి. అక్కడ పని చేసే సిబ్బంది రాత్రి పూట కొందరిని పిలిపించుకొని మద్యం పార్టీలతో మునిగి తేలుతున్నారు. విద్యుత్ సరఫరా లేదని ఫోన్ చేసిన వినియోగదారులపై తీవ్రస్థాయిలో దుర్భాషలాడుతున్నారు. అదేమంటే దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ దబాయిస్తున్నారు. బల్లికురవ మండలం కొప్పెరపాడు సబ్‌స్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి మందుపార్టీని ఏర్పాటు చేసుకొని చిందులు వేయటం విమర్శలకు తావిస్తున్నది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో వైదన గ్రామానికి చెందిన కొందరు యువకులు కొప్పెరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లారు. సుమారు గంటన్నర అయినా విద్యుత్ రాలేదని వారు అక్కడికి వెళ్లగా.. విధులలో ఉన్న సిబ్బంది మందు పార్టీలో మునిగి ఉన్నారు. సబ్‌స్టేషన్‌లో మద్యం తాగటం ఏమిటి, ఫోన్ చేసిన ఎందుకు సమాధానం చెప్పటం లేదని ప్రశ్నించారు. దీంతో అక్కడ ఉన్న సిబ్బంది వచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఒక పూట విద్యుత్ లేకపోతే ఎవరు చచ్చిపోరులే అంటూ దుర్భాషణలకు దిగారు. విధులలో ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన సిబ్బంది మద్యం తాగటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సబ్‌స్టేషన్లపై అధికారులు పర్యవే క్షణ సరిగా చేయటం లేదని, కొప్పెరపాడు సబ్‌స్టేషన్ లో కొంతకాలం నుంచి పేకాట కూడా ఆడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. సబ్‌స్టేషన్‌లో ఉన్న సిబ్బంది రైతుల నుంచి కూడా పెద్ద ఎత్తున వ్యవసాయ సీజన్‌లో డబ్బులు వసూళ్లు చేస్తున్నారని చెబుతున్నారు. విద్యుత్ సిబ్బంది మద్యం తాగి పార్టీ చేసుకొన్న విషయమై వైదన గ్రామానికి చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావుకు వాట్సప్ ద్వారా ఫొటోలను పెట్టి ఫిర్యాదు కూడా చేశారు. సబ్ స్టేషన్‌ను మద్యం దుకాణంలా మార్చిన సిబ్బందిపై వెంటనే విచారణ చేపట్టి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై ఏఈ శ్రీనివాసరావును ఫోన్‌లో వివరణ కోరగా, సబ్‌స్టేషన్‌లో సిబ్బంది మద్యం తాగుతున్న సంఘటనను వైదన గ్రామస్థులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

నామినేటెడ్ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు

● పోటీపడుతున్న పలువురు నేతలు



అద్దంకి ఏఎంసీ కార్యాలయం

అద్దంకి, జూలై 9: నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు తమ ప్రయత్నాలను ప్రారంభించారు. అద్దంకి నియోజకవర్గంలో అద్దంకి, సంతమాగులూరు మార్కెట్ కమిటీల పాలకవర్గాలతో పాటు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్, డైరెక్టర్‌ల పోస్టులకు ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. అద్దంకి మార్కెట్ కమిటీ పరిధిలో అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాలు, సంత మాగులూరు మార్కెట్ కమిటీ పరిధిలో సంతమాగులూరు, బల్లికురవ మండలాలు ఉన్నాయి. దీంతో ఆయా పరిధిలోని నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని అద్దంకి, మేదరమెట్లలో కూరగాయల సంతలు నిర్వహిస్తున్నారు. దీంతో పాలకమండలి కనుసన్నలలో సంత నిర్వహణ జరిగే అవకాశం ఉండటంతో కనీసం డజను మందికి పని కల్పించే అవకాశం ఉంది. అదే సమయంలో రైతులకు మేలు చేకూర్చే కార్యక్రమాలు నిర్వహణకు కూడా అవకాశం ఉంది. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలికి కూడా మంచి గుర్తింపు ఉంటుంది. అదే సమయంలో ప్రస్తుతం సుమారు రూ.7 కోట్లతో దేవాలయం అభివృద్ధి పనులు కూడా జరుగుతుండటంతో పాలకమండలికి మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇక అవుట్ సోర్సింగ్ ద్వారా సుమారు 15 నుంచి 20 మంది సిబ్బందికి అవకాశం కల్పించే అవకాశం కూడా ఉంది. అదే సమయంలో సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఇతర పలు దేవాలయాలకు కూడా కమిటీలు వేయనున్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం పాలకమండలి చైర్మన్‌గా గత కొన్ని దశాబ్దాలు గా ఆర్యవైశ్య సామా జిక వర్గా నికి చెందిన వ్యక్తులకు అనవాయితీగా కేటాయిస్తున్నారు. ఈనేపథ్యంలో అద్దంకి పట్టణంలోని పలువురు ఆర్యవైశ్యులు ఇప్పటికే తమ ప్రయత్నాలు ప్రారంభించారు. డైరెక్టర్‌లుగా మిగిలిన సామాజిక వర్గాలకు కేటాయించే అవకాశం ఉండటంతో ఎవరికి వారే ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే నామినేటెడ్ పదవుల ఆశించే నేతలు ఎక్కువగా ఉండటం తో ఎంపిక మంత్రి రవికుమార్ ఒకింత కసరత్తు చేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు తెలుస్తుంది. పదవుల పంపకం ఒకింత ఆలస్యం అయ్యే కానున్నట్లు సమాచారం.

టైలర్స్‌ను ఆదుకోవాలని మంత్రికి వినతి

తాళ్లూరు, జూలై 9 : ఏపీ రాష్ట్ర టైలర్స్ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించి, నిధులు సమకూర్చి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ నేతలు బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవితకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు మారాబత్తుల సుజాత, రాష్ట్ర టైలర్స్ సంఘం నేత నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు టైలర్స్ సంఘ ప్రతినిధులు వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి సవితను మంగళవారం కలిశారు. టైలర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కొందరు టైలర్లకు భుక్తి జరగడం కూడా కష్టంగా మారిందన్నారు. టైలర్లు సజావుగా జీవించాలంటే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వైసీపీ హయాంలో కార్పొరేషన్ నిర్వీర్యమైందన్నారు. వెంటనే చైర్మన్‌ను నియమించి, నిధులు కేటాంచాలని వారు విన్నవించారు. మంత్రి సవిత సాకూలంగా స్పందించి త్వరలో తగు చర్యలు చేపట్టి టైలర్స్‌కు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సవితను కలిసిన వారిలో తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి, పలు జిల్లాల టైలర్స్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాల రేట్లపై వివాదం

● స్పందించిన దేవదాయశాఖ

పామూరు, జూలై 9 : పామూరు పట్టణంలోని శ్రీ మదనవేణుగోపాలస్వామి, శ్రీ వల్లీ భుజంగేశ్వరస్వామి, దేవస్థానాల్లో పూజా తదితర కార్యక్రమాలకు రేట్లను నిర్ణయిస్తూ ఎండోమెంట్‌శాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు ఆ ధరలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహబాబు వాటిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ భూముల ఆక్రమణ, ప్రత్యేక పూజలకు భక్తుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ఎండో మెంట్ శాఖ అధికారులు స్పందించారు. పూజలకు ధరలు నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ధరల పట్టికలో ఉన్న రుసుమును మాత్రమే చెల్లించి పూజలు చేయించుకోవాలని, రశీదు తీసుకోవాలని భక్తులకు సూచించారు. అర్చకులు అధిక మొత్తంలో వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని ఆలయ ఈవో కోరారు.

ఎమ్మెల్యే కందులకు మంత్రి పరామర్శ



నారాయణరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి నారాయణ

మార్కాపురం, జూలై 9: కాలికి శస్త్రచికిత్స చేయించుకొని హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ మంగళవారం ఉదయం పరామర్శించారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రెండు కాళ్లకు గాయాలయ్యాయి. కుడికాలికి మళ్లీ శస్త్రచికిత్స చేయాల్సి రావడంతో ఆదివారం ఆపరేషన్ నిర్వహించారు. ఈ విషయం తెలిసిన మంత్రి వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



విత్తన దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్, జూలై 9: నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఉప సంచాలకులు జి.లక్ష్మణ్‌కుమార్ విత్తన దుకాణాల నిర్వాహ కులను హెచ్చరించారు. మార్కాపురంలోని విత్తనాల దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దుకాణాల యజమానుల జిల్లా పరిధిలో అమ్మకాలు చేసేందుకు మాత్రమే లైసెన్స్‌లు కలిగి ఉన్నారని, కానీ కొంతమంది ఇతర జిల్లాలకు కూడా విత్తనాలను అమ్మడం గమనించినట్లు వారు తెలిపారు. వ్యవసాయశాఖ తదుపరి ఉత్తర్వుల ఇచ్చేంతవరకు ఇతర జిల్లాలకు అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. పురుగులమందుల, విత్తనాల దుకాణాల వద్ద స్టాక్ వివరాలను బోర్డులో పొందుపరచాలన్నారు. కొనుగోలు చేసి రైతులను తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట ఒంగోలు టెక్నికల్ ఏవో శ్రీనివాస్ నాయక్, ఏవోలు దేవిరెడ్డి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

వసతిగృహ నిర్మాణాలకు నిధులివ్వండి

• మంత్రి స్వామిని కోరిన ఎరిక్షన్‌బాబు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూలై 9 : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో సాంఘీక సంక్షేమ వసతిగృహ భవనాలు, గిరిజన వసతి భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డి బాలవీరాంజనేయ స్వామికి ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ వినతిపత్రం అందజేశారు. మంగళవారం అమరావతిలో మంత్రి చాంబర్ కలసి నియోజకవర్గంలో ఉన్న సమస్యలు వివరించారు. నిధులు కోసం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో కొన్నిచోట్ల సొంత భవనాలు లేక విద్యార్థులు అద్దె భవనాల్లో ఆవాసం ఉంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎర్రగొండపాలెంలో బాలుర ఎస్సీ వసతిలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్సీ బాలికల వసతి గృహంలో గదులు సరిపోవడం లేదని కొత్త భవనాల నిర్మించడానికి నిధులు మంజూరుచేయాలని మంత్రికి ఎరిక్షన్‌బాబు వివరించారు. వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో తెలిపారు. అమరావతి సచివాలయంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాదపూర్వకంగా కలసి ఎర్రగొండపాలెం నియోజకవర్గం సమస్యలు వివరించినట్లు తెలిపారు.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు

• ఆందోళనలో స్థానికులు



పాఠశాల సమీపంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

గిద్దలూరు, జూలై 9 : ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే రోడ్డులో శ్రీనివాస థియేటర్ ఎదురుగా ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, పాఠశాల సమీపంలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటికి రక్షణ కంచెలు ఏర్పాటు చేయలేదు. ఇటీవల పాఠశాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు ఆకులు తినేందుకు వెళ్లిన మేక విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఈ రోడ్డులో పాఠశాలలకు, దేవాలయానికి, సినిమాహాలుకు ఎక్కువ మంది వెళుతుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్ళకంపలను తొలగించి రక్షణ కోసం కంచె ఏర్పాటు చేయాలని బీజేపీ అసెంబ్లీ ఉపసమన్వయకర్త గుమ్మా రాముడు ఒక ప్రకటనలో ట్రాన్స్‌కో అధికారులకు విజ్ఞప్తి చేశాడు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



విత్తన దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్, జూలై 9: నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ కమిషనరేట్ ఉపసంచాలకులు జి.లక్ష్మణ్‌కుమార్ విత్తన దుకాణాల నిర్వాహకులను హెచ్చరించారు. పట్టణంలోని విత్తనాల దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో విత్తనాల దుకాణాల నిర్వాహకులకు ప్రభుత్వ నియమ నిబంధనలను తెలియజేశారు. దుకాణాల యజమానుల జిల్లా పరిధిలో అమ్మకాలు చేసేందుకు మాత్రమే లైసెన్స్‌లు కలిగి ఉన్నారని కానీ కొంతమంది ఇతర జిల్లాలకు కూడా విత్తనాలను అమ్మడం గమనించినట్లు తెలిపారు. వ్యవసాయశాఖ తదుపరి ఉత్తర్వుల ఇచ్చేంతవరకు ఇతర జిల్లాలకు అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. పురుగులమందుల, విత్తనాల దుకాణాల వద్ద స్టాక్ వివరాలను బోర్డులో పొందుపరచాలని తెలిపారు. అమ్మకపు రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసి కొనుగోలు చేసి రైతులను తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు జరిపితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో వారి వెంట ఒంగోలు టెక్నికల్ ఏవో శ్రీనివాస్ నాయక్, మార్కాపురం, తర్లుపాడు ఏవోలు దేవిరెడ్డి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

శాంతినగర్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు

• ఆంజనేయ స్వామి గుడికి వెళ్లే భక్తుల నుంచి రుసుము వసూలు



రుసుము వసూలు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

ఎర్రగొండపాలెం, జూలై 9 : మండలంలోని నల్లమల అడవిలోకి వెళ్లే శాంతినగర్ గిరిజనగూడెం వద్ద ఫారెస్టు చెక్ పోస్టును ఆ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. అడవిలోకి వెళ్లే వాహనదారుల నుంచి అనుమతి ఫీజు వసూళ్లు చేస్తున్నట్లు సెక్షన్ ఆఫీసర్ ఎం వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. దద్దనాల ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు ప్రతి మంగళవారం, శనివారం ఉదయం 6 గంటలనుంచి, మధ్యాహ్నం 2 గంటలలోపు అడవిలోకి వెళ్లడానికి అనుమతి ఇస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనానికి ఎంట్రీఫీజు రూ.50, ఆటో, జీబు, కారుకు రూ.100 చెల్లించాలని తెలిపారు. ఎంట్రీ ఫీజు చెల్లించని వాహనాలను అనుమతించమన్నారు. వారంలో మంగళ, శని వారంలు రెండు రోజులు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు.

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెద్ద దోర్నాల, జులై 9: డయేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని చింతల వైద్యాధికారి యాగ్నిక్ అన్నారు. మండలంలోని పెద్ద బొమ్మలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డయేరియా, డెంగ్యూ నివారణ మాసోత్సవాలలో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జే ఝాన్సీలక్ష్మీబాయి అధ్యక్షతన గ్రామంలో ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో డయేరియా, ప్రాణాంతక డెంగ్యూ వ్యాధి సోకే ప్రమాదం లేకపోలేదన్నారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. నిలువ ఉన్న ఆహార పదార్థాలను తినకూడదని, దోమతెరలు వాడాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాచర్ల ఎస్సైగా ఇమ్మానియేలు

గిద్దలూరు, జూలై 9 : రాచర్ల ఎస్సైగా పందిటి ఇమ్మానియేలు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాచర్ల ఎస్సైగా పని చేస్తున్న సుబ్రహ్మణ్యం తిరుపతి జిల్లాకు బదిలీ కాగా ఇమ్మానియేలును ఎస్సైగా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇమ్మానియేలు రాచర్ల ఇన్‌చార్జ్ ఎస్సైగా కూడా పని చేశారు.

జేబులు నింపిన జలజీవన్

• నీరివ్వని కొళాయిలు
• నిరుపయోగంగా పైపులైన్
• ముందే బిల్లులు చేసుకున్న కాంట్రాక్టర్లు

మార్కాపురం రూరల్, జూలై 9 : కేంద్ర ప్రభుత్వం గ్రామాలలో నీటి ఎద్దడిని నివారించేందుకు ఇంటింటికి కుళాయిల ద్వారా నీటి సరఫరా ఇవ్వాలని సదుద్దేశంతో రూపొందించిన జలజీవన్ మిషన్ వైసీపీ నాయకులు జేబులు నింపింది. పనులు పూర్తి చేసినట్లు చూపినప్పటికీ, నీటి సరఫరా లేకుండా నిరుపయోగంగా తయారయ్యాయి. వైసీపీ నాయకులకు మాత్రం గ్రామాల్లో పైప్‌లైన్‌లకు నీటి సరఫరా చేయకుండానే అధికారుల అండదండలతో బిల్లులు చేసుకోవడం గమనార్హం.

మండలంలోని దరిమడుగు, బోడపాడు గ్రామాలలో పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ, నిరుపయోగంగా మారింది. మండలంలోని దరిమడుగు గ్రామానికి రూ.19.38 లక్షల జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరయ్యాయి. నీటి కోసం ఆ ప్రాంత ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. మార్కాపురం మండలంలో జలజీవన్ మిషన్ పథకం కింద మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు రూ.415.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. వీటి బిల్లులు చేసినప్పటికీ, పనులు సక్రమంగా జరగలేదు.

బోడపాడు గ్రామానికి రూ.27.43లక్షలు మంజూరయ్యాయి. గ్రామంలో కొన్ని ప్రాంతాలలో జలజీవన్ మిషన్ పైపులు నిరుపయోగంగా తయారయ్యాయి. ప్రతి రోజు జలజీవన్ మిషన్‌పైపుల ద్వారా కుళాయిలకు నీటి సరఫరా చేస్తారనుకుంటే చేయడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా లేని పైపులు, కుళాయిలు ఎందుకని తీసేస్తు న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపా యలు ఖర్చు చేసి ఇంటింటికి నీటి సరఫరా చేయాలన్న ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన పైపులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా ఉన్నా యని పేర్కొంటున్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ కింద ఒక్క కొత్తబోర్లు కూడా వేయ కుండా పాత బోర్ల ద్వారానే గతంలో ఉన్న పైపులైన్ కనెక్షన్లను తొలగించి జలజీవన్ మిషన్‌లో వేసిన పైపులైన్లకు కనెక్షన్‌లను ఇచ్చారు. దీంతో గ్రామంలో బోర్ల ద్వారా నీరు సరఫరా కావడం లేదు. అధికారులు తగిన చర్యలు చేపట్టి జలజీవన్ మిషన్ ద్వారా వేసిన కొత్త పైపులైన్లకు నీటి సరఫరా అందించాలని కోరుతున్నారు. జలజీవన్ మిషన్ పనులలో అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దరిమడుగులో నీటి సరఫరా లేని పైపులు , నిరుపయోగంగా ఉన్న కొళాయిలు ఏర్పాటు చేసిన డమ్మీలు

శిలాఫలకం ప్రారంభించి.. నిర్వహణ మరచి

తొలిరోజే మూతపడ్డ ఆర్‌వో ప్లాంట్

తర్లుపాడు, జూలై 9: తర్లుపాడులో గత ఫిబ్రవరి నెలలో నాయకులు హడావుడిగా ప్రారంభించిన వాటర్ ప్లాంట్ తొలిరోజు ముచ్చటగానే మారింది. శిలాఫలకాల కోసమే వైసీపీ నాయకులు హడావుడిగా ప్లాంటును ప్రారంభించారు. అప్పటి నుంచి నేటివరకు ప్రజలకు చుక్క నీరు ఇచ్చిన దాఖలాలు లేవు.

తర్లుపాడులోని పొట్టి శ్రీరాములు పార్కులో రూ.10లక్షలతో ప్రభుత్వం వాటర్ ప్లాంట్‌ను నిర్మించింది. ఈ ప్లాంట్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 10న అప్పటి మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ, పలువురు అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. ప్రారంభించిన రోజు మాత్రమే ప్రజలకు తక్కువ ధరకు మంచినీటి సరఫరా చేశారు. ఆ మరుసటి రోజు నుంచి ఇప్పటి వరకు బిందె నీరు ఇవ్వలేదు. దీంతో శిలఫలకాల కోసమే ఆర్భాటంగా ప్రారంభించారని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ఈ వాటర్ ప్లాంట్ గురించి పట్టించుకోలేదు. దీంతో పేద ప్రజలు ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నుంచి బబుల్ రూ.10 ఇచ్చి కొనుక్కో వాల్సి వస్తోంది. వాటర్ ప్లాంట్ మూతపడంతో పరిసరా లలో చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతుంది. ప్రభుత్వ లక్ష్యాలు అధికారుల నిర్లక్ష్యంతో కుంటు పడుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే వాటర్ ప్లాంట్‌ను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న ఆర్‌వో ప్లాంట్

శ్రీశైలానికి కాలినడన రైల్వేకోడూరు ఎమ్మెల్యే



పాదయాత్ర ప్రారంభిస్తున్న అరవ శ్రీధర్

పెద్ద దోర్నాల, జూలై 9: స్థానిక శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం నుంచి రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ తన మొక్కులు తీర్చుకునేందుకు కాలినడకన మంగళవారం శ్రీశైలం బయలు దేరి వెళ్లారు. ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించాలని, అదేక్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని శ్రీశైలంలో కొలువైన శ్రీభ్రమరాంబి కామల్లికార్జున స్వామి వార్లను మొక్కుకున్నారని, తీర్చుకునేందుకు దోర్నాల వచ్చినట్లు జనసేన నాయకులు తెలిపారు. ఈ క్రమంలో అయ్యప్పస్వామి దేవాలయంలో కొబ్బరికాయ కొట్టి కాలినడకను ప్రారంభించారు. ఆయన రాకను తెలుసుకున్న జనసేన మండల అధ్యక్షులు కేతి మురళి, నాయకులు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే శ్రీధర్‌కు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి పూల మాలలతో సత్కరించారు. అనంతరం ఆయన వెంట కొంత దూరం ప్రయాణించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కే సుబ్బారెడ్డి, చంటి, షేక్ మంజూర్ భాష, బట్టు సుధాకర్ రెడ్డి, రావిక్రింది సుబ్బరత్నం, చెన్నారెడ్డి, కె శ్రీనివాస యాదవ్, తాతిరెడ్డి జనసేన నాయకులు వేమా దాసయ్య, గుర్రం ప్రసాద్, పండు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దకాలం నాటి సమస్యకు పరిష్కారం



పనులను పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకులు

పొదిలి, జూలై 9 : నగరపంచాయతీ పరిధిలోని పుల్లర్‌పేటలో 10 సంవత్సరాలుగా ఉన్న విద్యుత్ సమస్యకు టీడీపీ నాయకులు పరిష్కారం చూపారు. ఎన్నికల ప్రచారంలో నాటి టీడీపీ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. గతంలో స్తంభాలు ఏర్పాటు చేశారని, విద్యుత్ సరఫరా ఇవ్వలేదని తెలిపారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు కందుల నారాయణరెడ్డి అత్యధిక మెజారిటీతో శాసనసభ్యుడిగా గెలుపొందారు. అనంతరం ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పట్టణంలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. వీటిలో భాగంగా ఆయన ఆదేశాల మేరకు ఇచ్చిన హామీని టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి, ముల్లా ఖుద్దూస్‌లు పరిష్కరించరించే చొరవ చూపారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీంతో కాలనీవాసులు ఆనందాన్ని వెలిబుచ్చారు. సమస్య పరిష్కరించినందుకు నారాయణరెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని సమస్యలను కందుల నారాయణరెడ్డి దృష్టిలో ఉంచి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఓబులరెడ్డి, ఖుద్దూస్‌లు చెప్పారు.

రాయితీపై బియ్యం, కందిపప్పు

• జేసీ గోపాలకృష్ణ



రైతుబజారును పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 9: పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించాలన్న రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఈనెల 11వ తేదీ నుంచి అన్ని రైతుబజారుల్లో తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని రైతు బజారును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ వ సతులు, ఇతరత్రా అంశాలను పరిశీలించారు. అం తకముందు సంబంధిత అధికారులు బియ్యం, కందిపప్పు మిల్లుల యజమానులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. నాణ్యమైన బీపీటీ బియ్యం స్టీమ్ చేసినవి కిలో రూ.49లకు, పచ్చి బియ్యం రూ.48లకు అందించాలన్నారు. అదేవిధంగా కంది పప్పు కూడా కిలో రూ.160లకు అందుబాటులో ఉంటుందని జేసీ తెలిపారు. ఈ సందర్భంగా అక్క డ పర్యటించిన జేసీ పారిశుధ్యం అధ్వానంగా ఉం డటంపై అసహనం వ్యక్తం చేశారు. మరుగుదొ డ్లు మెరుగుపడాలని, మంచినీటి సౌకర్యం ఏర్పా టు చేయాలని, రైతు బజారుల్లో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని కమి షనరు జశ్వంత్‌రావును ఆదేశించారు.

ప్రేమకు ప్రతిరూపం సాయినాథుడు



రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 9: భక్తుల పట్ల ప్రేమకు ప్రతిరూపం సాయినాథుడు అని హైదరాబాదుకు చెందిన అశావర్థుల రాజేంద్రప్రసాద్ అన్నారు. గురుపౌర్ణమి వేడుకలు పురస్కరించుకొని నెహ్రూబజార్‌లోని షిరిడీ సాయిబాబా మందిరంలో సప్తాహప్రవచనాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. సాయి పూజించి ఆచరించి జాలి గుణం, పరోపకారం, ఆధ్యాత్మికతలు ఆచరించాలన్నారు. సమాజ సేవలోనే భగవంతుని సేవ ఉందన్నారు. అనంతరం రాజేంద్రప్రసాద్‌ను మందిర కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మందిర అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షులు గోపి, సహాయ కార్యదర్శి పవన్, కరీమ్, కొండయ్య రామారావు, పిచ్చిరావు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

పెద్ద దోర్నాల, జూలై 9: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మొహర్రం వేడుకలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మతసామరస్యానికి ప్రతీకగా ఈ గ్రామంలో పదిరోజులు ఉత్సవాలు నిర్వహిస్తారని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ నెల 17న మొహర్రం పండుగ కాగా ఈ నెలలో వచ్చిన అమావాస్య మరుసటి రోజు నెల పొడుపు చూసి పీర్ల పండుగ ఉత్సవాలు ప్రారంభిస్తారు. ఆరు రోజుల పాటు విడిసరిగెత్తులు నిర్వహిస్తారు. మొక్కులున్న వారు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఏడవ రోజు చిన్నసరిగెత్తు, తొమ్మిదవ రోజు పెద్ద సరిగెత్తు పదవరోజు పీర్లు నీటిలో తడిపే కార్యక్రమం నిర్వహిస్తారు. కాగా ప్రధానంగా పెద్దసరిగెత్తురోజు ప్రతి కుటుంబం నుండి ఒకరు ఉపవాస దీక్షతో నైవేద్యాలు సమర్పిస్తారు. ఆ రోజు రాత్రి పెద్ద అగ్నిగుండం పేర్చి భక్తులు నిప్పుల్లో నడిచి మొక్కులు తీర్చుకుంటారు. అయితే ముజావరి ఒకరు తప్పా గ్రామంలో ముస్లింలు లేరు. అందరూ హిందువులే ఈ పండుగ నిర్వహించడం గమనార్హం.



తిమ్మాపురం చావిడిలో కొలువైన పీర్లు, గొర్లగడ్డ కొలువుదీరిన పీర్లు

తర్లుపాడు : మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలను మొహర్రం హిందూ, ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. నెలవంక మొదలు 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన తుమ్మల చెరువులో సోమవారం రాత్రి పీర్లను చావిడిలో నిలబెట్టారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 13న చిన్న షరిగత్, 16న పెద్ద షరిగత్, 17న పీర్లు నీళ్లబడతాయి. షరిగత్ రోజులలో ఇతర గ్రామాలు, ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని తమ మొక్కుబడులు తీర్చుకుంటారు.

మకానాలలో కొలువుదీరిన పీర్లు

మార్కాపురం వన్‌టౌన్ : మొహర్రంను పురస్కరించుకొని మార్కాపురం పట్టణంలోని పీర్ల మకానాలలో మంగళవారం పీర్లను కొలువు దీర్చారు. పట్టణంలోని పురాతనమైన ప్రసిద్ధి చెందిన గొర్లగడ్డ పీర్ల చావిడిలో పీర్లను అలంకరించి కొలువుదీర్చారు. మత సామరస్యానికి చిహ్నంగా నిలిచే పీర్ల పండుగను 10రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. గొర్లగడ్డ పీర్ల చావిడిలో బాదుల్లా సాహెబ్, బారా ఇమామ్, రంగు హుస్సేని, గొట్టిపడియా కాశీం సాహెబ్, ఇమామ్ హుస్సేనీ పీర్లు ఉన్నాయి. తూర్పు వీధిలో చినబాదుల్లా సాహెబ్ పీరు ప్రసిద్ధి చెందింది. అదే విధంగా విజయ టాకీస్, నాగులవరం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, పూలసుబ్బయ్య కాలనీలలో కూడా పీర్లు కొలువుదీరాయి. గొర్లగడ్డ పీర్ల చావిడిలో శనివారం మధ్యాహ్నం కాశీంపీరుకు పగలు ఉత్సవం, మంగళవారం రాత్రి బాదుల్లా సాహెబ్‌కు చిన్న షరగత్, బుధవారం పెద్ద షరిగత్, గురువారం సహాదత్.. పీర్లను నీళ్లల్లో ముంచే కార్యక్రమం నిర్వహించనున్నారు.



తుమ్మల చెరువు దర్గాలో కొలువుదీరిన పీర్లు

అవీ..ఇవీ..

కందులకు మంత్రి నారాయణ పరామర్శ



నారాయణరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి నారాయణ

మార్కాపురం, జూలై 9: కాలికి శస్త్రచికిత్స చేయించుకొని హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని రాష్ట్ర పురపాలక శాఖమంత్రి పొంగూరు నారాయణ మంగళవారం ఉదయం పరామర్శించారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రెండు కాళ్లకు గాయాలయ్యాయి. కుడికాలికి మళ్లీ శస్త్రచికిత్స చేయాల్సి రావడంతో ఆదివారం ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ విషయం తెలిసి మంత్రి నారాయణ వైద్యశాలకు వెళ్లి పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు.

అధ్వానంగా పాఠశాలకు వెళ్లే రహదారి



చిల్లచెట్ల నడుమ బురదమయంగా ఉన్న దారి

గిద్దలూరు, జూలై 9 : పట్టణంలోని బాల సరస్వతి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానం రోడ్డు నుంచి పాఠశాలకు వెళ్లాలంటే ఆ రోడ్డంతా కంపచెట్లతో మూసుకుని పోయింది. దానికితోడు మట్టి రోడ్డు కావడంతో చిన్నపాటి చినుకులు పడ్డా రోడ్డంతా బురదమయమై నడిచేందుకు వీలుకాని పరిస్థితి ఉంది. పాఠశాలలకు వెళ్లే పిల్లలు బురదలో జారిపడి గాయాల పాలవుతున్నారు. అధ్వానంగా ఉన్న ఈ మట్టి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి సిమెంటు రోడ్డుగా మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న కమిషనర్

పొదిలి, జూలై 9 : విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయిన ఒక దివ్యాంగుడికి సిరిగిరి రామకృష్ణ ఆర్థిసాయాన్ని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. పట్టణానికి చెందిన శివరామయ్య విద్యుత్ ప్రమాదానికి గురై రెండు చేతులు కోల్పోయాడు. దివ్యాంగ రక్షక్‌ఫౌండేషన్ ద్వారా విషయం తెలుసుకున్న రామకృష్ణ ఆ సంస్థ ఫౌండర్ నరసింహారావుకు రూ.5 వేల నగదు అంజేశారు. స్థానిక దివ్యాంగ రక్షక్‌ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదగా చెక్కు అందించారు. కార్యక్రమంలో మస్తాన్‌భాష, శ్రీను, రాధ, ఆంజనేయులు, బ్రహ్మారెడ్డి, ధనలక్ష్మీ, అమ్ములు, రాజేష్‌లు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి, జూలై 9 : పొదిలి ఆర్టీసీ డిపో పరిధిలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సుందరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొదిలి ఆర్టీసీలో డిపో పరిధిలో పొదిలి, దర్శి కొనకనమిట్ల, మర్రిపూడి, దొనకొండ, కురిచేడు మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రయాణీకులు ఉదయం 11 నుండి 12గంటల వరకు తమ సమస్యలను, సూచనలను 9959225700కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

పుస్తకాల పంపిణీ వేగవంతం చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకురాలు భారతి

పొదిలి, జూలై: 9 : ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాల పంపిణీ వేగవంతం చేయాలని ఎస్ఎస్ఏ రాష్ట్ర పరిశీలకురాలు భారతి సూచించారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్న పాఠశాలలో నిల్వఉన్న పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలు, బూట్లు, యూనిఫారంలు అదించే విషయంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. పుస్తకాలు ఎవరికైనా అందకపోతే వెంటనే తెలియజేయాలని సూచించారు.

నర్సరీలకు లైసెన్సులు తప్పనిసరి

• ఉద్యాన అధికారి ఆదిరెడ్డి



నర్సరీ యజమానికి లైసెన్స్ అందజేస్తున్న ఆదిరెడ్డి

త్రిపురాంతకం, జూలై 9: నర్సరీలు, షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేసే రైతులు రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలని ఉద్యాన అధికారి పి.ఆదిరెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సోమేపల్లి, వెల్లంపల్లి, శ్రీనివాసనగర్ గ్రామాల్లో షేడ్‌నెట్ నర్సరీలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సు లేని వాటిపై నర్సరీ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా నర్సరీలు ఏర్పాటు చేసేవారు లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీడ్స్ రిజిష్టరు, సేల్స్ రిజిష్టరు, ఇన్స్‌పెక్షన్ రిజిష్టరు, ప్లాంట్ ప్రొటెక్షన్ రిజిష్టరు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. గ్రామాల పరిధిలో 20 నర్సరీలను తనిఖీ చేసి సీడ్ బిల్లులను పరిశీలించారు. లైసెన్సు ఉన్న నర్సరీలలో మాత్రమే రైతులు కూడా నారు కొనుగోలు చేయాలని, బిల్లులు తీసుకోవాలని సూచించారు.

21న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

ఎమ్మెల్యే ఉగ్ర ఆధ్వర్యంలో నిర్వహణ

కనిగిరి, జూలై 9 : మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఈనెల 21 నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు మంగళవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాన్ని పరిసరప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కంటి చికిత్స కేవలం పేదవారికి మాత్రమేనని, శిబిరానికి వచ్చే కంటి సంబంధ బాధితులు గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఓటరుకార్డు జిరాక్స్ కాపీలని వెంట తెచ్చుకోవాలని తెలిపారు. తప్పనిసరిగా సెల్‌ఫోన్ నెంబరును తీసుకురావాలని కోరారు. కంటి శుక్లములతో బాధపడే పేదలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 7382601555, 7095601555 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలి

దర్శి, జూలై 9 : రైతులు సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దర్శి వ్యవసాయాధికారి బాలకృష్ణా నాయక్ సూచించారు. ప్రస్తుతం ఎల్‌ఆర్‌జీ 52 రకం కంది విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో బుకింగ్ చేసుకోవాలని ఆయన కోరారు.

జామాయిల్ దొంగలు..!

- అగ్రిగోల్డ్ భూముల్లో చెట్ల నరికివేత
- రాత్రికిరాత్రికే తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- కొరవడిన పోలీస్ నిఘా
- అడ్డుకట్ట వేయాలని ప్రజల విజ్ఞప్తి


అగ్రిగోల్డ్ భూముల్లో ఏపుగా పెరిగిన జామాయిల్ చెట్లు

పామూరు, జూలై 9 ; మండలంలో పలు చోట్ల ఉన్న అగ్రిగోల్డ్ ప్రైవేటు భూముల్లో సాగు చేస్తున్న జామాయిల్ చెట్లపై అక్రమార్కుల కన్ను పడింది. గుట్టు చప్పుడు కాకుండా చెట్లను నరికి దుంగలను రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు గ్రామస్థులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పామూరు మండలం రేణిమడుగు, చిలంకూరు, దూబగుంట, వడమరకట్టకిందపల్లి, గుమ్మలంపాడు, కంబాలదిన్నె రాజుపాలెం, ప్రాంతాల్లో వందల ఎకరాల్లో జామాయిల్ తోటలను సాగు చేశారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారాలు కోర్టు కేసుల్లో ఉండడంతో వాటి గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని కొంత మంది చోటా నాయకుల కన్ను జామాయిల్ చెట్లపై పడింది. అడవి పండింది. కాకులు తిన్నాయి అనే సామెతగా రాత్రికి రాత్రే అడ్డంగా నరికి అక్రమంగా రవాణా చేస్తూ కొల్లగొడుతున్నారు. అర్ధరాత్రిపూట నరికి పట్టపగలే వాహనాల్లో చెక్ పోస్టులు దాటిస్తున్నా అధికారులు పట్టించుకోవడంపై ప్రజలు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. అగ్రిగోల్డ్‌లో నగదు డిపాజిట్‌లు చేసిన ప్రజల ఆస్తులను అక్రమార్కులు ఇలా దోచుకుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> ముడి కర్ర టన్ను ధర రూ.4000 ఉండగా, తాట తీసినది రూ.5600 నుంచి రూ.5,800 పలుకుతోంది. అలాగే కర్రను నేరుగా కందుకూరులో ఉండే కంపెనీకి తరలిస్తే టన్ను ధర రూ.8,500 వరకూ వసూలు చేస్తున్నారు. రోజుకు మూడు, నాలుగు లారీల కర్ర తరలివెళ్తున్నట్లు తెలిసింది. ఒక లారీ కర్ర అమ్మితే రూ.లక్ష (25టన్నులు) వరకూ అక్రమార్కులు ఆర్జిస్తూ ప్రభుత్వ సొమ్మును కొల్లగొడుతున్నారు.

గతంలో దూబగంట ప్రాంతంలో అక్రమంగా లారీలో జామాయిల్ దుంగలను తరలిస్తుండగా పోలీసులు వలపన్ని పట్టుకొని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాంతో కొన్ని రోజులు నిలిచిన దందా ఎన్నికల అనంతరం మళ్లీ మొదలైంది. జీపీఆర్ఎస్ సిస్టమ్ ద్వారా అక్రమాలకు అడ్డుకట్టవేయాలని, వారెంతటివారైనా కేసులు నమోదు చేయాలని ఇటీవల జరిగిన పామూరు మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశంలో జామాయిల్ అక్రమ రవాణాపై ఎమ్మెల్యే ఉగ్ర పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికైనా పోలీసు, అటవీ శాఖ అధికారులు జామాయిల్ అక్రమరవాణాపై దృష్టి సారించి అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పట్టపగలే అక్రమంగా తరలివెళ్తున్న జామాయిల్ కర్ర


మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న సుజాత, నేతలు

టైలర్స్‌ను ఆదుకోవాలి

మంత్రి సవితకు అసోసియేషన్, సంఘ నేతల వినతి

తాళ్లూరు, జూలై 9 : ఏపీ రాష్ట్ర టైలర్స్ కార్పొరేషన్‌కు ఛైర్మన్‌ను నియమించి, నిధులు సమకూర్చి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ నేతలు బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవితకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు మారాబత్తుల సుజాత, రాష్ట్ర టైలర్స్ సంఘం నేత నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు టైలర్స్ సంఘ ప్రతినిధులు వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి సవితను మంగళవారం కలిశారు. టైలర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కొందరు టైలర్లకు భుక్తి జరగడం కూడా కష్టంగా మారిందన్నారు. టైలర్లు సజావుగా జీవించాలంటే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వైసీపీ హయాంలో కార్పొరేషన్ నిర్వీర్యమైందన్నారు. వెంటనే ఛైర్మన్‌ను నియమించి, నిధులు కేటాయించాలని వారు విన్నవించారు. మంత్రి సవిత సానుకూలంగా స్పందించి త్వరలో తగు చర్యలు చేపట్టి టైలర్స్‌కు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సవితను కలిసిన వారిలో తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, పలు జిల్లాల టైలర్స్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాలకు రేట్లు

ఆరోపణలపై స్పందించిన దేవదాయ శాఖ

పామూరు, జూలై 9 : పామూరు పట్టణంలోని శ్రీ మదనవేణుగోపాలస్వామి, శ్రీ వల్లీ భుజంగేశ్వరస్వామి, దేవస్థానాల్లో పూజా తదితర కార్యక్రమాలకు రేట్లను నిర్ణయిస్తూ ఎండోమెంట్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు ఆ ధరలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహబాబు వాటిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ భూముల ఆక్రమణ, ప్రత్యేక పూజలకు భక్తుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ఎండోమెంట్ శాఖ అధికారులు స్పందించారు. పూజలకు ధరలు నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ధరల పట్టికలో ఉన్న రుసుమును మాత్రమే చెల్లించి పూజలు చేయించుకోవాలని, రశీదు తీసుకోవాలని భక్తులకు సూచించారు. అర్చకులు అధిక మొత్తంలో వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని ఆలయ ఈవో కోరారు.


ఆలయంలో ఏర్పాటు చేసిన పూజల రేట్ల పట్టిక

పన్నులను వసూలు చేయండి

చీరాలటౌన్, జూలై 9 : పురపాలక సంఘ పరిధిలోని ఆస్తి, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. మంగళవారం మునిసిపల్ పరిధిలోని రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లకు సంబంధించిన లీజులు, షాపుల అద్దెలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

భవన నిర్మాణ సంక్షేమమే లక్ష్యం

ఉచిత ఇసుక అమలుపై సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

దొనకొండ, జూలై 9 : రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమం, నిర్మాణ రంగం అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుకను అందుబాటులోకి తెచ్చారని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలనలో ఐదేళ్ల ఇసుకను కొల్లగొట్టారన్నారు. ఇసుక కొరతను సృష్టించడంతో పేద, మధ్యతరగతి వర్గాలు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేకపోవడంతో పాటు భవననిర్మాణ కార్మికులకు పనులు లేకుండా చేశారని శివకోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన సీఎం చంద్రబాబు ఉచిత ఇసుకను అందుబాటులోకి తెచ్చి ఇంటి యజమానులు, నిర్మాణదారుల్లో సంతోషాన్ని నింపారన్నారు. ప్రజల తరపున చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 5వ తేదీన ఎంపీడీవో కార్యాలయం వద్ద జడ్పీ ఛైర్‌పర్సన్, దర్శి ఎమ్మెల్యేకు ప్రజా సమస్యలపై కలిసేందుకు తాము వెళ్లగా వైసీపీ శ్రేణులు పథకం ప్రకారం ఇతర ప్రాంతాల వారిని రప్పించి టీడీపీ శ్రేణులపై దౌర్జన్యానికి పాల్పడ్డారని శివకోటేశ్వరరావు ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వారి సొంత పత్రికలో తప్పుడు వార్తలు రాయిస్తున్నారని అన్నారు. సమావేశంలో టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, రిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జునశర్మ, నాయకులు శ్రుంగారపు నాగసుబ్బారెడ్డి, యరగొర్ల బసవయ్య, నిమ్మకాయల సుబ్బారెడ్డి, కొమ్మతోటి సుబ్బారావు, దుగ్గెంపూడి చెంచయ్య, మన్నెం గాలెయ్య, పెమ్మసాని లక్ష్మీనారాయణ, అంకాల మల్లి, బీపీ సైరస్, కుందుర్తి లక్ష్మణ్, కమ్మా నారాయణ, పోతిపోగు చెన్నయ్య, తోటా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిర్మాణ కూలీల్లో సంతోషం


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

కురిచేడు, జూలై 9 : చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ భవన నిర్మాణ రంగానికి ఊతమిస్తుందని టీడీపీ మండల కన్వీనర్ నెమిలయ్య అన్నారు. ఉచిత ఇసుకతో భవన నిర్మాణ కూలీలు, వ్యాపార వర్గాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. వైసీపీ పాలకులు ఓ ప్రైవేటు ఏజెన్సీకి ఇసుకను అప్పజెప్పారన్నారు. పెద్ద ఎత్తున ఇసుకను కొల్లగొట్టి అంతా అధినాయకుడి జేబులోకి వెళ్లేలా లాలూచీ పడ్డారని విమర్శించారు. చిన్న సన్నకారు కుటుంబాల వారు నూతన భవనాలను నిర్మించడానికి అనుకూలమైన వాతావరణం కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాట్రాజు నాగరాజు, కమతం నాగిరెడ్డి, మేరువ పెద్దిరెడ్డి, ఎర్రబొల్లికొండయ్య, గంధం గురునాధం, కిలారి కొండయ్య, మొఘల్ మస్తాన్ వలి, దాదా సాహెబ్, కేసనపల్లిసువయ్య మస్తాన్, బొనిగల అంకయ్య, మర్రి సుబ్బారావు, పత్తి సుబ్బయ్య, క్రిష్ణ, తిరువాయిపాటి నరసింహారావు, బాదం సుబ్బారెడ్డి, పాపిసెట్టి వెంకటరామయ్య, జోగయ్య పాల్గొన్నారు.

విద్యాలయ ప్రాంగణంలో ఆకతాయిలు మద్యం సేవించకుండా చర్యలు

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

తాళ్లూరు, జూలై 9 : తాళ్లూరులోని వీకే ఉన్నత పాఠశాల, కళాశాల ప్రాంగణాల్లో ఆకతాయిలు మద్యం సేవించకుండా తగు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ కే విజయ్‌కుమార్ తెలిపారు. 'ఆకతాయిలకు అడ్డాగా విద్యాలయాలు' అన్న శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి స్పందించారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో జి.సుబ్బయ్య ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యాలయం ప్రహరీగోడల వద్ద మద్యం సేవించిన ప్లాస్టిక్ గ్లాసులు, మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించారు. భవిష్యత్తులో మరలా పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని హెచ్ఎం లిఖిత పూర్వక వివరణ ఎంఈవోకు అందజేశారు. ఆకతాయిలపై తగు చర్యలు తీసుకుని విద్యాయ ప్రాంగణం అపరిశుభ్రం కాకుండా చూడాలని స్థానిక ఎస్‌హెచ్‌వోకు ఎంఈవో ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో గస్తీ ఉంచి విద్యాలయం ప్రాంగణం అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా చర్యలు చేపట్టినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రారంభమైన ఖరీఫ్ సాగు

- పలుచోట్ల వేసిన కంది, సజ్జ
- సిద్ధంగా ఉన్న భూములు
- వర్షం కోసం రైతుల ఎదురుచూపులు


దర్శి ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో విత్తనం వేసిన భూమి

దర్శి, జూలై 9 : దర్శి ప్రాంతంలో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. పలు గ్రామాల్లో కొద్దిరోజుల కిందట వర్షం పడడంతో విత్తనం వేశారు. మరికొన్ని గ్రామాల్లో విత్తనం వేసేందుకు భూములను చదును చేసి ఉంచారు. ప్రస్తుతం రాజంపల్లి, జముకులదిన్నె, సామంతపూడి, కొత్తపల్లి, తూర్పుచౌటపాలెం తదితర గ్రామాల్లో కంది, సజ్జ తదితర పైర్లను వేశారు. పైర్లు ఇంకా పలుచోట్ల మొలక ఎత్తలేదు. కొద్దిరోజుల్లో వానలు కురిస్తే లేత పైరు పుంజుకునే అవకాశం ఉంటుంది. మరికొన్ని గ్రామాల్లో విత్తనాలు చల్లేందుకు వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. మెట్ట భూముల్లో చాలినంత వర్షం పడకపోవడంతో ఆ ప్రాంతంలో భూములు ఖాళీగా ఉన్నాయి. వర్షం పడితే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.


తాళ్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తం

తాళ్లూరు, జూలై 9 : డెంగ్యూ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు నివారణ చర్యలు చేపట్టాలని పీహెచ్‌సీ వైద్యులు షేక్ ఖాదర్‌మస్తాన్‌బీ అన్నారు. డెంగ్యూ వ్యతిరేక దినం కార్యక్రమంలో భాగంగా తాళ్లూరులో వైద్య బృందం మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మస్తాన్‌బీ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో డెంగ్యూ జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. జ్వరాలు రాగానే ఇంటి పట్టునే ఉండి చికిత్సలకు పొందక వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షల్లో డెంగ్యూ లక్షణాలు కన్పిస్తే వెంటనే జ్వరాన్ని అదుపులోకి తీసుకోవచ్చునన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డెంగ్యూపై భయాందోళనలు అవసరం లేదని అన్నారు. పరిసరనాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా రోగాలను అరికట్టవచ్చని డాక్టర్ మస్తాన్‌బీ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రమేష్, డీపీఎంవో సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్ పి.రవికుమార్, హెచ్ఎస్ బీ కోటేశ్వరి, స్టాప్ నర్స్ నాగలక్ష్మి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

అదనపు తరగతి గదులు లేక అవస్థలు

- పాఠశాలల్లో సౌకర్యాలు పెంచాలి
- విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి

పామూరు, జూలై 9 : పామూరు పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కాలనీ వడ్డెపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తగిన సౌకర్యాలు లేవు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా వసతులు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ బడిలో 50 మంది విద్యార్థులు ఉండగా, ఈ విద్యాసంవత్సరానికి మరో 40 మంది చేరారు. ప్రస్తుతం 92 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా తదనుగుణంగా అవసరమైన వసతులు, తరగతి గదులు లేకపోవడంతో చాలీచాలని గదుల్లోనే విద్యాభ్యాసం సాగిస్తున్నారు. నలుగురు ఉపాధ్యాయులు చక్కటి బోధన చేస్తున్నారు. ఇప్పటికైనా అదనపు తరగతిగదులను మంజూరు చేసి, నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్య

ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి


టీచ్‌టూల్ కార్యక్రమంపై మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

కనిగిరి, జూలై 9 : అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని గుంటూరు విద్యాశాఖ ఆర్‌జేడీ బీ లింగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో జరుగుతున్న టీచ్ టూల్ పర్యవేక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిరోజులపాటు శిక్షణలో నేర్చుకున్న అంశాలు పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు ఆచరిస్తున్నరో లేదో పరిశీలించాని సూచించారు. బోధనలో ఉపాధ్యాయులు ఆచరిస్తున్న విధానాలు, విద్యార్థుల అవగాహనజ్ఞానాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు మరింత చొరవ చూపాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠ్యాంశంపై జరిగిన బోధనాంతర పరీక్షలు నిర్వహించి విద్యలో వెనుకబడిన పిల్లలను విద్యలో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక సమయం కేటాయించాలన్నారు. స్టూడెంట్ కిట్‌లలో భాగంగా ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫారమ్స్, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్‌లతో పాటు బ్యాగులు, షూస్, బెల్టులు వంటి సామాగ్రిని వంద శాతం అందించాలని ఎంఈవో, హెచ్‌ఎంలను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం అములులో జాగ్రత్తలు పాటించాలని ఆర్‌జేడీ సూచించారు. అనంతరం పట్టణ సమీపంలోని గార్లపేట రోడ్డు లో ఉన్న మోడల్‌స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన తీరు ను, కంప్యూటర్ ల్యాబ్‌ను ఆర్‌జేడీ పరిశీలించారు. ఆయనవెంట ఏంఈవోలు యూవీ నారాయణరెడ్డి, సంజీవీ, రాజాల కొండారెడ్డి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమణయ్య, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు పరాధీనం కానివ్వం

వేటపాలెం(చీరాల), జూలై 9 : ప్రభుత్వానికి సబంధించి సెంటు భూమి కూడా పరాధీనం కానివ్వమని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేటపాలెం మండలం నాయినిపల్లి దత్తక్షేత్రంలో నిబంధనలకు విరుద్ధంగా నివేశన స్థలాలు కేటాయించాలని కలెక్టర్‌కు ప్రజా పరిష్కారాల వేదికలో సోమవారం కొందరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ కృష్ణకాంత్, ల్యాండ్స్ అండ్ షైన్స్ సర్వే బాధ్యుడు ముసలయ్య తదితరులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తమ నివేదికను పారదర్శకంగా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు

పోటీపడుతున్న పలువురు నేతలు

అద్దంకి, జూలై 9: నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు తమ ప్రయత్నాలను ప్రారంభించారు. అద్దంకి నియోజకవర్గంలో అద్దంకి, సంతమాగులూరు మార్కెట్ కమిటీల పాలకవర్గాలతో పాటు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్, డైరెక్టర్‌ల పోస్టులకు ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. అద్దంకి మార్కెట్ కమిటీ పరిధిలో అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాలు, సంతమాగులూరు మార్కెట్ కమిటీ పరిధిలో సంతమాగులూరు, బల్లికురవ మండలాలు ఉన్నాయి. దీంతో ఆయా పరిధిలోని నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని అద్దంకి, మేదరమెట్లలో కూరగాయల సంతలు నిర్వహిస్తున్నారు. దీంతో పాలకమండలి కనుసన్నలలో సంత నిర్వహణ జరిగే అవకాశం ఉండటంతో కనీసం డజను మందికి పని కల్పించే అవకాశం ఉంది. అదే సమయంలో రైతులకు మేలు చేకూర్చే కార్యక్రమాలు నిర్వహణకు కూడా అవకాశం ఉంది. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన పాలక మండలికి మంచి గుర్తింపు ఉంటుంది. సుమారు రూ.7 కోట్లతో దేవాలయం అభివృద్ధి పనులు కూడా జరుగుతుండటంతో పాలక మండలికి మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇక అవుట్ సోర్సింగ్ ద్వారా సుమారు 15 నుంచి 20 మంది సిబ్బందికి అవకాశం కల్పించే అవకాశం కూడా ఉంది. అదే సమయంలో సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఇతర పలు దేవాలయాలకు కూడా కమిటీలు వేయనున్నారు. శింగరకొండ దేవాలయ పాలకమండలి ఛైర్మన్‌గా కొన్ని దశాబ్దాలుగా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు ఆనవాయితీగా కేటాయిస్తున్నా రు. అద్దంకి పట్టణంలోని పలువురు ఆర్యవైశ్యులు ఇప్పటికే తమ ప్రయత్నాలు ప్రారంభించారు. డైరెక్టర్‌లుగా మిగిలిన సామాజిక వర్గాలకు కేటాయించే అవకాశం ఉండడంతో ఎవరికి వారే ప్రయత్నాలు ప్రారంభించారు. నామినేటెడ్ పదవుల ఆశించే నేతలు ఎక్కువగా ఉండడంతో ఎంపికపై మంత్రి కసరత్తు చేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు తెలుస్తుంది. మంత్రి ఇతర బాధ్యతల్లో బిజీగా ఉండడంతో నామినేటెడ్ పంపకం ఆలస్యమయ్యేలా కన్పిస్తుంది.





● మాచర్లలో ఐదేళ్లు పనులు చేయకుండా వదిలేసిన టిడ్కో గృహాలు

టిడ్కో కసరత్తు

పేదలకు గృహయోగం.. కసరత్తు మొదలైంది. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా శ్రీకారం చుట్టిన టిడ్కో ఇళ్లను జగన్ ఐదేళ్లు పాడుపెట్టగా.. వాటిని పూర్తి చేసి పంపిణీ చేసే బాధ్యత కూడా చంద్రబాబే చేపట్టారు. 2014లో నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు పేదల కోసం ఆధునిక టెక్నాలజీతో టిడ్కో ఇళ్లను మున్సిపల్ కేంద్రాల్లో నిర్మించారు. పేదల సొంతింటి కల సాకారమ వుతుందనే సమయంలో 2019లో ప్రభుత్వం మారింది. వైసీపీ అధినేత జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే టిడ్కో ఇళ్లను అర్థాంతరంగా నిలిపి వేశారు. అప్పటికే పూర్తై.. గృహ ప్రవేశాలు జరిగిన ఇళ్లలో కూడా అరకొర పనుల ను ప్రభుత్వం పట్టించుకోకుండా ఐదేళ్లు కాలయాపనతో సరిపెట్టింది. ఒకవైపు టిడ్కో ఇళ్ల కోసం అప్పులు చేసి దానికి వడ్డీలు కడుతూ.. మరోవైపు అద్దె భారంతో పేదలు అల్లా డుతున్నా.. జగన్ ప్రభుత్వం పట్టించుకోకుండా అదిగో ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తూ వచ్చింది. ఇక జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా తమకు టిడ్కో రావని పేదలు నిర్ణయించేసుకున్నారు. ఈ దశలో తాజా ఎన్నికల్లో కూ టమి ప్రభుత్వం చంద్రబాబు నేతృత్వంలో అధికారం చేపట్టింది. దీంతో పేదలు తమకు గృహయోగం కలుగుతుందని ఆశించారు. వారి ఆశలకు తగినట్లుగానే టిడ్కో ఇళ్ల పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చేం దుకు అవసరమైన ప్రతిపాదనల ను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించిం ది. మార్చి నాటికి టిడ్కో ఇళ్ల పనులు పూర్తి చేసి పేదల గృహయోగం సాకారం చేసేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు.

పేదలకు గృహయోగం దిశగా..

- గృహాల పూర్తికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- రూ.917 కోట్ల నిధులు మంజూరుకు అంగీకారం
- మార్చికల్లా 10,240 టిడ్కో ఫ్లాట్లు పంపిణీకి చర్యలు


(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
ఐదేళ్లుగా సొంత ఇంటి కోసం పేదలు కంటున్న కలలను కూటమి ప్రభుత్వం సాకారం చేసేందుకు సిద్ధమైంది. దీంతో పట్టణాల్లో పేదలు సొంత ఇంటి కల నెరవేర్చే దిశగా అధికారులు అడుగులు మొదలు పెట్టారు. ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఉంటూ అనేక రకాలుగా అవస్థలు పడిన పట్టణ పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. అదే వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారం చేపట్టగానే రివర్స్ టెండర్ల పేరుతో దానిని తుంచేసింది. టీడీపీ హయాంలో చేపట్టిన వేలాది టిడ్కో గృహాలను పూర్తి చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాడుబెట్టింది. టిడ్కో ఇళ్ల నిధుల కేటాయింపును కూడా విస్మరించింది. ఈ పరిస్థితుల్లో తాజగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేసేందుకు సమాయత్తమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 10,240 గృహాలు పూర్తి చేసి వచ్చే మార్చి కల్లా పేదలకు గృహ యోగం కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. టిడ్కో గృహాలను పూర్తి చేసి పంపిణీ చేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. టిడ్కో ఉన్నతాధికారులు సీఎం చంద్రబాబునాయుడుతో మంగళవారం భేటీ అయ్యారు. పేదల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంపై దృష్టి సారించాలని టిడ్కో అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మాచర్ల, వినుకొండ, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, రేపల్లె, వెంగళాయపాలెం, తెనాలిలో నిలిచిపోయిన గృహాలను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేసే దిశగా ప్రభుత్వం సమాయత్తమైంది. చంద్రబాబు హయాంలో చేపట్టిన టిడ్కో గృహాలను తిరిగి తాజాగా అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వమే పూర్తి చేసి పేదల కల సాకారం చేయనున్నది. వైసీపీ ప్రభుత్వం అర్థాంతరంగా నిలిపివేసిన వేలాది గృహాల పనులను తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం నడుం కట్టింది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పేదల్లో సొంత ఇంటిపై ఆశలు చిగురిస్తున్నాయి. నిలిచిపోయిన గృహాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా ఇళ్ల నిర్మాణ బకాయిలను చెల్లించేందుకు చర్యలు చేపట్టింది. ఇళ్ల నిర్మాణం పూర్తితో పాటు మౌలిక వసతులను కల్పిస్తారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మిస్తారు. ఆయా పనులు పూర్తి చేసేందుకు, బకాయిలు చెల్లింపునకు రూ.917 కోట్లు అవసరం అవుతుందని ప్రతిపాదనలను టిడ్కో నుంచి ప్రభుత్వానికి అందాయి. మొత్తం 10,240 గృహాలను పూర్తి చేసి అన్ని వసతులు కల్పించి మార్చి కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

కక్షగట్టిన వైసీపీ ప్రభుత్వం

పేదలపై వైసీపీ ప్రభుత్వం కక్ష కట్టినట్లుగా టిడ్కో గృహాలను పూర్తి చేయలేదు. గృహాలను పంపిణీ చేయాలన్న పేదల మొరను పాలకులు వినిపించుకోలేదు. పనుల పూర్తి మాట ఎలా ఉన్నా నిర్మాణంలో ఉన్న గృహాలను గత ప్రభుత్వం బ్యాంకుల్లో తనఖా పెట్టింది. ఆ రుణాలతో పనులు చేయలేదు. పైగా ఆ నిధులను జగన్ ప్రభుత్వం మళ్లించుకున్నట్లు సమాచారం. టిడ్కో ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని టీడీపీ సహ ఇతర ప్రతిపక్షాలు, లబ్ధిదారులు ఆందోళనలు చేసినా నాటి పాలకులు పట్టించుకోలేదు. ఇళ్లు శిథిలమవుతున్నాయని, అసాంఘీక కార్యకలపాలకు నిలయాలుగా మారుతున్నాయని లబ్ధిదారులు వాపోయినా నిర్లక్ష్యం వీడలేదు. పండుగల పేర్లు చెబుతూ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను ప్రభుత్వం మభ్య పెడుతూ వచ్చింది. ఎన్నికలకు ముందు తొమ్మిది నెలల క్రితం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అయితే టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లో తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించకుండా ప్రజా ప్రతినిధులు హడావుడితో సరిపెట్టారు.

పట్టణాల వారీగా పూర్తి చేయనున్న గృహాలు..

పట్టణం	గృహాల సంఖ్య
మాచర్ల	1056
వినుకొండ	1440
పిడుగురాళ్ల	2832
సత్తెనపల్లి	160
చిలకలూరిపేట	1008
వెంగళాయపాలెం	1392
తెనాలి	1008
రేపల్లె	1344



● వినుకొండలో టిడ్కో గృహాలు

నాలుగున్నరేళ్లు నాన్చారు

టీడీపీ హయాంలో దాదాపు 90 శాతం పూర్తయిన ఇళ్లకు తుది మెరుగులు దిద్ది, మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లు నాన్చివేత ధోరణి అవలంబించింది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని టిడ్కో ఇళ్ల పంపిణీ 2019లో ఆగి పోయింది. అప్పటి నుంచి ప్రభుత్వం 2023 మే వరకు ఇళ్ల పంపిణీ చేసే యో చన చేయలేదు. కట్టిన ఇళ్లు శిథిలమవుతున్నాయని ప్రతిపక్షాలు, లబ్ధిదారులు ఆందోళనలు చేసినా ఆలకించలేదు. ఎన్నికల ఏడాది ప్రారంభంలో చేపట్టిన ఇళ్ల పంపిణీ హడావుడితోనే సరిపోయింది. సదుపాయాల కల్పన చేయకుండా పట్టాల పంపిణీతో జగన్ మాయ చేశారని అప్పట్లో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లయితే పంపిణీ చేశారుగాని నివాసాలకు కావాల్సిన కనీస వసతులను కూడా కల్పించలేదని ఇదే నాటి జగన్ చిత్తశుద్ధికి నిదర్శనమని లబ్ధిదారులు తెలిపారు.

పరిచయ సమీక్ష



- నేడు కలెక్టరేట్ వేదికగా కార్యక్రమాలు
- జిల్లా అధికారులతో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల భేటీ
- అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై సమీక్ష.. నిధులపై ఆరా

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తాజా ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కలెక్టర్, జేసీ తదితర అధికారులు మారారు. ఈ క్రమంలో అటు ఎమ్మెల్యేలు, ఇటు జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం కలెక్టరేట్ వేదికగా బుధవారం జరగనున్నది. దీనికి జిల్లాలోని ఇద్దరు మంత్రులతో పాటు కొత్తగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ హాజరుకానున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఇప్పటికే నాలుగు వారాలు దాటినా జిల్లా స్థాయి అధికారులకు ఎమ్మెల్యేలతో ఇంతవరకు పరిచయ కార్యక్రమం జరగలేదు. అధికారుల బదిలీలు జరిగాక ఈ కార్యక్రమం పెట్టుకోవాలని తొలుత భావించారు. కానీ దానికి మరికొస్త సమయం పట్టే అవకాశం ఉన్నందున పరిచయ కార్యక్రమాన్ని ముందుగానే ఏర్పాటు చేశారు. దీనితో పాటు ప్రధాన విభాగాలకు సంబంధించి పూర్తి సమాచారంతో కార్యక్రమానికి హాజరు కావాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు అందాయి

ఇద్దరు మంత్రుల సహా..

జిల్లాలోని ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం.కొండయ్య, ఏలూరి సాంబశివరావు, నక్కా ఆనంద్‌బాబు, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌తో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లు ఈ పరిచయ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కలెక్టర్ వెంకటమురళితో పాటు ఆయా విభాగాల అధికారులందరూ ఈ ముఖాముఖిలో భాగం కానున్నారు. పరిచయ కార్యక్రమం అనంతరం జిల్లాలో తక్షణం చేపట్టాల్సిన పనులపై మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారని సమాచారం. ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతుండడంతో కాల్వల్లో పూడికతీత పనులపై దృష్టిసారించే విధంగా యంత్రాంగానికి ఆదేశాలు ఇవ్వనున్నారు. ఎరువుల లభ్యత, రైతులకు రుణాలు లాంటి అంశాలకు కూడా ప్రాధాన్యం దక్కనుంది. ఆయా విభాగాలలో నిధుల లభ్యతపై ఆరా తీయనున్నారని తెలుస్తోంది.

అధికారుల కసరత్తు...

కొత్త ప్రభుత్వం కొలువుదీరాక జరగనున్న తొలి సమావేశం కానుండడంతో వివిధ విభాగాల అధికారులు పూర్తి వివరాలతో హాజరుకావడానికి కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయశాఖ, ఇరిగేషన్‌తో పాటు ఆర్ అండ్‌బీ విభాగాలు బుధవారం నాటి సమీక్షలో కీలకంగా ఉండనున్నాయి. మంత్రులు కూడా హాజరవనుండడంతో వారి ముందుకు ఆయా శాఖలు ఎదుర్కొంటున్న నిధుల సమస్య కూడా ఏకరువుపెట్టే విధంగా నివేదికలు తయారు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసానికి సంబంధించి ఒక్కొక్క విభాగం మీద శ్వేతపత్రం విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదే విధానాన్ని జిల్లా స్థాయిలో అవలంభించే విధంగా వివరాలు అడిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇసుకలో జరిగిన దోపిడీ ఎంత అనే అంశంతో పాటు అసైన్ భూముల బాగోతంపై కూడా సమగ్ర వివరాలను ప్రజల ముందుంచి తదుపరి చర్యలకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

సీడ్ యాక్సెస్.. సవాల్





సీడ్ యాక్సెస్ రోడ్డు

- గత టీడీపీ హయాంలో 50 శాతం రోడ్లు పూర్తి
- ఎక్కడికక్కడ పనులు నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం
- పలు రోడ్లు తవ్వేసి.. సామగ్రి అపహరణతో అస్తవ్యస్తం
- వాటిని పునరుద్ధరించి రోడ్డు నెట్‌వర్కుపై సీఆర్‌డీఏ దృష్టి
- కేపిటల్ సిటీ రోడ్డు నెట్‌వర్కు పూర్తి చేస్తే అమరావతి అభివృద్ధి జెట్ స్పీడ్

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి.. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ. రోడ్ల అనుసంధానంతో రాజధాని అమరావతి అభివృద్ధిలో దూసుకెళ్తోంది.. అని అందరూ భావించారు. ఆ దిశగా నాటి టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ప్రణాళికలు రూపొందించి అమలు చేశారు. అమరావతి అన్ని ప్రాంతాలకు అనుసంధానం చేస్తూ సీడ్ యాక్సెస్ రోడ్ల నిర్మాణాలను పెద్దఎత్తున చేపట్టారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అమరావతికి శాపమైంది. అమరావతి రాజధాని భవితవ్యం కేపిటల్ సిటీ రోడ్డు నెట్‌వర్కుపై ఆధారపడినా వాటిని ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్లు పాడుబెట్టారు. పైగా అప్పటికే పూర్తి చేసిన రోడ్లను తవ్వేసి ఇసుక, కంకరను తరలించారు. నిర్మాణ సామగ్రిని అపహరించి సొమ్ము చేసుకోవడంపైనే నాటి పాలక పక్షం దృష్టి సారించింది. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టడంతో అమరావతి అభివృద్ధి పట్టాలెక్కింది. ఈ క్రమంలో సీడ్‌యాక్సెస్ రోడ్ల పూర్తి ప్రస్తుతం సీఆర్‌డీఏకు సవాల్‌గా మారింది.

238 కిలోమీటర్ల మేర..

దాదాపుగా 238 కిలోమీటర్ల మేరకు సీడ్ యాక్సెస్ రోడ్డు, మేజర్ ఆర్టీరియల్, ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రోడ్ల నిర్మాణం సవాలుగా మారింది. ఇందుకోసం సుమారుగా రూ.9 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేయాల్సి ఉన్నది. ఇప్పటికే వీటి నిర్మాణం ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని ప్రారంభ దశలో ఉంటే మరికొన్ని 30 శాతం, రెండు రోడ్లు 50 శాతం పైగా పూర్తి అయ్యాయి. కూటమి ప్రభుత్వం రాబోయే రెండేళ్లలో ఈ రోడ్ నెట్‌వర్కుని పూర్తి చేయగలిగితే అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ గృహాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు వంటివి నిర్మించడానికి పెద్దఎత్తున పెట్టుబడిదారులు తప్పక ముందుకు వస్తారని రాజధాని ప్రజలు భావిస్తున్నారు. రాజధాని నగరంలో అత్యంత కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డు(ఈ 3 రోడ్డు)గా పరిగణిస్తారు. దీని పొడవు 18.27 కిలోమీటర్లు కాగా ప్రాజెక్టు ఖర్చు రూ.252 కోట్లు. ఇప్పటికే 67.80 శాతం పూర్తి అయింది. ఇది సంపూర్ణం అయితే చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారితో అమరావతి రాజధాని అనుసంధానం పూర్తి అవుతుంది. మరోవైపు చినకాకాని - గుండుగొలను జాతీయ రహదారి నిర్మాణం చివరి దశలో ఉన్నది. ఇది పూర్తి అయితే చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారితో పాటు విజయవాడ - హైదరాబాద్ రోడ్డుకు కనెక్టివిటీ వస్తుంది. దాంతో వాహనాల రాకపోకలు గణనీయంగా పెరుగుతాయి. రాజధానిలో 1 (రోడ్డు) ఈ08 కాగా దీని పొడవు 14.95 కిలోమీటర్లు. దీనికి రూ.319 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటికే 34.61 శాతం పని పూర్తి అయింది. 2(రోడ్డు) ఎన్9. దీని పొడవు 12.5 కిలోమీటర్లు. రూ. 252 కోట్ల అంచనా విలువతో చేపట్టిన ఈ రోడ్డు పని 50.74 శాతం పూర్తి అయింది. 3వ(రోడ్డు) ఎన్04, ఎన్ 14. దీని పొడవు 15.14 కిలోమీటర్లు కాగా రూ.312 కోట్ల అంచనాతో ఏపీసీఆర్‌డీఏ ప్రారంభించి 35.15 శాతం పూర్తి చేసింది. 4వ(రోడ్డు) ఈ10, ఈ14, ఎన్16 పొడవు 23.94 కిలోమీటర్లు. ఈ రోడ్డుని కూడా 2019కి ముందే అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.395 కోట్ల అంచనాతో ప్రారంభించి 24.70 శాతం పనిని పూర్తి చేసింది. 5వ(రోడ్డు) ఈ6 రోడ్డు పొడవు 9.85 కిలోమీటర్లు కాగా రూ.322 కోట్లతో ప్రారంభించి 10.66 శాతం పూర్తి చేసింది. 6వ రోడ్డు ఈ12 పొడవు 6.791 కిలోమీటర్లు. దీని నిర్మాణాన్ని రూ.265 కోట్లతో ప్రారంభించి 5.79 శాతం మాత్రమే పూర్తి చేయగలిగింది. 7వ రోడ్డు ఎన్ 11 పొడవు 8.657 కిలోమీటర్లు. ఈ రోడ్డు పూర్తి చేయడానికి రూ.327 కోట్ల నిధులు అవసరమౌతాయి. ఇప్పటివరకు 12.88 శాతం పని పూర్తి అయింది. సీరియల్ నెంబరు. 8, 9, 10లను ఈ10, ఈ14, ఎన్ 16, ఈ6, ఈ8, ఈ12, ఎన్ 11లో మౌలిక సదుపాయాల కోసం కేటాయించారు. ప్యాకేజ్ నెంబరు 8 వర్కులకు రూ.550 కోట్లు, 9లో ఉన్న పనులకు రూ.759 కోట్లు, 10లో ఉన్న వాటికి రూ.685 కోట్లు అవసరమౌతాయి. ఈ పనులు కూడా ప్రారంభమై 12 నుంచి 24 శాతం వరకు పూర్తి అయి ఉన్నాయి. 11(రోడ్లు, యుటిలిటీస్) ఈ2, ఈ4, ఎన్7 రోడ్డు పొడవు 32.737 కిలోమటర్లు కాగా రూ. 1,502 కోట్లతో పనులు ప్రారంభించిన ఎల్ అండ్ టీ సంస్థ 21.35 శాతం పూర్తి చేసింది. 12(రోడ్లు, యుటిలిటీస్) ఈ7, ఈ9, ఈ11, ఎన్3ఏ, ఎన్3బీ పొడవు 36.705 కిలోమీటర్లు కాగా రూ. 1429 కోట్లతో మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రారంభించి 24 శాతం పూర్తి చేసింది. 13(రోడ్డు, యుటిలిటీస్) ఎన్ 8, ఎన్10 రోడ్డు పొడవు 30.171 కిలోమీటర్లు కాగా ఎన్‌సీసీ సంస్థ రూ.1436 కోట్లతో చేపట్టి 13.50 శాతం పూర్తి చేసింది. 14(రోడ్లు, యుటిలిటీస్) ఈ16, ఎన్ 12, ఎన్15, ఎన్ 17 పొడవు 28.69 కిలోమీటర్లు కాగా రూ.1,301 కోట్లతో ఎన్‌సీసీ చేపట్టి 15.07 శాతం పూర్తి చేసింది. 15 రోడ్డు ఈ08, డబ్ల్యూఎస్‌ఐఎస్ పొడవు 13.96 కిలోమీటర్లు కాగా దీనిని కూడా ఎన్‌సీసీ చేపట్టింది. రూ.1,571 కోట్లతో నిర్మాణం ప్రారంభించి 8.77 శాతం పనిని పూర్తి చేసింది. వీటితో పాటు ఎన్ 13, ఈ5 రోడ్లకు మరో రూ.715.74 కోట్ల నిధులు అవసరమౌతాయి.

వైసీపీ హయాంలో విధ్వంసం

అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్‌లో కేపిటల్ సిటీ రోడ్డు నెట్‌వర్కు ప్లాన్‌కు అనుగుణంగా రోడ్ల నిర్మాణాలను అప్పటి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం చేపట్టి కొంతమేరకు పూర్తి చేసింది. 2019లోనూ టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే ఈపాటికే రోడ్డు నెట్‌వర్కు అంతా పూర్తి అయి ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం రావడంతో ఎక్కడికక్కడ పనులు నిలిపేసి కాంట్రాక్టర్లను తరిమేసింది. దాంతో ఆయా సంస్థలు ఏర్పాటు చేసుకున్న యంత్రాలు, కర్మాగారాలు శిథిలమైపోయాయి. మరోవైపు నిర్మాణం జరిగిన రోడ్లను ఎక్కడికక్కడ వైసీపీ దొంగలు తవ్వేసి తీసుకెళ్లారు. పైపులైన్లు, గ్రావెల్, మెటల్ వంటివి వేటినీ వదిలి పెట్టలేదు. ఇప్పుడు అవన్నీ పునరుద్ధరించి రోడ్డు నెట్‌వర్కు పనులను ప్రారంభించి పూర్తి చేయడమే ఏపీసీఆర్‌డీఏ, ఏడీసీలకు సవాలుగా మారింది. ఈ నెట్‌వర్కుని పూర్తి చేయగలిగితే శరవేగంగా లేఅవుట్లలో నిర్మాణాలు ఊపందుకుంటాయి. దాని వల్ల భవన నిర్మాణ ప్లాన్‌లు, నిర్మాణ సామగ్రి కొనుగోలుకు సంబంధించి జీఎస్‌టీ, ఇతర పన్నుల రూపంలో అమరావతి రాజధానికి భారీగా ఆదాయం సమకూరుతుంది. సీడ్‌యాక్సెస్ రోడ్లు పూర్తి చేస్తే పెట్టుబడుల కోసం ఎదురు చూడాల్సిన పని ఉండదు. రెసిడెన్షియల్, కమర్షియల్ పరంగా ఎల్లెడలా విస్తరించుకుంటూ అమరావతి అజరామరంగా వెలిగిపోయే అవకాశం ఉంటుంది.

అక్రమ లేఅవుట్లపై ఆరా



● వెస్ట్ బాపట్ల పరిధిలో నిబంధనలు పాటించకుండా వేసిన లే అవుట్

- నోటీసులు.. చర్యలపై యంత్రాంగం దృష్టి
- అక్రమాలకు అండగా ఉన్న నేతలపైనా విచారణ

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్ల దందాపై నూతన ప్రభుత్వం దృష్టి సారించిన సంగతి తెలిసిందే. రియల్టర్ల మాయలో చిక్కుకుని గుల్లవుతున్న సామాన్యుల ఇక్కట్లను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం వాటికి సంబంధించిన వివరాలను రాబడుతోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా వెలసిన అక్రమ లే అవుట్లపై యంత్రాంగం దృష్టి సారించింది. వైసీపీ నేతల అండతో జిల్లా పరిధిలోని రియల్టర్లు చెలరేగిపోయారు. గడచిన ప్రభుత్వంలోని అధికారులు అక్రమ లేఅవుట్లను గుర్తించి నోటీసులు జారీ చేశారు. అయితే వైసీపీ నేతల జోక్యంతో అక్రమ లేఅవుట్లపై చర్యలు అంతటితో ఆగిపోయాయి తప్పితే అంగుళం ముందుకు కదలలేదు. పైగా నోటీసులు ఇచ్చింది 2022లో కాగా మళ్లీ ఈ వ్యవధిలో కూడా పదుల సంఖ్యలో లే అవుట్లను నిబంధనలకు విరుద్ధంగా వేసి మధ్య తరగతి వర్గాలను నిలువునా వంచించారు. గతంలో జారీ చేసిన నోటీసులతో పాటు ప్రస్తుతం వేటికి నోటీసులు ఇచ్చి వివరణ కోరాలి అనే అంశాలతో సమగ్ర నివేదికపై యంత్రాంగం దృష్టి సారించింది. దీనికి సంబంధించిన కసరత్తును ఇప్పటికే ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. 2022లో జిల్లా వ్యాప్తంగా 241 లే అవుట్లు నిబంధనల ప్రకారం లేవని గుర్తించి వాటి యజమానులకు నోటీసులను యంత్రాంగం అందించింది. ఒక్క బాపట్లలోనే 61 ఉన్నట్లు గుర్తించగా వీటిలో దాదాపు 50కి కనీస స్థాయిలో కూడా అనుమతులు లేవనే అంశం అప్పట్లో బహిర్గతమైంది. వీటి యజమానులంతా వైసీపీ నేతల అనుచరగణమే కావడంతో నోటీసులను చెత్తబుట్టల్లోకి వెళ్లాయి. లే అవుట్లలో పెట్టిన ఫ్లెక్సీలను సైతం పీకిపారేసి అధికార జులుం ప్రదర్శించారు. అప్పుడు జారీ చేసిన నోటీసులకు వివరణ ఇవ్వక పోగా మళ్లీ ఆ యజమానులే ఈ రెండేళ్ల వ్యవధిలో ఇంకో 70 వరకు అక్రమ లే అవుట్లను వేశారనేది సమాచారం.

జరిమానాలు వేయడమా.. బ్లాక్ చేయడమా..

అధికార పార్టీ అండ ఉందనే ధీమాతో ప్రభుత్వం జారీ చేసిన నోటీసులపైనే లెక్కలేని తనంగా వ్యవహరించిన రియల్టర్లపై ఏం చర్యలు తీసుకోనున్నారో అనేది చూడాల్సి ఉంది. 2022లో జిల్లాలో 241 లే అవుట్లకు జారీ చేసిన నోటీసులలో ఏ ఒక్కదానికి కూడా సంతృప్తికర వివరణ యంత్రాంగానికి అందలేదు. నిబంధనల ప్రకారం రెండో దఫా నోటీసులు కూడా అప్పట్లో జారీ చేశారు. అయినా స్పందనలేదు. ఒకరిద్దరు రియల్టర్లు అయితే అధికారులను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ దందాలో బాపట్ల మాజీ ఎమ్మెల్యే పీఏ కీలకంగా వ్యవహరించారనే ప్రచారం అప్పట్లో నడిచింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ లే అవుట్ల దందాపై దృష్టి పెట్టినందు వల్ల అప్పుడు జారీ చేసిన నోటీసుల సంగతేంటి అన్న అంశంతో పాటు, పీఏ పాత్ర వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు కోరుతున్నారు. రెండుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించని వారికి భారీగా జరిమానా విధించడమో లేక వాటి అనుమతులు రద్దు చేసి బ్లాక్‌లిస్టులో పెట్టడమో చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే లే అవుట్లలో దాదాపు 60 శాతం ప్లాట్లు వినియోగదారులకు అమ్మకాలు జరిపి కోట్లు గడించారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకునే నిర్ణయం వారి ప్రయోజనాలకు భంగం కలగకుండా ఉండాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

బాపట్ల జేసీగా బి.సుబ్బారావు

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బి.సుబ్బారావును నియమిస్తూ ప్రభు త్వం మంగళవారం ఆదేశాలిచ్చింది. 2017 బ్యాచ్‌కు చెందిన సుబ్బారావు ప్రస్తుతం జగనన్న అర్బన్ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకానికి ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ జేసీగా పనిచేసిన చామకూరి శ్రీధర్ ఉద్యోగోన్నతిపై అన్నమయ్య జిల్లాకు కలెక్టర్‌గా వెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో సుబ్బారావును జేసీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వారం క్రితం జరిగిన బదిలీల్లో జిల్లాకు వెంకటమురళిని నూతన కలెక్టర్‌గా నియమించిన ప్రభుత్వం, తాజా ఉత్తర్వుల్లో జేసీగా సుబ్బా రావుకు అవకాశమిచ్చింది. అటు కలెక్టర్‌గా వెంకటమురళికి, ఇటు జేసీగా సుబ్బారావుకు తొలిపోస్టింగ్ కావడం గమనార్హం.



దర్శి ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో విత్తనం వేసిన భూమి

కాస్తంత ఊరట

- నెల తర్వాత ఒక మోస్తరు వర్షం
- 8 మొదలైన పొలం పనులు

ఒంగోలు, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దాదాపు నెలరోజుల తరువాత జల్లులు పడ్డాయి. కొన్ని మండలాల్లో ఒక మోస్తరు వర్షమే కురవడంతో జిల్లా ప్రజానీకం ప్రత్యేకించి రైతాంగానికి కాస్తంత ఊరట కలిగింది. దాదాపు నెలరోజులుగా జిల్లాలో జల్లులు లేకపోవడమే కాక ఎండ తీవ్రత కూడా పెరిగింది. గత నెలాఖరులో వేసవిని తలపిస్తూ పలు ప్రాంతాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖరీఫ్ సాగు జోరందుకోవాల్సిన సమయంలో వర్షం లేకపోవడమే కాకుండా ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో రైతులు ఆందోళన చెందారు. జిల్లాలో ఖరీఫ్‌లో సుమారు 2.02 లక్షల హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా ఈ సమయానికి 30వేల హెక్టార్లకుపైగా సాగు కావాలి. అలాగే ఖరీఫ్ పంటల సాగు జోరందుకోవాలి. అయితే కేవలం 11వేల హెక్టర్లలోపు సాగు కావడమే కాక వేసిన పైర్లు కూడా పలుచోట్ల వాడుముఖం పట్టాయి.

తొలకరి దాటుతున్న వేళ..

సజ్జ, నువ్వు, పెసర పంట తొలకరి పైర్ల సాగుకు సమయం దాటిపోగా కీలక ఖరీఫ్ పంటలైన కంది, పత్తి సాగుకు ప్రతికూల వాతావరణం నెలకొంది. ఇలాంటి పరిస్థితులలో రెండు రోజులుగా వాతావరణంలో మార్పు చోటుచేసుకొని ఉష్ణోగ్రతలు తగ్గాయి. అంతేకాక మంగళవారం తెల్లవారుజామున జల్లులు పడ్డాయి. పలుచోట్ల ఒక మోస్తరు వర్షమే కురిసింది. జిల్లాలో మంగళవారం ఉదయం 9 గంటలకు గడచిన 24 గంటల్లో సగటున 10.60 మి.మీ వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా పొన్నలూరులో 54.40 మి.మీ కురవగా మద్దిపాడులో 39.40, జరుగుమల్లిలో 37.2, ఒంగోలులో 34.20, రాచర్లలో 33.2 శింగరాయకొండలో 27.4, ఎన్‌జీపాడులో 26.2 మి.మీ కురిసింది. ఐదారు మండలాలు మినహా ఇతర ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈ వర్షం పడగా మరో రెండు, మూడు రోజులు జల్లులు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. తాజా వర్షంతో రైతులు కాస్తంత ఊరట చెందగా మరింత వర్షం పడితే ఖరీఫ్ సాగుకు ముందుకు సాగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జామాయిల్ దొంగలు..!

- అగ్రిగోల్డ్ భూముల్లో చెట్ల నరికివేత
- రాత్రికిరాత్రేకే తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- కొరవడిన పోలీస్ నిఘా
- అడ్డుకట్ట వేయాలని ప్రజల విజ్ఞప్తి



పట్టపగలే అక్రమంగా తరలివెళ్తున్న జామాయిల్ కర్ర

పామూరు, జూలై 9 ; మండలంలో పలు చోట్ల ఉన్న అగ్రిగోల్డ్ ప్రైవేటు భూముల్లో సాగు చేస్తున్న జామాయిల్ చెట్లపై అక్రమార్కుల కన్ను పడింది. గుట్టు చప్పుడు కాకుండా చెట్లను నరికి దుంగలను రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు గ్రామస్థులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పామూరు మండలం రేణిమడుగు, చిలంకూరు, దూబగుంట, పడమరకట్టకిందపల్లి, గుమ్మలంపాడు, కంభాలదిన్నె రాజుపాలెం, ప్రాంతాల్లో వందల ఎకరాల్లో జామాయిల్ తోటలను సాగు చేశారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారాలు కోర్టు కేసుల్లో ఉండడంతో వాటి గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని కొంత మంది చోటా నాయకుల కన్ను జామాయిల్ చెట్లపై పడింది. అడవి పం డింది.. కాకులు తిన్నాయి అనే సామెతగా రాత్రికి రాత్రే అడ్డంగా నరికి అక్రమంగా రవాణా చేస్తూ కొల్లగొడుతున్నారు. అర్ధరాత్రిపూట నరికి పట్టపగలే వాహనాల్లో చెక్ పోస్టులు దాటిస్తున్నా అధికారులు పట్టించుకోవడంపై ప్రజలు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. అగ్రిగోల్డ్‌లో నగదు డిపాజిట్‌లు చేసిన ప్రజల ఆస్తులను అక్రమార్కులు ఇలా దోచుకుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దూబగంట ప్రాంతంలో అక్రమం గా లారీలో జామాయిల్ దుంగలను తరలిస్తుండగా పోలీసులు వలపన్ని పట్టుకొని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాంతో కొన్ని రోజులు నిలిచిన దందా ఎన్నికల అనంతరం మళ్లీ మొదలైంది. జీపీఆర్ఎస్ సిస్టమ్ ద్వారా అక్రమాలకు అడ్డుకట్టవేయాలని, వారెంతటివారైనా కేసులు నమో దు చేయాలని ఇటీవల జరిగిన పామూరు మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశంలో జామాయిల్ అక్రమ రవాణాపై ఎమ్మెల్యే ఉగ్ర పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికైనా పోలీసు, అటవీశాఖ అధికారులు జామాయిల్ అక్రమరవాణాపై దృష్టి సారించి అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీలో మున్సిపల్ రగడ..!

- మార్కాపురంలో ఒప్పందం
- అమలుపై చైర్మన్, కౌన్సిలర్ దృష్టి
- ఇరకాటంలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు
- టీడీపీ వైపు ఆపార్టీ కౌన్సిలర్ల చూపు
- వేచిచూస్తున్న అధికార పార్టీ

మార్కాపురం వైసీసీలో అంతర్గత రగడ ఆరంభమైంది. మునిసిపల్ చైర్మన్ వ్యవహారం అందుకు కారణమైంది. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం చైర్మన్ మార్పునకు సిద్ధమైతే సఫలీకృతమవుతామా? అధికార టీడీపీ పవర్ రాజకీయాలు చేస్తే మన పరిస్థితి ఏమిటి? అన్న ఆందోళన వైసీపీ నేతల్లో కనిపిస్తోంది. మరోవైపు అసలు ఈ విషయంలో ఎవరు ప్రధాన భూమిక పోషించాలన్న అంశంపై మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, నాగార్జునరెడ్డి కొట్టుమిట్టాడుతున్నారు. అదేసమయంలో పలువురు వైసీపీ కౌన్సిలర్లు చాన్స్ దొరికితే సైకిలెక్కాలని ఉబలాటపడుతుండటంతో ఆపార్టీ నేతల్లో కలవరం మొదలైంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత మునిసిపల్ ఎన్నికల్లో మార్కాపురం మునిసిపాలిటీలో వైసీపీ ఘన విజయం సాధించింది. మొత్తం 35 డివిజన్లకు గాను 30 స్థానాలను ఆపార్టీ కైవసం చేసుకుంది. చైర్మన్ ఎంపిక విషయంలో అప్పటి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి నిర్ణయానికి వ్యతిరేకంగా జగన్ నిర్ణయం తీసుకోవడంతో సమస్య ఆరంభమైంది. పట్టణంలో ప్రముఖ వైద్యురాలైన కనకదుర్గను చైర్మన్‌ను చేయాలని ఎమ్మెల్యే భావించారు. ఆమేరకు ఆమెకు హామీ ఇచ్చి ఎన్నికల వ్యయం కోసం ఆర్థిక సహకారం పొందారు. కౌన్సిలర్ల గెలుపు అనంతరం జగన్ జోక్యం చేసుకొని డాక్టర్ కనకదుర్గ.. రెడ్డి అయినందుకు వేరే సామాజిక వర్గం వారికి చైర్మన్ పదవి ఇవ్వాలని ఆదేశించారు. తదనుగుణంగా నాగార్జునరెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన ఆర్యవైశ్య వర్గానికి చెందిన చిర్లంచెర్ల బాలమురళీకృష్ణను చైర్మన్ పదవికి ఎంపిక చేశారు. దీంతో నిరాశపడ్డ డాక్టర్ కనకదుర్గ తన నుంచి ఎన్నికల వ్యయం కోసం తీసుకున్న డబ్బులు వెనక్కు ఇవ్వాలని నాగార్జునరెడ్డిపైన, ఆయన సోదరుడిపైన ఒత్తిడి తెచ్చారు. దీంతో చైర్మన్ అయిన మురళీకృష్ణ నుంచి కొంత డబ్బు తీసుకొని చెల్లించినట్లు తెలిసింది. అయినప్పటికీ తనకు మరో రెండు కోట్లు రావాలని ఆమె పట్టుబట్టినట్లు సమాచారం. అనంతర కాలంలో ఆమెను శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా నియమించారు. అయితే ఆమె 'ఇదేం పదవి. దీంతో నేను తృప్తిపడను. నాకు చైర్మన్ పదవి ఇవ్వండి.. లేదా నా డబ్బులు వెనక్కు ఇప్పించండి' అని జగన్ నుంచి కిందిస్థాయి వరకూ నాయకులపై ఒత్తిడి పెంచారు.

అభ్యర్థుల మార్పుతో మారిన సీను

అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న నాగార్జునరెడ్డి.. కనకదుర్గను బుజ్జగిస్తూ వస్తున్న నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. నాగార్జునరెడ్డిని గిద్దలూరు పంపి గిద్దలూరు నుంచి రాంబాబును మార్కాపురం అభ్యర్థిగా బదిలీ చేశారు. వెంటనే కనకదుర్గ అప్రమత్తమయ్యారు. నా పరిస్థితి తేల్చాలని నాగార్జునరెడ్డి ఇంట్లో తిష్ట వేశారు. ఆయన మునిసిపల్ చైర్మన్ మరళీకృష్ణను పిలిపించి ఆమెకు డబ్బులు ఇవ్వండి. లేదా పదవి నుంచి తప్పుకోండని పట్టుబట్టారు. మురళీకృష్ణ ప్రస్తుతం నావద్ద అంత డబ్బులు లేవంటూ ఎర్రగొండపాలెంలో తాను కడుతున్న అపార్ట్‌మెంట్‌లో మూడు ఫ్లాట్‌లు ఆమెకు ఇస్తానని లిఖితపూర్వకంగా రాసిచ్చారు. అయితే హామీ పత్రంలో ఆయన తాను ఐదేళ్లపాటు చైర్మన్‌గా ఉంటేనే మూడు ఫ్లాట్లు ఇస్తానని మధ్యలో తనను పదవి నుంచి తొలగించినా? వేరే రూపంలో తాను పదవి వదులుకోవాల్సి వచ్చినా? వాటిని ఇవ్వనని స్పష్టంగా పేర్కొన్నారు. ఆ తర్వాత మార్కాపురం అభ్యర్థిగా వచ్చిన రాంబాబు వద్దకు కనకదుర్గ వెళ్లి తన విషయాన్ని తేల్చాలని పట్టుబట్టినట్లు తెలిసింది. మునిసిపల్ చైర్మన్ తన సామాజికవర్గమే అయినందున తాను ఎమ్మెల్యేగా గెలుపొందితే మురళీకృష్ణను మార్చి చైర్మన్‌గా కనకదుర్గకు అవకాశం కల్పించవచ్చన్న ఉద్దేశంతో ఎన్నికల అనంతరం సమస్యను సానుకూలంగా పరిష్కరించుకుందామని రాంబాబు హామీ ఇచ్చారు.

ఓటమితో సమస్య మొదటికి

ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం పొందడం తాజాగా రగడకు కారణమైంది. మార్కాపురం మునిసిపాలిటీలో ఉన్న రెండు పోలింగ్ బూత్‌లలో మినహా మిగిలిన అన్నింటిలోనూ టీడీపీ కూటమి అభ్యర్థికి ఆధిక్యం వచ్చింది. వైసీపీకి రెండు బూత్‌లలో ఒక చోట 30, మరోచోట 50 ఓట్ల మెజారిటీ మాత్రమే లభించింది. ఇక ప్రభుత్వం మారగానే ఎమ్మెల్యే నారాయణరెడ్డి వద్దకు యంత్రాంగం మొత్తం చేరింది. దీంతో పలువురు వైసీపీ కౌన్సిలర్లు కూడా టీడీపీ వైపు దృష్టిసారించారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.

ఇరకాటంలో మాజీలు

మునిసిపల్ చైర్మన్ మురళీకృష్ణ రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని కలిసి తాను ఎన్నికలకు ముందు రాసిచ్చిన హామీ పత్రానికి కట్టుబడి ఉన్నానని, తనను మార్చి కనకదుర్గకు చైర్మన్ పదవి ఇస్తే అభ్యంతరం లేదని చెప్పారు. తాను రాసిచ్చిన ప్రకారం ఏరూపంలో తాను పదవి కోల్పోయినా ఇచ్చిన హామీ నెరవేరదని తేల్చిచెప్పినట్లుగా తెలిసింది. మరోవైపు విదేశాల్లో ఉన్న డాక్టర్ కనకదుర్గ నేడో రేపో మార్కాపురం చేరనున్నారు. మద్దతుదారులు ఇప్పటికే ఆమెను చైర్మన్‌ను చేయాలని ఒత్తిడి పెంచారు. వారు ఇటు నాగార్జునరెడ్డి, అటు రాంబాబును కలిసి అసెంబ్లీ ఎన్నికలకు ముందు చైర్మన్ మురళీకృష్ణ రాసిచ్చిన హామీపత్రం మేరకు ఆయన్ను పదవి నుంచి తప్పించి కనకదుర్గను చైర్మన్‌ను చేయాలని పట్టుబట్టినట్లు తెలిసింది. దీంతో ఎవరు బాధ్యత తీసుకోవాలన్న విషయంలో ఇటు రాంబాబు, అటు నాగార్జునరెడ్డి ఇరకాటంతో పడ్డారు. ప్రస్తుతం పార్టీ ఇన్‌చార్జి రాంబాబు అయినందున హామీ పత్రాన్ని ఆయనకు పంపి విషయం చెబుతానని, అక్కడ తేల్చుకోవాలని నాగార్జునరెడ్డి చెప్పినట్లు సమాచారం. అయితే కౌన్సిలర్లు మొత్తం నాగార్జునరెడ్డి పెట్టినవారు కాబట్టి ఆయన దగ్గరే తేల్చుకోవాలని రాంబాబు అంటున్నట్లు తెలిసింది. ఇద్దరు మాజీల మాటలతో కంగుతిన్న డాక్టర్ కనకదుర్గ మద్దతుదారులు ముందు ఎలా వెళ్లాలన్న అంశంపై తర్జనభర్జన పడుతున్నారు. చైర్మన్ మరళీకృష్ణ మాత్రం 'నాయకులు చెబితే పదవి వదిలేస్తా, చెప్పినట్లు అపార్టుమెంట్‌లలో ఫ్లాట్లు ఇవ్వను. ఒకవేళ నన్ను టీడీపీ వారు తొలగించినా ఇవ్వను' అని తేల్చిచెప్పారు. దీంతో ఈ సమస్యన ఎవరు పరిష్కరించాలన్న విషయంపై రాంబాబు, నాగార్జునరెడ్డి తర్జనభర్జన పడుతున్నారు.



మార్కాపురం మున్సిపల్ కార్యాలయం

టీడీపీ వైపు వైసీపీ కౌన్సిలర్ల చూపు

తాజా పరిణామాలతో ఈ గోలంతా మనకెందుకు టీడీపీలో చేరితే బాగుంటుందన్న ఉద్దేశంతో వైసీపీ కౌన్సిలర్లు ఆవైపు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. 'ఎలాగూ అధికారులు మనమాటే వింటారు. మనం చెప్పిన పనులే జరుగుతాయి. ఇప్పుడు మన జోక్యం ఎందుకు. ఆ పార్టీలో ఏం జరుగుతుందో వేచి చూడండి' అని ఆయన టీడీపీ నాయకులకు చెప్పినట్లు తెలిసింది.

ఉపాధి పనుల్లో గోల్‌మాల్..!

- పనులకు రానివారికి మస్టర్లు
- ఫీల్డ్ అసిస్టెంట్ల అడ్డగోలు దందా
- అక్రమాలు బయటపడతాయని
- రాజీనామాలు చేస్తున్న వైనం
- చర్యలు తీసుకోవాలని పట్టు



ముండ్లమూరులో సామాజిక తనిఖీ సక్రమంగా జరపడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

దర్శి, జూలై 9 : ఉపాధి హామీ పనుల్లో అవినీతి అక్రమాలు భారీగా జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అనేక గ్రామాల్లో కొంతమంది ఫీల్డ్ అసిసెంట్లు కూలీలు పనులకు రాకుండానే మస్టర్లు వేసి చెరు సగం పంచుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ అధికారం కోల్పోవడంతో ఐదు సంవత్సరాలుగా అడ్డగోలుగా వ్యవహరించిన ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలు ఎక్కడ బయటపడతాయనే భయంతో ముందుగానే రాజీనామాలు చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని శాఖల్లో ప్రక్షాళన ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా దర్శి నియోజకవర్గంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు, జరిగిన పనుల వివరాలను ఇప్పటికే సేకరించినట్లు తెలుస్తుంది. దర్శి నియోజకవర్గంలో మొత్తం 95 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా ఇప్పటికే 50 మంది రాజీనామాలు చేశారు. దర్శి మండలంలో 25 మంది ఉండగా 17 మంది రాజీనామాలిచ్చారు. తాళ్లూరు మండలంలో 16 మంది ఉండగా 14 మంది రాజీనామాలు చేశారు. ముండ్లమూరు మండలంలో 21 మంది ఉండగా 10 మంది రాజీనామాలు సమర్పించారు. దొనకొండ మండలంలో 18 మంది ఉండగా 8 మంది రాజీనామా చేశారు. కురిచేడు మండలంలో 15 మంది ఉండగా ఒక్కరు మాత్రమే రాజీనామా చేశారు. మరో రెండు రోజుల్లో మరికొంతమంది రాజీనామాలు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామాలను ఎంపీడీవోకు సమర్పించడంతో కొత్తవారిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఉన్నతాధికారుల అండతోనే అక్రమాలు

జిల్లా ఉన్నతాధికారుల అండదండలతోనే ఉపాధి పనుల్లో అవినీతి అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏడాది నిర్వహించే సామాజిక తనిఖీలను మొక్కుబడిగా చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆ తనిఖీల్లో గుర్తించిన కొద్దిపాటి అక్రమాలపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దర్శి మండలంలో మొక్కలు నాటి పెంచినట్లు లక్షలాది రూపాయలు డ్రా చేసుకున్నా అక్కడ మొక్కలు లేవు. సామాజిక తనిఖీలో ఆ విషయం బయటపడినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సామాజిక తనిఖీల సందర్భంగా ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ రూ.లక్ష చొప్పున ముడుపులు చెల్లించినట్లు విమర్శలున్నాయి. జిల్లా అధికారులు ముడుపులు తీసుకొని అక్రమాలకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అలాగే ఐదేళ్లు కొనసాగించారు. కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడడమే కాక వైసీపీ కార్యకర్తల్లా కూడా వ్యవహరించారు. కొంతమంది వైసీపీ కండువాలు వేసుకొని ప్రచారాలు చేశారు. గత ఎన్నికల్లో వైసీపీని అంటకాగిన ఫీల్డ్ అసిస్టెంట్ల వివరాలను సేకరిస్తున్నారు. ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి, అక్రమార్కులపై చర్యలు తీసుకునేలా దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకులు ఉన్నతాధికారులకు అన్ని వివరాలను ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేశారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



దర్శి, జూలై 9 : చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు నీరు వెల్లబెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఈఈటీ నాగమురళీమోహన్ స్పష్టం చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో చేపలకోసం నీళ్లు వదిలేశారు అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. చేపల కోసం ఏఏ గ్రామాల్లోని చెరువుల్లో నీరు విడిచిపెట్టారో వివరాలు తీసుకొని అందుకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా మత్స్య శాఖ అధికారులకు కూడా సూచనలు చేస్తామని ఆయన తెలిపారు.

21న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

ఎమ్మెల్యే ఉగ్ర ఆధ్వర్యంలో నిర్వహణ

కనిగిరి, జూలై 9 : మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఈనెల 21 నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వ ర్గాలు మంగళవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాన్ని పరిసరప్రాంత ప్రజలు విని యోగించుకోవాలని కోరారు. ఈ కంటి చికిత్స కేవలం పేదవారికి మాత్రమేనని, శిబిరానికి వచ్చే కంటి సంబంధ బాధితులు గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలని వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

రియల్‌గా రెచ్చిపోయారు..!

- అక్రమ వెంచర్లలో ఏర్పాటులో ఆరితేరిన నేతలు
- అసైన్డ్ భూములే ఆదాయ వనరుగా
- మార్చుకున్న వైసీపీ నేతలు

కనిగిరి, జూలై 9: కనిగిరి నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో సాగిన అసైన్డ్ అక్రమాల పరంపర ఒక్కొక్కటిగా బయటపడుతోంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పేదలకు చెందిన అసైన్డ్ భూములను బెదిరించి కొనుగోలు చేసి వాటిల్లో వెంచర్లు వేసి వైసీపీ నేతలు కోట్లకు పడగలెత్తారు. ఏకంగా నియోజకవర్గ, మండల స్థాయి ప్రజాప్రతినిధి పదవులకే పోటీచేసేలా పేదల సొమ్ము బొక్కి రాజకీయ బాటలు వేసుకున్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే అండతో కొందరు నేతలు పేట్రేగిపోయారు. అమాయక ప్రజల్ని నమ్మించి వారి అక్రమ భూముల్లో వేసిన వెంచర్లలోని ప్లాట్లను కట్టబెట్టారు. దళారీ గ్రూపును తయారుచేసి వెంచర్లపై పెద్దఎత్తున ప్రచారాలు చేశారు. వారు వేసే వెంచర్ల వద్ద పెద్దఎత్తున అభివృద్ధి జరుగబోతుంది అంటూ అరచేతిలో వైకుంఠం చూపించారు. కనిగిరి నియోజకవర్గంలో వెలసిన ఏ వెంచరుకు ప్రభుత్వ అనుమతి లేకపోయినా అన్ని ఉన్నట్లు ప్రజల్ని తప్పుదోవ పట్టించారు. దీంతో అమాయకపు జనం నమ్మి మోసపోయారు. ప్రస్తుతం ఆయా అనధికార, అక్రమ భూములపై అధికారులు ఉదాసీనతగా ఎందుకు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.



అనధికార వెంచర్‌లో కొన్న వ్యక్తి తన ప్లాటుకు వేసిన ఫెన్సింగ్



కనిగిరి - ఒంగోలు రోడ్డులో అసైన్డ్ భూమిలో వెలసిన వైసీపీ అభ్యర్థి దద్దాల వెంచర్

250 ఎకరాల్లో అక్రమ వెంచర్లు

కనిగిరి నియోజకవర్గంలో దాదాపు 250 ఎకరాల్లో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. వైసీపీ ప్రభుత్వంలో దాదాపు 50 నుంచి 70 ఎకరాల్లోని అసైన్డ్, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో వెంచర్లు వేసి కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును దిగమింగిన నేత చివరకు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీలోకి దిగారంటే అక్రమార్జన ఏస్థాయికి చేరిందో అని ప్రజలు విస్తుపోయారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీలో నిలబడి ఓటమి పాలైన దద్దాల నారాయణయాదవ్ కనిగిరి మండలంలో దాదాపు 20 ఎకరాల్లో అసైన్డ్ భూముల్లో అనధికార వెంచర్లు వేసి అమాయకుల్ని మోసం చేసి కోట్లు సంపాదించినట్టు ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలం లేదు..

అక్రమార్కుల ఆగడాలు, ఆక్రమణలతో ప్రభుత్వ భూములలో వెంచర్లు వెలిశాయి. ఆ కారణంగా కనిగిరి డివిజన్‌స్థాయి కార్యాలయాల ఏర్పాటుకు ఇప్పుడు సెంటు భూమి కూడా లేని పరిస్థితి ఏర్పడింది. అభివృద్ధిని ఆశిస్తున్న ప్రజలకు కార్యాలయాల ఏర్పాటు కాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీఓ, డీఎస్‌పీ, ఎలక్ట్రికల్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్డీఓ కార్యాలయాల ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది.

వెలిసిన వెంచర్లు

కనిగిరి - కంభం రోడ్డులోని 203/సీలోని డాటెడ్ భూమిని రెవెన్యూ రికార్డులు మార్చి ప్రజల్ని ఏమార్చి 5 ఎకరాల్లో వెంచర్లు వేశారు.

కనిగిరి - ఒంగోలు రోడ్డులోని వేశపోగు సుబ్బారాయుడుకు చెందిన 900/ఏలోని 2.5ఎకరాల అసైన్డ్‌భూమిని ఆయా భూమికి చెందిన దళితుడిని బెదిరించి తక్కువకు కొని ప్లాట్లు వేసి అమ్ముకున్నారు.

కనిగిరి - కంభం రోడ్డులో తుమ్మకుంటపరిధిలోని వీరమ్మకు చెందిన 300/5 సర్వే నెంబరులోని 5 ఎకరాల అసైన్డ్ భూమిలో వెం చరు వేసి అమ్ముకున్నారు.

కనిగిరి - కంభం రోడ్డులో తుమ్మకుంట గ్రామపరిధిలోని ఊటుకూరి వెంకటసత్యనారాయణకు చెందిన సర్వే నెంబరు 302/2లోని 5.44 ఎకరాల అసైన్డ్ భూమిలో వెంచర్లు వేసి సొమ్ము చేసుకున్నారు. అధికారులు తేల్చినవి 20 ఎకరాల వరకు ఉంటే బినామీల ద్వారా ఇంకా 50 ఎకరాలకు పైగా సదరు నేత అక్రమంగా వెంచర్లు వేసినట్లు తెలుస్తోంది.

-పై భూముల్లో వెంచర్లు వేసే క్రమంలో పక్కనే వాగు, కొండ, పశువుల పోరంబోకు భూములను కూడా ఆక్రమించి కలిపేసుకున్నా అప్పట్లో ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా కొందరు రెవెన్యూ అధికారులు అక్రమార్కులు ఇచ్చే మామూళ్ల కోసం కక్కుర్తిపడి పేద, దళిత, బడుగు వర్గాలకు చెందిన భూములను వారికి తగ్గట్టుగా రికార్డులను తారుమారు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆయా భూములను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములను పరాధీనం కానివ్వం

వేటపాలెం(చీరాల), జూలై 9 : ప్రభుత్వానికి సబంధించి సెంటు భూమి కూడా పరాధీనం కానివ్వమని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేటపాలెం మండలం నాయినిపల్లి దత్తక్షేత్రంలో నిబంధనలకు విరుద్ధంగా నివేశన స్థలాలు కేటాయించాలని కలెక్టర్‌కు ప్రజా పరిష్కారాల వేదికలో సోమవారం కొందరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ కృష్ణకాంత్, ల్యాండ్స్ అండ్ షైన్స్ సర్వే బాధ్యుడు ముసలయ్య తదితరులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తమ నివేదికను పారదర్శకంగా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి, నీటి పన్నులను త్వరితగతిన వసూళ్లు చేయాలి

చీరాలటౌన్, జూలై 9 : పురపాలక సంఘ పరిధిలోని ఆస్తి, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల బకాయిలను త్వరితగతిన పూర్తి చే యాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. మంగళవారం మునిసిపల్ పరిధిలోని రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లకు సంబంధించిన లీజులు, షాపుల అద్దెలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.



రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న యూనియన్ సభ్యులు

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

అద్దంకిటౌన్, జూలై 9: ప్రావిడెండ్ ఫండ్‌కు సంబంధించి హయ్యర్ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంఘ రాష్ట్ర నాయకుడు వి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక చిన్ని శాంతయ్య సేవా సదన్‌లో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, అద్దంకి డిపో ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన డ్రైవర్ టి.శ్రీనివాసరావు అభినందన సభ పీసీహెచ్ కోటయ్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర, రీజనల్ నాయకులు వి. వెంకటేశ్వర్లు, సీహెచ్ చంద్రశేఖర్, ఎంకే రెడ్డి, సంఘ సభ్యులు పాల్గొని శ్రీనివాసరావును ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చర్చించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎం.హనుమంతరావు (చిన్న), రీజియన్ నాయకులు వీవీ బ్రహ్మం, వై.వెంకటేశ్వర్లు, ఎస్‌కే కాలే మస్తాన్, పల్లెపోగు స్టిఫెన్, కె.నరసింహరావు, జె.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకతో ఊపందుకుంటున్న నిర్మాణరంగం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 9: సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన ప్రకారం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో ఉచిత ఇసుక విధానాన్ని అమలుపరిచారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. దీంతో నిర్మాణరంగం ఊపందుకుని అందరికి ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు. సోమవారం రాత్రి నిర్మాణరంగ ప్రతినిధులు, కార్మిక ప్రతినిధులు, తదితరులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుకపైన విధించిన ఆంక్షలతో నిర్మాణ రంగంతో పాటు, ఆ రంగానికి అనుబంధంగా ఉంటే ఉపవృత్తులవారు తీవ్ర సంక్షోభానికి గురయ్యారన్నారు. ఇసుకను సంబంధించి సీనరేజి, బాడుగ మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. దీంతో అన్ని వర్గాలకు పార్టీలకు అతీతంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు, అనుబంధ విభాగాల వృత్తి పనివారు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగవు!

చీరాల, జూలై 9: ఎప్పుడు కూడా ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉండాల్సిన వ్యక్తులు, వ్యవస్థలు పారదర్శకంగా ఉండాలని బీజేపీ, జనసేన నాయకులు పేర్కొన్నారు. అబద్ధాలను వండి వారిస్తే నిజాలు కావన్నారు. అబద్ధాలను ప్రచారం చేసే ప్రయత్నాన్ని ప్రజలు స్వాగతించరని చెప్పారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కొండయ్య పై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి పదిహేను రోజులుగా కూడా పూర్తికాకుండానే ఆరోపణలకు దిగేవారి చిత్తశుద్ధి, విచక్షణకు వదిలేస్తూ, వారు పునరాలోచించుకోవాలని హితవు పలికారు. సమావేశంలో బీజేపీ నాయకులు మువ్వల వెంకటరమణారావు, అర్వపల్లి కుమార్, నాగేశ్వరరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, మణి, జనసేన నాయకులు గూడూరి శివరామప్రసాద్, మామిడాల శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అద్దంకి, జూలై 9: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో సమస్యల తక్షణ పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు కమిషనర్ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 12వ వార్డు పరిధిలో పెదగానుగపాలెంలో మంగళవారం పారిశుధ్య పనులు, సైడ్ డ్రైన్‌లు, నిలిచిన వర్షపు నీటిని కౌన్సిలర్ అత్తులూరి రమేష్‌బాబుతో కలిసి పరిశీలించారు. వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి



మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్‌లు

అద్దంకి, జూలై 9: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో గత మూడు సంవత్సరాలు గా అభివృద్ధి పనులకు నోచుకోని టీడీపీ కౌన్సిలర్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టాలని టీడీపీ కౌన్సిలర్‌లు మంగళవారం కమిషనర్ సత్యనారాయణ ను కలిసి వినతిప త్రం అందజేశారు. ఆయా వార్డులలో చేయాల్సిన పనులు గురించి వివరించారు. కమిషనర్ ను కలిసిన వారిలో కౌన్సిలర్‌లు కంపా రజనీ, రంగిశెట్టి సుభాషిణి, అత్తులూరి రమేష్, మాగులూరి తిరుపతమ్మ, విజయలక్ష్మి, సీతమ్మ, జహీరా తదితరులు ఉన్నారు.

కొరిశపాడులో చోరీ

మేదరమెట్ల, జూలై 9: మండలకేంద్రమైన కొరిశపాడులో సోమవారం దొంగతనం జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన షేక్ నూర్జహాన్ పనికి వెళ్లి వచ్చేసరికి ఇంటిలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే లోపలికి వెళ్లిచూడగా బీరువా పగులగొట్టి ఉంది. అందులోని రూ.20వేలు నగదు, రూ.30వేలు విలువైన బంగారం కనిపించలేదు. మంగళవారం ఉదయం నూర్జహాన్ ఘటనపై కొరిశపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఎం.శివయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

విద్యుత్ సబ్‌స్టేషనా.. మద్యం దుకాణమా!

- కొప్పెరపాడులో అర్ధరాత్రి మందు పార్టీలో సిబ్బంది
- సరఫరా ఎందుకు లేదని ప్రశ్నించిన ప్రజలపై దౌర్జన్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

బల్లికురవ, జూలై 9: గ్రామాలలో మెరుగైన విద్యుత్ అందించేందుకు ఏర్పాటుచేసిన విద్యుత్ సబ్‌స్టేషన్లు మద్యం దుకాణాలను తలపిస్తున్నాయి. అక్కడ పనిచేసే సిబ్బంది రాత్రి పూట కొందరిని పిలిపించుకొని మద్యం పార్టీలతో మునిగి తేలుతున్నారు. విద్యుత్ సరఫరా లేదని ఫోన్ చేసిన వినియోగదారులపై తీవ్రస్థాయిలో దుర్భాషలాడుతున్నారు. అదేమంటే దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ దబాయిస్తున్నారు. విద్యుత్ సిబ్బంది మందు పార్టీని చూసిన ప్రజలు అవాక్కు అవుతున్నారు.

బల్లికురవ మండలం కొప్పెరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి మందు పార్టీని ఏర్పాటుచేసుకొని చిందులు వేయటం విమర్శలకు తావిస్తుంది. రాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో వైదన గ్రామానికి చెందిన కొందరు యువకులు కొప్పెరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లారు. సుమారు గంటన్నర అయినా విద్యుత్ రాలేదని వారు అక్కడికి వెళ్లగా.. విధులలో ఉన్న సిబ్బంది మందు పార్టీలో మునిగి ఉన్నారు. సబ్‌స్టేషన్‌లో మద్యం తాగటం ఏమిటి, ఫోన్ చేసిన ఎందుకు సమాధానం చెప్పటం లేదని ప్రశ్నించారు. దీంతో అక్కడ ఉన్న సిబ్బంది వచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఒక పూట విద్యుత్ లేకపోతే ఎవరు చచ్చిపోరులే అంటూ దుర్భాషలకు దిగారు. విధులలో ఎంతో జాగ్రత్తగా



సబ్‌స్టేషన్‌లో మందు పార్టీ చేసుకొంటున్న సిబ్బంది

ఉండాల్సిన సిబ్బంది మద్యం తాగటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సబ్‌స్టేషన్లపై అధికారులు పర్యవేక్షణ సరిగా చేయటం లేదని, కొప్పెరపాడు సబ్‌స్టేషన్‌లో కొంతకాలం నుంచి పేకాట కూడా ఆడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. సబ్‌స్టేషన్‌లో ఉన్న సిబ్బంది రైతుల నుంచి కూడా పెద్ద ఎత్తున వ్యవసాయ సీజన్‌లో డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. విద్యుత్ సిబ్బంది మద్యం తాగి పార్టీ చేసుకొన్న విషయమై వైదన గ్రామానికి చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావుకు వాట్సప్ ద్వారా ఫొటోలను పెట్టి ఫిర్యాదు కూడా చేశారు. సబ్‌స్టేషన్‌ను మద్యం దుకాణంలా మార్చిన సిబ్బందిపై వెంటనే విచారణ చేపట్టి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కొప్పెరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ (ఫైల్)

ఈవిషయమై ఏఈ శ్రీనివాసరావును ఫోన్‌లో వివరణ కోరగా, సబ్‌స్టేషన్‌లో సిబ్బంది మద్యం తాగుతున్న సంఘటనను వైదన గ్రామస్థులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

నామినేటెడ్ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు

- పోటీపడుతున్న పలువురు నేతలు

అద్దంకి, జూలై 9: నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు తమ ప్రయత్నాలను ప్రారంభించారు. అద్దంకి నియోజకవర్గంలో అద్దంకి, సంతమాగులూరు మార్కెట్ కమిటీల పాలకవర్గాలతో పాటు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్, డైరెక్టర్‌ల పోస్టులకు ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. అద్దంకి మార్కెట్ కమిటీ పరిధిలో అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాలు, సంతమాగులూరు మార్కెట్ క మిటీ పరిధిలో సంతమాగులూరు, బల్లికురవ మండలాలు ఉన్నాయి. దీంతో ఆయా పరిధిలోని నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని అద్దంకి, మేదరమెట్లలో కూరగాయల సంతలు నిర్వహిస్తున్నారు. దీంతో పాలకమండలి కనుసన్నలలో సంత నిర్వహణ జరిగే అవకాశం ఉండటంతో కనీసం డజను మందికి పని కల్పించే అవకాశం ఉంది. అదే సమయంలో రైతులకు మేలు చేకూర్చే కార్యక్రమాలు నిర్వహణకు కూడా అవకాశం ఉంది.



అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలికి కూడా మంచి గుర్తింపు ఉంటుంది. అదే సమయంలో ప్రస్తుతం సుమారు రూ.7 కోట్లతో దేవాలయం అభివృద్ధి పనులు కూడా జరుగుతుండటంతో పాలకమండలికి మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇక అవుట్ సోర్సింగ్ ద్వారా సుమారు 15 నుంచి 20 మంది సిబ్బందికి అవకాశం కల్పించే అవకాశం కూడా ఉంది. అదే సమయంలో సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఇతర పలు దేవాలయాలకు కూడా కమిటీలు వేయనున్నారు.

శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం పాలకమండలి చైర్మన్‌గా గత కొన్ని దశాబ్దాలు గా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు ఆనవాయితీగా కేటాయిస్తున్నారు. ఈనేపథ్యంలో అద్దంకి పట్టణంలోని పలువురు ఆర్యవైశ్యులు ఇప్పటికే తమ ప్రయత్నాలు ప్రారంభించారు. డైరెక్టర్‌లుగా మిగిలిన సామాజిక వర్గాలకు కేటాయించే అవకాశం ఉండటంతో ఎవరికి వారే ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే, నామినేటెడ్ పదవుల ఆశించే నేతలు ఎక్కువగా ఉండటం తో ఎంపిక మంత్రి రవికుమార్ కు ఒకింత కసరత్తు చేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు తెలుస్తుంది. అదే సమయంలో మంత్రి బాధ్యతలతో రవికుమార్ బిజీగా ఉండటంతో పదవుల పంపకం ఒకింత ఆలస్యం అయ్యే కానున్నట్లు తెలుస్తుంది.

వైభవంగా ముగిసిన గంగమ్మ కొలుపులు

చినగంజాం, జూలై 9: మండలంలోని కడవకుదురులో గంగమ్మ అమ్మవారి కొలుపులు మంగళవారం వైభవంగా ముగిశాయి. గ్రామంలో ఆదివారం నుంచి అమ్మవారికి పలు రకాల పూజలు నిర్వహిస్తూ, మంగళవారం పొంగళ్ళ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. గంగమ్మ అమ్మవారి ప్రభ ముందు, అమ్మవారి ఉత్సవ విగ్రహంతో, మహిళలు నెత్తి మీద పొంగళ్ళు పెట్టుకొని, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మంగళవారం సాయంత్రం అమ్మవారి ఆలయానికి వెళ్లారు. ఈసందర్భంగా ఆలయ పూజారి హైమారావు గంగమ్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు జరిపారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు.



పొంగళ్లతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో అమ్మవార్ల కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నక్కల పెదముత్తయ్య, యంపరాల రోశయ్య, యాదవ పెద్దలు, శ్రీకృష్ణా యాదవ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతోపాటు వసతులు కల్పించాలి

పర్చూరు, జూలై 9: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, మౌలికవతులు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని నాగులపాలెం బధిరుల పాఠశాలను ఆకస్మిక తనిఖీచేశారు. వంటశాల, భోజన గదులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల నిర్వహణ, వసతుల పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పి.వెంకట్రామయ్య, సీడీపీవో సుభద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



బధిరుల పాఠశాల విద్యార్థులతో కమిషన్ సభ్యులు, సిబ్బంది

గురుకుల బాలికల పాఠశాల తనిఖీ

యద్దనపూడి(మార్టూరు), జూలై 9: యద్దనపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను మంగళవారం రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులకు సరైన మౌలికవసతులు లేవని ఆమె గుర్తించారు. విద్యార్థినులకు భోజనం తయారుచేస్తున్న వంట గదిని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు స్కూల్ ఆవరణలో విషసర్పాలు వస్తున్నాయని పలువురు విద్యార్థినులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను నెలలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివసుబ్రమణ్యం, ఎంఈవో గోపి, సీడీపీవో సుభద్ర, సూపర్‌వైజర్ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి ఆర్టీసీలో ఇష్టారాజ్యం

- గ్రామీణ సర్వీసులతో పాటు పలు నగరాలకు బస్సులు రద్దు
- ఆదివారం వస్తే అత్యధిక వాహనాలకు విశ్రాంతే



ఆర్టీసీ బస్టాండ్

అద్దంకి, జూలై 9: అద్దంకి ఆర్టీసీ అంతా అధికారుల ఇష్టారాజ్యంగా మారింది. దీంతో రోజురోజుకు అద్దంకి ఆర్టీసీ డిపోలో బస్సుల సంఖ్య తగ్గిపోతుంది. ఈక్రమంలో అద్దంకి డిపోలో నా లుగు దశాబ్దాలుగా నడుస్తున్న పలు గ్రామీణ సర్వీసులు పూర్తిగా తొలగించారు. అదే సమయంలో ప్రధాన నగరాలకు అద్దంకి డిపో నుంచి బస్ సర్వీసులు లేవంటే ఆశ్చర్యం కలుగక మానదు. ప్రధాన రూట్లు అయిన నర్సరావుపేట, వినుకొండ, పొదిలి, ఒంగోలు రూట్లలో మాత్రమే పల్లెవెలుగు బస్సులు అత్యధిక శాతం నడుస్తున్నాయి. ఇక విజయవాడ, శ్రీశైలంకు మాత్రమే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పరిమితం అయ్యాయి.

దశాబ్దాల కాలం నుంచి నడిచిన అద్దంకి - మార్టెళ్ల, కొండమంజులూరు, బొద్దికూరపాడు, కుందుర్తి, చిలకలూరిపేట, బల్లికురవ - చిలకలూరిపేట, పమిడిపాడు, బి.నిడమానూరు, కనిగిరి - కందుకూరు, ఇసుక పాలెం, మైలవరం, మణికేశ్వరం, ఉప్పుగుండూరు, ఈదర, ఇంకొల్లు - గుంటూరు - విజయవాడ తదితర రూట్లలో నిత్యం తిరిగే బస్ సర్వీసులు రద్దు అయ్యాయి. కొన్ని రూట్లలో మాత్రం మొక్కుబడిగా ఉదయం, సాయంత్రం సమయాలలో నడుపుతున్నారు. ఇక ప్రధాన నగరాలు అయిన చెన్నై, బెంగళూరుకు, ఆధ్యాత్మిక నగరం అయిన తిరుపతికి అద్దంకి డిపో నుంచి కనీసం ఒక్క బస్ సర్వీసు కూడా లేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. దశాబ్దాలుగా నడుస్తున్న పమిడిపాడు-హైదరాబాద్ బస్‌ను రద్దు చేసి మొక్కుబడిగా మేదరమెట్ల, పమిడిపాడు, చందలూరు, పంగులూరు మీదుగా ఒక సర్వీసును నడపడం ద్వారా ప్రయోజనం ఏమిటని పలు గ్రామాల ప్రయాణికులు అంటున్నారు. అద్దంకి నుంచి శ్రీశైలంకు ఏడు సర్వీసులు నడుస్తున్నా అద్దంకి నుంచి వెళ్లే భక్తులకు ఏ మాత్రం ఉపయోగపడే అవకాశం లేదు. ఒంగోలు మీదుగా నడుపుతుండడంతో ఎక్కువ దూరం, ఎక్కువ చార్జి భరించాల్సి రావడంతో అద్దంకి ప్రాంత ప్రయాణికులు పొదిలి లేదా వినుకొండ వెళ్లి వేరే బస్సులలో వెళ్తున్నారు. కనీసం కొన్ని సర్వీసులు అయినా వయా దర్శి పొదిలి లేదా వినుకొండ మీదుగా నడిపితే అద్దంకి ప్రాంత ప్రయాణికులు ప్రయోజనం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కోవిడ్ తరువాత బస్ సర్వీసులను పునరుద్దరించడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి.

వారంలో మూడు రోజులు సర్వీసులు రద్దు

అద్దంకి డిపో నుంచి పలు రూట్లలో నడిచే సర్వీసులలో ఏ రోజు ఏ సర్వీసు నడుస్తుందో ప్రజలకు అర్థంకాని పరిస్థితి. ప్రీ ప్లాన్ కాన్సిలేషన్ (పీపీసీ) పేరుతో పలు సర్వీసులను రద్దు చేస్తున్నారు. వారంలో మూడు రోజులు (ఆది, మంగళ, శుక్రవారం) పీపీసీ పేరుతో అర్థాంతరంగా రద్దు చేస్తున్నారు. బస్సులు రద్దు చేసిన విషయాన్ని కనీసం బస్టాండ్ ఆవరణలో సమాచార బోర్డును కూడా ఏర్పాటు చేయకపోవడం ప్రయాణికులను తీవ్ర ఇబ్బందికి గురిచేస్తోంది. ఆదివారం వచ్చిందంటే కనీసం పది బస్సులు పీపీసీలో ఉంటాయి. ప్రధానంగా గ్రామీణ రూట్లలో తిరిగే సింగిల్ రూట్ సర్వీసులు కూడా రావు. తాళ్లూరు, బొద్దికూరపాడు, మైలవరం, కొమ్మినేనివారిపాలెం - చిలకలూరిపేట, బాపట్ల తదితర రూట్లలో ఆదివారం బస్ సర్వీసులు రద్దు చేస్తున్నారు. గతంలో అద్దంకి డిపో నుంచి పలు గ్రామాలకు నైట్ హాల్ట్ సర్వీసులు కనీసం డజను పైనే ఉండేవి. ప్రస్తుతం రెండు మా త్రమే నడుపుతున్నారు. బల్లికురవ మీదుగా చిలకలూరిపేట నైట్‌హాల్ట్ బస్ సుమారు నాలుగు దశాబ్దాలుగా ఉండగా ఇటీవల రద్దు చేశారు. అలాగే, వైదన మీదుగా చిలకలూరిపేట సర్వీసు ఉదయం మా త్రమే నడుపుతుండటంతో అద్దంకి వచ్చిన ప్రయాణికులు సాయంత్రం ఇళ్లకు చేరేది ఎలా అని అధికారులకే తెలియాలి. ఇదే పరిస్థితి కొంతకాలం గడిస్తే అద్దంకి డిపోను సైతం రద్దు చేసే అవకాశం ఉందన్న అభిప్రాయం అటు ప్రజలు, ఇటు ఆర్టీసీ ఉద్యోగులలో నెలకొంది. అధికారుల అనాలోచిత నిర్ణయాల వలనే ఈ పరిస్థితి ఏర్పడింది.ఇప్పటికే బల్లికురవ, పంగులూరు మండలాల ప్రజలు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి ఆర్టీసీ బస్సులు రద్దు చేసిన విషయాన్ని తీసుకెళ్లారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

బల్లికురవ, జూలై 9: మండలంలోని అంబడిపూడి బీసీ కాలనీ వద్ద సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో గృహాలకు వెళ్లే విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. హుటాహుటీన విద్యుత్ సిబ్బంది మంగళవారం విద్యుత్ సరఫరాను తిరిగి పునరుద్ధరించారు. బల్లికురవ - అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్డులో అంబడిపూడి గ్రామం వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఒక స్తంభం పడిపోయి పక్కనే ఉన్న మరో రెండు స్తంభాలపై పడిపోవటంతో విరిగి పడిపోయాయి. రాత్రి సమయంలో ఈ ఘటన జరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేకుంటే ప్రజలపై పడిపోయేవని పలువురు పేర్కొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

అద్దంకిటౌన్, జూలై 9: గ్రామంలో 6 నుండి 14 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలు పాఠశాలలోనే ఉండాలని సీఆర్పీ ఎం.రమేష్ అన్నారు. అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. మంగళవారం మండలంలోని కొటికలపూడి ప్రాథమిక పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమం హెచ్‌ఎం సీహెచ్ వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఆర్పీ రమేష్ గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి 5 సంవత్సరాలు పూర్తయిన 8 మంది పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించారు.. అలాగే, డయేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ అందించే స్టూడెంట్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిందుద్రులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులపై అవగాహన కల్పించాలి

అద్దంకిటౌన్, జూలై 9: సేంద్రియ పద్ధతుల్లో తయారుచేసే వస్తువులపై అవగాహన కలిగి ఉండి ఇతరులకు తెలియజేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. మంగళవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం, రసాయనశాస్త్రం, వాణిజ్య శాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో ఆయా విభాగాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకురాలు పీవీ హేమలత, రామకృష్ణ, డాక్టర్ మస్తాన్‌వలి, కామర్స్ విభాగాధిపతి ఏ.శిఖామణి, వృక్షశాస్త్రం అధ్యాపకులు డి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేవీని పరామర్శించిన డాక్టర్ దగ్గుబాటి



కేవీ సుబ్బారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు

పంగులూరు, జూలై 9: మాజీ జడ్పీటీసీ కేవీ సుబ్బారావును మంగళవారం డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొంది చందలూరులో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న కేవీని డాక్టర్ దగ్గుబాటి కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేవీ కుటుంబ సభ్యందరినీ పేరుపేరున పలకరించారు. ఆహార నియమాలు పాటించి ఆరోగ్యం కుదుటపడే వరకు విశ్రాంతి తీసుకోవాలలని కేవీ సూచించారు. ఈసందర్భంగా గత సార్వత్రిక ఎన్నికలలో ఓటింగ్ సరళిని, రాజకీయ పరిస్థితులను స్థానిక నేతలతో ముచ్చటించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కందిమళ్ళ రామాంజనేయులు, పెంట్యాల రామాంజనేయులు, అడ్డగడ సతీష్ పాల్గొన్నారు.

పెదగంజాంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

చినగంజాం, జూలై 9: మండలంలోని పెదగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 5.0ఎంవీఏ విద్యుత్ టాన్స్‌ఫార్మర్‌ను చీరాల విద్యుత్ శాఖ ఈఈ కె.జాన్‌థామస్ మంగళవారం టెక్నికల్‌గా చార్జ్ చేసినట్లు చినగంజాం ఏఈఈ పడవల గణనారాయణ తెలిపారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో 5.0 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫారాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా ఇచ్చినట్లు తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు లోవోల్టేజీ సమస్య తీరుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు జె.శ్రీనివాసులు, గురునాథం, ఎ.శ్రీనివాసరావు, టి.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

చీరాలటౌన్, జూలై 9: నూతనంగా అమలుచేస్తున్న చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని వన్‌టౌన్ ఎస్‌ఐ హరిబాబు అన్నారు. మంగళవారం పట్టణంలో ప్రయాణికులకు డ్రైవింగ్ చేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఎస్‌డీ మదీన్, స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పక పాటించాలి

చీరాలటౌన్, జూలై 9: రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి పాటించాలని జిల్లా వనరుల కేంద్రం(డీడీఏ) అధికారి ఎం.విజయనిర్మల అన్నారు. మంగళవారం చీరాల మండల వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం, మట్టి నమూనా పరీక్షలపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం, సమతుల్య ఎరువులు, యాజమాన్యం పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. పంటలను సాగుచేసే క్రమంలో ఖర్చు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందాలన్నారు. ఏరువాక శాస్త్రవేత్తలు ఉషారాణి, రాధాకృష్ణ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న వేరుశనగ పంటలలో వచ్చే వివిధ చీడపీడల నివారణ, తెగుళ్ల గురించి వివరించారు. కార్యక్రమంలో అధికారులు మురళీధర్ నాయక్, రత్నకుమారి, భారతి, భాస్కరరావు, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

దేవాంగపురి పంచాయతీ కార్యదర్శిపై విచారణ

చీరాల టౌన్, జూలై 9 : చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ కార్యదర్శి మురళీ బాపూజీపై డీఎల్‌పీవో దారా హనుమంతరావు మంగళవారం విచారణ జరిపారు. ఆయనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేశారు. వివిధ అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేశారు.

11న దేవదాయ భూముల కౌలు వేలం

పర్చూరు, జూలై 9: పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం, అన్నంబొట్లవారిపాలెం, గర్నెపూడి గ్రామాల్లో గల దేవదాయ భూములకు సంబంధించి ఈనెల 11న బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ అధికారి టి.శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మరాజుపాలెం గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానంకు చెందిన భూముల కౌలు వేలం నిర్వహిస్తామన్నారు. అలాగే, అన్నంబొట్లవారిపాలెం, గర్నెపూడి గ్రామాల్లోని భూములకు కూడా ఆయా గ్రామాల్లో వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు రూ.5వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చునని ఆమె తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పంగులూరు, జూలై 9: మండలంలోని ముప్పవరం గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాలు తనిఖీచేయగా రేషన్ బియ్యం పట్టుబడినట్లు పర్చూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతారాణి తెలిపారు. మంగళవారం తన సిబ్బందితో ముప్పవరం వద్ద ఆమె వాహన తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పర్చూరు వైపు నుండి జాతీయ రహదారివైపు బియ్యం లోడుతో వస్తున్న వాహనంలో 55 బస్తాల రేషన్ బియ్యం గుర్తించినట్లు తెలిపారు.

బియ్యం లోడుతో ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని మేదరమిట్లలోని రైస్ మిల్లుకు తరలించారు. అందులో ఉన్న 55 బస్తాల బియ్యాన్ని మేదరమిట్లలో డీలర్‌కు అప్పగించినట్టు చెప్పారు. లారీని రైస్ మిల్లులో ఉంచి డ్రైవర్‌ను రేణంగివరం పోలీసు లకు అప్పగించినట్లు డీటీ గీతారాణి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతిరావు తెలిపారు.. .

నేడు ఆలయ భూములకు కౌలు వేలం

పంగులూరు, జూలై 9: మండలంలోని మూడు గ్రామాలలో బుధవారం ఆలయభూముల కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ ఈవో ఉప్పలమర్తి శ్రీనివాసరావు తెలిపారు. చినమల్లవరం శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూములు, బూదవాడ గ్రామంలో ఆలయంకు చెందిన భూములు, జాగర్లమూడివారిపాలెంలో ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు రూ.మూడు వేలు దరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని ఈవో శ్రీనివాసరావు కోరారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆత్మకూరులో కొత్తగా నిర్మించిన ఆర్‌అండ్‌బీ అతిథి గృహం. ఇందులో మూడు సూట్ రూమ్‌లు, ఒక గెస్ట్‌రూమ్‌తో పాటు కాన్ఫరెన్స్ హాలు ఉన్నాయి. పాత అతిథిగృహం పాడైపోయిందని, పుష్కరకాలం క్రితం అధికారులు నిర్ణయించడంతో కొత్త భవనం నిర్మాణానికి పునాదులు పడ్డాయి. 2012లో మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి రూ.50 లక్షలతో కొత్తదాని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత దాని విలువ రూ.కోటికి పెరిగింది. 2017 నాటికి భవనం పూర్తయింది. చిన్నచిన్న పనులు పూర్తి చేసి ఫర్నీచర్ సమకూరిస్తే అతిథిగృహం అందుబాటులోకి వచ్చేది. కానీ ఎవరూ పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఈ భవనం పూర్తి చేయడానికి మరో రూ.25 లక్షలు అవసరమవుతాయని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా అనుమతులు రాలేదు. 12 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఆర్‌అండ్‌బీ అతిథిగృహ నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆత్మకూరు పట్టణ పరిధిలోని నెల్లూరుపాలెం వద్ద నున్న పాత ఆర్‌అండ్‌బీ అతిథిగృహం (ఇన్‌స్పెక్షన్ బంగ్లా- ఐబీ). దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనంలో కేవలం ఒక సూట్‌రూమ్ మాత్రమే ఉంది. అందులోనూ ఇది పెంకులతో నిర్మించిన బంగ్లా. నేటి పరిస్థితులకు అనుకూలంగా లేకపోవడంతో కొత్త బంగ్లా నిర్మాణానికి 2012లో ప్రతిపాదనలు వెళ్లాయి. అందుకు అనుగుణంగానే ఆత్మకూరులో కొత్త గెస్ట్‌హౌస్ నిర్మాణం మొదలైంది. ఈ పాత గెస్ట్‌హౌస్‌ను ఎవరూ ఉపయోగించడం లేదు. ఇలాంటి బంగ్లాకు ఇప్పుడు సోకులు చేస్తున్నారు. అందుకు రూ.48.50 లక్షలు ఖర్చు చేస్తున్నారు. అసలు ఈ బంగ్లా అవసరం లేదని కొత్త గెస్ట్‌హౌస్ నిర్మాణం జరుగుతున్నా.. ఇన్నెన్ని లక్షలతో పాత బంగ్లాకు మరమ్మతులు చేయడం వెనుకున్న ఉద్దేశం ఏమిటి..? అదే రూ.48.50 లక్షలను కొత్త గెస్ట్‌హౌస్‌కు మంజూరు చేసి ఉంటే అది ఎప్పుడో అందుబాటులోకి వచ్చి ఉండేది.

కొత్తది వద్దు... పాతదే ముద్దు !

- ఆర్‌అండ్‌బీ అధికారుల వింత వైఖరి
- ఆత్మకూరులో పాత ఐబీకి సోకులు
- రూ.48.50 లక్షలతో సాగుతున్న పనులు
- పాత భవనం స్థానే కొత్త అతిథిగృహం నిర్మాణం
- ఏడేళ్లుగా ఆగిపోయినా పట్టించుకోని వైనం
- ఎవరి కోసం ఈ నిధుల దుర్వినియోగం..?

నెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కొత్తది వద్దు.. పాతదే ముద్దు.. అంటున్న ఆర్‌అండ్‌బీ అధికారుల వైఖరి మాత్రం వింతగా ఉంది. ఆత్మకూరులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ల విషయంలో అధికారుల తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. నెల్లూరుపాలెం వద్ద ఎప్పుడో ఐదు దశాబ్దాల క్రితం పెంకులతో నిర్మించిన గెస్ట్‌హౌస్ శిథిలావస్థకు చేరుకుంది. కనీసం పదిమంది అధికారులతో కూడా ఈ భవనంలో సమావేశం నిర్వహించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో 2012లో ఆత్మకూరులో కొత్త ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. రూ.50 లక్షల అంచ నాతో మొదలైన పనులు చివరకు రూ.1.25 కోట్లకు చేరుకున్నాయి. దాదాపు రూ.కోటి పనులు చేశాక బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అయితే గత ప్రభుత్వంలో మరో రూ.25 లక్షలు ఇస్తే గెస్ట్‌హౌస్ పూర్తవుతుందని అధికారులు ప్రతిపాదనలు పంపినా అనుమతులు మంజూరు చేయలేదు. దీంతో ఏళ్లు గడిచిపోవడంతో కొత్త గెస్ట్‌హౌస్‌కు ఫర్నీచర్‌తోపాటు రిపేర్లు కూడా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే కొత్త గెస్ట్‌హౌస్‌ను పట్టించుకోని ఆర్‌అండ్‌బీ రాష్ట్ర ఉన్నతాధికారులు ఎన్నికలకు ముందు పనికిరాదనుకున్న పాత గెస్ట్‌హౌస్ మరమ్మతులకు రూ.48.50 లక్షలు మంజూరు చేశారు. రాష్ట్ర అధికా రులే ఈ నిర్ణయం తీసుకున్నారా..? లేక జిల్లా అధికా రులు ప్రతిపాదనలు పంపారా..? అన్నది తేలాల్సి ఉంది. ఇవే నిధులు అప్పుడే కొత్త భవనానికి మంజూ రు చేసి ఉంటే ఈ పాటికి ఆ భవనం అందుబాటు లోకి వచ్చేది. ప్రస్తుతం పాత భవనంలో మరమ్మతు లు చేస్తుండడం గమనార్హం. కాగా ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొత్త గెస్ట్‌హౌస్‌ను సందర్శించారు. ఈ గెస్ట్‌హౌస్ ఆవశ్యకతను కలెక్టర్‌కు వివరించారు. దీంతో వెంటనే కలెక్టర్ తన నిధులు రూ.88.50 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచి ఉన్నారు. త్వరలోనే కొత్త భవనం కూడా పూర్తి కానుంది.

ఉన్నతాధికారులు అనుమతులిచ్చారు..

ఆత్మకూరులో పాత ఐబీ మరమ్మతులకు ఎన్నికలకు ముందు రాష్ట్ర ఉన్నతాధికారులు అనుమతులు మంజూరు చేశారు. వారి ఆదేశాల మేరకు ప్రస్తుతం పనులు చేస్తున్నాం. కొత్త గెస్ట్‌హౌస్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తాజాగా కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం టెండర్లు పిలిచి ఉన్నాం.

- గంగాధర, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ



మధ్యాహ్న భోజనం చేస్తూ విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

క్షేత్రస్థాయిలో విషయాలు తెలుసుకునేందుకు పర్యటన

- కలెక్టర్ ఆనంద్

వెంకటాచలం, జూలై 9 : అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించడంతోపాటు పలు విషయాలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. తొలుత వెంకటాచలం పంచాయతీ వడ్డీపాళెం అంగన్‌వాడీ కేంద్రాన్ని, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, చెముడుగుంట వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సైన్స్ మ్యూజియాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించి రుచి చూశారు. అలాగే ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై రోగులతో మాట్లాడి, ఆసుపత్రికి సంబంధించిన పలు విషయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులందరిని మ్యూజియానికి తీసుకొచ్చి వారికి సైన్స్‌పరమైన అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. వైద్య సేవల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, డీఈవో రామారావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

క్వార్ట్జ్, సిలికా భోక్తలపై వేటు !?

- ఇప్పటికే నివేదికను అందచేసిన అధికారులు
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో వైసీపీ నేతల్లో వణుకు
- వందలాది కేసులు నమోదయ్యే అవకాశం



నెల్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాపం పండుతోంది. అధికారమే అండగా సహజ వనరులను అడ్డంగా దోచుకుతిన్న వైసీపీ వర్గాలపై వేటుకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్రంగా గత ఐదేళ్లలో సాగిన సిలికా, క్వార్ట్జ్ దోపిడీపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. బాధ్యులపై చర్యలకు ఆదేశించారు. దీంతో జిల్లాకు చెందిన పలువురు వైసీపీ నేతల్లో వణుకు మొదలైంది. అగ్రనాయకుల కోసం ఇష్టారాజ్యంగా సిలికా, క్వార్ట్జ్ క్వారీలపై పడి దోపిడీ చేసిన వందలాది మంది వైసీపీ ద్వితీయశ్రేణి నాయకులు చట్టపరమైన చర్యలకు సిద్ధపడాల్సిన సమయం ఆసన్నమయ్యింది. పలువురు వైసీపీ అగ్రనాయకులు సైతం ఈ కేసుల్లో బాధ్యులుగా చట్టం ముందు నిలబడాల్సి వస్తున్నది. సీఎం చంద్రబాబు నాయుడు త్వరలో గనుల శాఖలో జరిగిన దోపిడీపై విడుదల చేయబోయే శ్వేతపత్రంతో అక్రమార్కుల అరెస్టు పర్వం ప్రారంభం కానున్నది. జిల్లా అధికారులు ఇప్పటికే ఇచ్చిన నివేదిక ప్రకారం చిన్నాపెద్దా అంతా కలిపి సుమారు 200 మంది వైసీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

అక్రమ రవాణాలో అగ్రనేతల పేర్లు ?

చివరి ఏడాదిన్నరకాలం పాటు జిల్లాలో క్వార్ట్జ్ దోపిడీ నిరాటంకంగా సాగిన విషయం తెలిసిందే. ఈ దోపిడీపై జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా నివేదిక పంపారు. ఇందులో సుమారు 200 మందికిపైగా వైసీపీ నాయకుల ప్రమేయం ఉన్నట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. జిల్లాలో జరిగిన క్వార్ట్జ్ దోపిడీలో వైసీపీ ముఖ్య నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలపై పెద్ద ఎత్తున ఆరోపణలు, అభియోగాలు వెల్లువెత్తాయి.సజ్జల సూచన మేరకు జిల్లాలో క్వార్ట్జ్ దోపిడీ మొదలయ్యిందని, అధిష్ఠానం అనుమతితో అనిల్‌కుమార్ యాదవ్ దాన్ని గంపగుత్తగా కైవసం చేసుకున్నారని, సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలో మాజీ మంత్రి కాకాణి ప్రభుత్వ భూముల్లోని క్వార్ట్జ్ నిక్షేపాలను కొల్లగొట్టారని అప్పట్లోనే పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. నిజమైన లీజుదారులను సైతం క్వారీల్లోకి రానీయకుండా దౌర్జన్యంగా క్వారీలను కైవసం చేసుకున్నారని, క్వార్ట్జ్ దోపిడీపై సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారుల్లో కదలికవచ్చింది. ఆ క్రమంలోనే విచారణ జరిపి లక్షల టన్నుల క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు జరిగాయని అధికారులు నివేదిక పంపారు. ఈ అక్రమ తవ్వకాల్లో వైసీపీకి చెందిన అగ్ర నాయకులతో పాటు 200 మంది ద్వితీయ శ్రేణి నాయకులు భాగస్వాములుగా ఉన్నారని నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ నివేదిక సీఎం చంద్రబాబుకు దృష్టికి వెళ్లింది. అలాగే ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో ఐదేళ్లపాటు సాగిన సిలికా దోపిడీపై కూడా సీఎం దృష్టి సారించారు. గూడూరు డివిజన్ పరిధిలో 4500 ఎకరాల్లో సిలికా రీచ్‌లు ఉన్నాయి. 80 మంది లీజుదారులు ఉన్నారు. వైసీపీ నాయకులు ఈ లీజుదారందరిని నట్టేట ముంచారు. అధికార బలంతో వీరందరి లీజులను బలవతంగా స్వాధీనం చేసుకున్నారు. అది చాలదన్నట్లు సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఉన్న సిలికాను దోచుకున్నారు. ఐదేళ్ల పాటు అడ్డు అదుపు లేకుండా అధికారమే అండగా సాగిన ఈ దోపిడీపై కూడా చంద్రబాబు దృష్టి సారించారు. గూడూరు డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఈ కేసులో బాధ్యులుగా గుర్తించబడ్డారు. సోమవారం సీఎం చంద్రబాబు గనుల శాఖపై నిర్వహించిన సమీక్షలో నెల్లూరు జిల్లా కేంద్రంగా జరిగిన క్వార్ట్జ్, సిలికా దోపిడీపై సమగ్ర నివేదికను సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాకు చెందిన పలువురు అక్రమార్కుల్లో వణుకు మొదలయ్యింది. అగ్రనాయకుల ప్రాపకం కోసం దగ్గరుండి కొండలు, గుట్టలు కొల్లగొట్టిన పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు అందుకు తగిన మూల్యం చెల్లించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కేసులో పలువురు వైసీపీ అగ్రనాయకులు సైతం చిక్కుల్లో పడే సూచనలు కనిపిస్తున్నాయి.

ఇరిగేషన్ ఎస్‌ఈలతో మంత్రి నిమ్మల సమీక్ష



ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును సన్మానిస్తున్న జిల్లా ఎస్‌ఈలు

నెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఇరిగేషన్ పరిస్థితులపై రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షించారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్‌ఈలతో ఆయన సమావేశమయ్యారు. ఈ వారంలో నెల్లూరుకు రానున్న నేపథ్యంలో రెగ్యులర్ ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, టీజీపీ ఎస్‌ఈ రమణారెడ్డి, సోమశిల ఎస్‌ఈ రమణారెడ్డిలను సచివాలయానికి పిలిపించారు. ఆయా సర్కిళ్లలో జరుగుతున్న పనులు, ఆయకట్టుపై సమీక్షించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఈలు మంత్రిని సన్మానించారు.

నేటితో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

- కొనసాగుతున్న వెబ్ ఆప్షన్ల నమోదు
- జిల్లాలో 14 కళాశాలలు
- అందుబాటులో 11,574 సీట్లు
- 16న సీట్ల కేటాయింపు
- 19 నుంచి తరగతులు



విద్యార్థులకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారి(ఫైల్)

ఇంజనీరింగ్ సీటే కీలకం !

నెల్లూరు (విద్య), జూలై 9 : ఇంజనీరింగ్ కావాలనుకునే విద్యార్థుల కల నెరవేరడానికి తొలిమెట్టు ఎక్కే ప్రక్రియకు రంగం సిద్ధమైంది. గతేడాది ఏ కళాశాలలో ఏ కేటగిరికి ఎన్నో ర్యాంకు వరకు సీటు వచ్చింది..? అనే వివరాలను పరిశీలిస్తూ.. తమకు సీటు ఎక్కడ వస్తుందోనని విద్యార్థులు లెక్కలు వేసుకుంటున్నారు. మరోవైపు అత్యధికులు కంప్యూటర్ సైన్స్‌పైనే ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కౌన్సెలింగ్ కొనసాగుతుండగా, వెబ్ ఆప్షన్‌ల నమోదులో విద్యార్థులు బిజీగా ఉన్నారు.

సగానికి తగ్గిన కళాశాలలు

గత పదేళ్లలో జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలు దాదాపు సగానికి తగ్గిపో యాయి. గతంలో 21 కళాశాలలు ఉండగా, వీటిలో రెండేళ్ల క్రితమే మూడు కళాశాలల్లో ప్రవేశాల నిర్వహణ నిలిపివేశారు. తాజాగా మరో నాలుగు కళాశాలలు కూడా ప్రవేశాలు నిలిపివేశాయి. ఏఐసీటీఈ విడుదల చేసిన జాబితా ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలో 14 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు మాత్రం అందుబాటులో ఉన్నాయి.

అందుబాటులో 11,574 సీట్లు

జిల్లాలోని 14 ఇంజనీరింగ్ కళాశాలల్లో 11,574 సీట్లు అందుబాటు లో ఉన్నాయి. వీటిలో సీఎస్‌ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు కళాశాల స్థితిగతులు, సౌకర్యాలు, ఫ్యాకల్టీలు, క్యాంపస్ ఇంటర్వ్యూలు తదితర విషయాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసుకుంటున్నారు. గతేడాది జిల్లాలో కొన్ని బ్రాంచ్‌లవైపు విద్యార్థులు మొగ్గు చూపారు. అత్యధికంగా సీఎస్‌ఈ, ఈసీఈ సీట్లు భర్తీకాగా మెకానికల్, సివిల్ విభాగాలకు రెండో ప్రాధాన్యం ఇచ్చారు. చివరగా ఈఈఈలో కొంత మంది మాత్రమే చేరారు. ఇంజనీ రింగ్‌లో బ్రాంచ్‌ల ఎంపికే కీలకమని విద్యావేత్తలు చెబుతున్నారు. ఈఈఈ తో పాటు విద్యుత్, ఓఎన్‌జీసీ, పవర్ గ్రిడ్‌లు, బీఎస్ఎన్ఎల్ తదితర సంస్థల్లో అపార ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఎవర్‌గ్రీన్ బ్రాంచ్‌గా ఈసీఈని పిలుస్తారు. అంతరిక్ష, సమాచార సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు ఈ బ్రాంచ్ కీలకంగా మారడంతో అవకాశాలు అపారంగా ఉంటాయి. సీఎస్‌ఈ పూర్తిచేసిన వారికి ఇక తిరుగుండదు. శారీరక శ్రమకు వెనుకాడని వారికి మెకానికల్ మంచి విభాగమని నిపుణులు చెపుతున్నారు. నిర్మాణ రంగంలో రాణించాలంటే సివిల్ ఇంజనీరింగ్ మేలని చెబుతున్నారు. వీటన్నింటిని పరిశీలించి తమకు తగిన విధంగా విద్యార్థులు బ్రాంచ్‌లను ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

షెడ్యూల్ ప్రకారం..

ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్ కౌన్సెలింగ్ జరుగుతున్నట్లు జిల్లా సహాయ కేంద్రం, సమన్వయకర్త, ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామ్‌ప్రసాద్ తెలిపారు. ఒకటి నుంచి 10 వరకు కౌన్సెలింగ్ జరగ్గా, తాజాగా విద్యార్థులు కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపికకు వెబ్ ఆప్షన్‌ల ఎంపిక చేసుకుంటున్నారన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజు కనిష్ఠంగా రూ.4వేలు, గరిష్ఠంగా రూ.1.05లక్షలుగా ఉంది. ఈనెల 13వతేదీ వరకు వెబ్‌ఆప్షన్‌లు మార్చుకునే అవకాశం ఇచ్చారు. 16న కళాశాలలు, బ్రాంచ్‌ల సీట్ల కేటాయింపు జాబితా వెల్లడిస్తారు. సీట్లు దక్కించుకున్న విద్యార్థులు ఈనెల 17 నుంచి 22వతేదీ వరకు సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేసుకోవాలి. 19వతేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

ఎన్‌ఎంసీ కమిషనర్ వికాస్ మర్మత్ బదిలీ

- కడా పీడీగా నియామకం



వికాస్ మర్మత్

నెల్లూరు(సిటీ), జూలై 9 : నెల్లూరు నగర పాలక సంస్థ (ఎన్‌ఎంసీ) కమిషనర్ వికాస్‌మర్మత్ బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్ను కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు. ఏడాది క్రితం రాష్ట్ర సచివాలయాల విభాగం నుంచి ఎన్‌ఎంసీ కమిషనర్‌గా వచ్చిన ఆయన నెల్లూరులో పనిచేస్తూ బదిలీ అయ్యారు. కాగా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఎన్‌ఎంసీ కమిషనర్‌గా ఎవరు వస్తారన్నది ఆసక్తిగా మారింది.

రేపు వెంగమాంబ పదహారు రోజుల ఉత్సవం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసి ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ పదహారు రోజుల ఉత్సవం గురువారం నిర్వహించనున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం అనంతరం పదహారు రోజుల తరువాత వచ్చే మొదటి గురువారం ఈ ఉత్సవం నిర్వహించడం సాంప్రదాయం. ఈ ఉత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ మంగళవారం తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ప్రతిబడిలో ఇద్దరు టీచర్లను నియమించాలి

వలేటివారిపాలెం, జూలై 9: విద్యార్థుల హాజరుతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కళ్లగుంట మోహన్‌రావు తెలి పారు. అయ్యవారిపల్లె కాంప్లెక్స్ పరిధిలోని పోలినేనిపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో బీటీఏ సభ్యత నమోదు చేయించారు. సంగా మహేంద్ర, దేపూరి శివనారాయణ వెంకట్రావ్, వెంకటేశ్వర్లు, వలేటి మాలకొండయ్య పాల్గొన్నారు.



బహువార్షిక పశుగ్రాసం సాగు చేసుకోవాలి

● పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చంద్రమోహన్

కందుకూరు, జూలై 9: పాడి రైతులు బహువార్షిక పశుగ్రాసాలను సాగుచేసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చంద్ర మోహన్ సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా కొండికందుకూరు రైతులకు మంగళవారం మేలైన పశుగ్రాసాల సాగు, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కనుపుల గడ్డిని మూడు నాలుగు అంగుళాల సైజులో కత్తిరించి వేస్తే పశువుల్లో 10శాతం వరకు పాలదిగుబడి పెరుగుతుందని వివరించారు. అనంతరం కోవూరు పశువైద్యాధికారి సు. దాకర్ మాట్లాడారు. పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి వివరించి, ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లెలమూడిలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ స్కీం ద్వారా బెజవాడ శ్రీను నిర్మిస్తున్న గొర్రెలషెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది విజయసాగర్, జయసుహాస్, లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.


గొర్రెలషెడ్‌ను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ, పశువైద్యాధికారి

నిమ్మచెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు, జూలై 9: వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురంలో పెగడ నరసింహం అనే రైతు పొలంలో నిమ్మచెట్లు నరికివేసిన వారిని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని, బాధితుడికి నష్ట పరిహారం అందేలా చూడాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బాధితుడితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ ఘటనపై వలేటివారిపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా చర్యలు తీసుకోక పోవటంతో నిమ్మచెట్లు నరికివేసే వరకు పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సమావేశంలో అనుమోలు లక్ష్మీనరసింహ, అంజయ్య, ఆనంద్‌మోహన్, ఎస్కే.హుస్సేన్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు



రికార్డులో ఒకరు.. ఆన్‌లైన్‌లో మరొకరు..సాగులో వేరొకరు..

● ఇదీ అంకభూపాలపురంలో భూ వివాదాల పరిస్థితి
● ఘర్షణలకు సిద్ధమవుతున్న బాధితులు
● సమస్యలను పరిష్కరించడంలో అధికారుల విఫలం

వలేటివారిపాలెం, జూలై 9: మండలలోని అంకభూపాలపురంలో ఏళ్ల తరబడి భూ వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎంతమంది రెవెన్యూ అధికారులు మారినా భూ వివాదాల పరిష్కరించడంలో విఫలం అవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒక భూ సమస్యపై వావాదాలు చోటుచేసుకొని బాధితులు ఘర్షణలకు దిగి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. ఆన్‌లైన్‌లో ఒకరు, రికార్డులలో మరొకరు, సాగులో ఇంకొకరు ఉంటారు. రెవెన్యూ అధికారులు గతంలో ఆమ్యామ్యాలకు ఆశపడి భూముల్లోకి వెళ్లకుండానే రికార్డులు పరిశీలించకుండానే ఆన్‌లైన్ చేశారు. అంతేగాకుండా ఒకరి పొలాలను మరొకరు ఆన్‌లైన్ నమోదు చేయించుకొని దీర్ఘకాలిక పంటలు నిమ్మ, పంట సాగు చేసుకుంటున్నారు. గత రెండేళ్ల క్రితం దళితులకు చెందిన భూములను అగ్రకులాలకు చెందిన వాళ్లు ఆన్‌లైన్ చేయించుకొని నిమ్మతోటలు సాగు చేసుకున్నారనే ఉద్దేశ్యంతో దళితులు, అగ్రకులాలు సాగు చేసిన నిమ్మచెట్లను నరికివేశారు. అప్పట్లో దళితులు, అగ్రవర్ణాల మధ్య భూవివాదం తారా స్థాయికి చేరి, ఇరువురు కోర్టులో కేసులు వేసుకున్నారు. ఒకరి భూములను మరొకరు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని బ్యాంకుల్లో లక్షలు పంట రుణాలు తెచ్చుకుంటున్నారు. మూడు రోజుల నుండి ప్రెగడ నరసింహం, ప్రెగడ బలరామయ్య, ప్రెగడ చిన్నహుస్సేన్, ప్రెగడ పెద్దహుస్సేన్, ప్రెగడ చిన్నమాలకొండయ్య, ప్రెగడ పెద్దమాలకొండయ్యల మధ్య సర్వేనెంబరు 63-3లో భూ వివాదాలు జరుగుతన్నాయి. ఈ నేపథ్యంలో ప్రొక్లయినర్‌ను అడ్డుకోవడం, నిమ్మచెట్లు నరికి వేసుకోవడంతో భూ వివాదాలు చోటుచేసుకోవండతో పోలీసులు రంగప్రవేశం చేసి సమస్యను సద్దుమణిగించారు. వివాదంలో ఉన్న పొలం మాదంటే మాదంటూ ఇరువురు వివాదాలకు దిగుతున్నారు. అంకభూపాలపురం, చుండి, అయ్యవారిపల్లెలో నిత్యం భూవివాదాలు చోటుచేసుకోవడంతో పోలీసులకు తలపొప్పిగా మారింది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించకపోతే భూ వివాదాలు చినికి చినికి గాలివానలా మారి ఇరువురు రాళ్లు కర్రలతో ఘర్షణలకు దిగి ప్రాణాలు తీసుకునే పరిస్థితి నెలకొంది. ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా ఉండాలంటే తక్షణమే అధికారుకలు తగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



ఫారెస్టులో గుర్తుతెలియని యువకుడి మృతదేహం

గుడ్లూరు, జూలై 9: గుర్తుతెలియని యువకుడి మృతదేహం మంగళవారం మండలంలోని శాంతినగర్ ఎస్టీకాలనీ, ఏలూరుపాడు చెరువుకు సమీపంలోని అడవి ప్రాంతంలో వెలుగుచూసింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. 30ఏళ్ల వయసు కలిగిన మనిషి మృతదేహం, పూర్తిగా కుళ్లిపోయి కేవలం ఎముకలు మాత్రమే కనిపిస్తున్నాయి. పోలీసులకు తొలుత సమచారం రావడంతో సంఘట స్థలానికి చేరుకొని మతదేహాన్ని పరిశీలించారు. ఆనవాళ్లు లేకపోవడంతో పచ్చని రంగు టీషర్ట్, నీలి రంగుజీన్స్ ధరించిన యువకుడిగా గుర్తించారు. నెలరో జుల క్రితం మృతి చెంది ఉంటాడని గ్రామస్థులు అంచనా వేస్తున్నారు. దొరికిన దుస్తులు ఆధారంగా సుమారు 5.5అడుగులు ఎత్తు ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి, కందుకూరు ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని పంపించారు. ఈ ఘటనపై అనేక కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు కందుకూరు డీఎస్పీ ఏ.శ్రీనివాస్, గుడ్లూరు సర్కిల్ సీఐ సుబ్బారావు, గుడ్లూరు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. పైన తెలిపిన ఆనవాళ్లు కలిగిన యువకుడు ఎక్కడైన కనిపించకుండా పోయినట్లు తెలిస్తే వెంటనే గుడ్లూరు పోలీసులకు సమచారం అందించాలని పోలీసులు కోరారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభించండి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

గుడ్లూరు, జూలై 9: మండలంలో ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించి, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నేలటూరి తిరుపాలు, మల్లేశ్వరి, మంగమ్మ, సుబ్బయ్యలు డిమాండ్ చేశారు. ఈ విషయంపై మంగళవారం ఎంపీడీఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు వెంకటేశ్వర్లు మాట్లాడారు. గతంలో పనిచేసిన మూడువారాల పనులకు సంబంధించిన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడారు. బుధవారం నుంచి పనులు ప్రారంభిస్తామని, పెండింగ్ బిల్లులు కూడా కూలీల ఖాతాకు వేసేలా చర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో కొట్టే వెంకయ్య, దామా కృష్ణయ్య పాల్గొన్నారు.



వీఆర్ కోటలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ


వీఆర్ కోటలో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

లింగసముద్రం, జూలై 9: డయేరియా, డెంగ్యూ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వీఆర్ కోట జెడ్పీ హైస్కూల్ ప్రధానోపా ధ్యాయురాలు ఇందిర తెలిపారు. మంగళవారం వీఆర్‌కోటలో ఆరోగ్య సిబ్బంది, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, మానవహారం నిర్వహించారు. వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధుల నివారణకు ఆరోగ్య సిబ్బందితో ప్రజలు సహకరించాలన్నారు. అలాగే దోమలు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎస్.షామిలి, ఏఎన్ఎం రత్నకుమారి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పోకూరులో
యుద్ధప్రాతిపదికన కొత్త స్తంభం ఏర్పాటు

● విద్యుత్ అధికారులకు గ్రామస్థుల అభినందన

వలేటివారిపాలెం, జూలై 9: పోకూరులో సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షాలకు, వీచిన పెనుగాలులకు విద్యుత్ స్తంభం నెలకొరిగింది. ఈ సమస్యతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. స్పందించిన విద్యుత్ ఏఈ మధుబాబు సంఘటనా స్థలానికి వెళ్లి బడేవారిపాలెం ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేశారు. అంతేగాకుండా నేలకొరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో యుద్ధప్రాతిపదికన ప్రొక్లెయిన్‌తో కొత్త స్తంభంను ఏర్పాటు చేశారు.





ఆదమరిస్తే అంతే సంగతులు

వలేటివారిపాలెం, జూలై 9: మండలకేంద్రం నుంచి లింగసముద్రం నకు వెళ్లే ప్రధానరోడ్డు చిన్నపాలెం వద్ద అధ్వానంగా తయారైంది. రోడ్డుపైనే ఎక్కడ చూసినా అడుగడుగునా మోకాటిలోతు గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో వర్షపునీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక వెళ్లి ప్రమాదాలకు గురవు తున్నారు. వర్షం పడిన సమయంలో అయితే వారు పడే బాధలు వర్ణనా తీతం. రహదారికి రెండువైపులా గృహనిర్మాణదారులు తమ ఇళ్ల ముందు ఎత్తుగా గ్రావెల్ పోసుకున్నారు. దీంతో వర్షం నీరు పోయే దారి లేక రహదా రిపైనే నిలబడి మురుగునీరుగా మారుతున్నాయి. వలేటివారిపాలెం బస్టాండు సెంటరు నుంచి చవిటివాగు వద్దకు 500మీటర్లు సిమెంటు రోడ్డు నిర్మించి సిమెంటు రోడ్డుకు రెండు వైపులా వర్షంనీరు పోయేందుకు డ్రైనేజీ నిర్మిస్తే రహదారిపై వర్షం నీరు నిల్వలేకుండా సమస్య పరిష్కార మవుతుందని స్థానికులు చెబుతున్నారు.


గుంతలమంగా మారిన రోడ్డు

ఉదయం పూట బస్సుల్లేక ఇక్కట్లు

లింగసముద్రం. జూలై 9: మండలంలోని కొండాపురం నుంచి లింగసముద్రం మీదుగా కందుకూరు వెళ్లేందుకు ఉదయం 6.30 గంటల నుంచి 8.30 గంటల మధ్యలో సుమారు 2గంటల పాటు బస్సు సౌకర్యం లేక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నాలుగేళ్లుగా ఈ సమస్య ఉండటంతో అత్యవసర పనులు కోసం సకాలంలో వెళ్లలేక పోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. చేసేదిలేక హాస్పిటల్‌కు, దూర ప్రాంతాలకు వెళ్లేవారు, కందుకూరులోని కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఇతర వాహనాల్లో వెళుతూ నానా అగచాట్లు పడుతున్నారు. ఈ సమయంలో బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఆర్టీసీ ఆర్ఎం, కందుకూరు డీఎంకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని మండిపడుతున్నారు. అయితే 8.30తరువాత వచ్చే బస్సులు బాగా రద్దీగా ఉండడంతో మహిళలు, వృద్ధులు, ఆరోగ్యం బాగు లేనివారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కందుకూరు నుంచి ఉదయం 5.30 బయలుదేరి కొండాపురంకు వచ్చి, తిరిగి అక్కడి నుంచి 7.30 గంటలకు బయలుదేరి లింగసముద్రంకు 8 గంటలకు వచ్చేది. ఈ బస్సును కలిగిరికి పొడిగించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.











